12-10-25 Samayam_Layout 1 10/12/2025 3:36 AM Page 1

SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 12 | ఎడిటర్ : విక్రం కుమార్ | ఆదివారం 12 అక్టోబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |

# హైకోర్టు స్టేతో సుప్రీంలో సవాల్




## 42శాతం బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం

**పార్టీ నేతలు, మంత్రులతో చర్చించిన సీఎం రిజర్వేషన్లకు కట్టుబడి ఉ న్నామని సీఎం రేవంత్**



బీసీ రిజర్వేషన్ల పై సుప్రీం కోర్టుకు వెళ్లాలని నిర్ణయం తీసుకుంది. సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించనుంది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన జీవో 9 పై తెలంగాణ హైకోర్టు స్టే విధించడంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైకోర్టు తీర్పు ను స్టడీ చేసిన ప్రభుత్వం.. సీనియర్ కౌన్సిల్‌తో సుప్రీంకోర్టులో వాదనలు వినిపించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు.

**హైదరాబాద్, అక్టోబర్ 11:** బీసీ రిజర్వేషన్లపై జీవో 9పై హైకోర్టు స్టే ఇవ్వటంతో స్థానిక ఎన్నికలకు బ్రేక్ పడినట్లు అయింది. ఎన్నికల సంఘం కూడా నోటిఫికేషన్ నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలపై కసరత్తు చేస్తోంది. హైకోర్టు ఇచ్చిన స్టే సవాల్ చేస్తూ. సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమైంది. అభిషేక్ మను సింగ్వితో పాటు సిద్దార్థ దవే.. రిజర్వేషన్లపై ప్రావీణ్యం కలిగిన అడ్వకేట్‌లతో వాదనలు మిగతా 2 లో

# వికసిత్ భారత్‌లో రైతులది ముఖ్య భూమిక

## ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను పండించాలి

- ఇతర దేశాలపై ఆధారపడకుండా స్వయంసమృద్ధి సాధించాలి
- జీఎస్‌టీ సంస్కరణతో రైతులు, గ్రామీణ రంగానికి ప్రయోజనం
- సాగు వ్యయం తగ్గించేందుకు పదేళ్లలో రూ.13లక్షల కోట్ల సబ్సిడీ
- ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని ప్రారంభించిన మోదీ



**న్యూఢిల్లీ :** దేశం వికసిత్ భారత్ వైపు అడుగులు వేయడంలో రైతులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. భారత్ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే.. కేవలం వరి, గోధుమ పంటల పైనే కాకుండా ప్రొటీన్ అధికంగా లభించే పప్పులకు సంబంధించిన సాగును మరింత పెంచాలని రైతులకు సూచించారు. ప్రపంచ మార్కెట్‌లకు ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను పండించాలన్నారు. దేశంలో పంటల ఉత్పత్తికి అయ్యే ఖర్చులు తగ్గించి.. రైతుల ఆదాయం పెంచే దిశగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో పదేళ్లలో వ్యవసాయ రంగంలో కేవలం రూ.5 లక్షల కోట్ల సబ్సిడీలు ఇస్తే.. తమ ప్రభుత్వం పదేళ్లలో రైతులకు రూ.13 లక్షల కోట్లకు పైగా సబ్సిడీలు ఇచ్చిందని మిగతా 4 లో

## తెలంగాణ ఐకానిక్‌గా టీ స్క్వేర్ నిర్మాణం

2


నవంబర్ నెలాఖరుకల్లా పనులు చేపట్టాలి అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం



## 4 రోజులు వర్షాలు

- తెలికపాటి నుంచి మోస్తరు వాన
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

02





## బెంగాల్లో మరో దారుణ ఘటన

వైద్య విద్యార్థినిపై గ్యాంగ్ రేప్

నిందితుల కోసం పోలీసుల గాలింపు

.. వివరాలు 2లో



## 48 గంటలు టైమిస్తున్నా!

- మధుకర్ ఆత్మహత్య బాధ్యులను అరెస్ట్ చేయాల్సిందే
- వేధించిన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాల్సిందే
- లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవు
- కాంగ్రెస్ సర్కార్‌పై హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నిప్పులు

03





## వాట్సాప్ లేకుంటే ఏమి...?

అర్టటై ఉపయోగించండి

పిటిషనర్‌కు సుప్రీం సలహా

.. వివరాలు 4లో

# కల్తీ మద్యాన్ని గుర్తించేలా మొబైల్ యాప్

## ప్రతీ కుటుంబానికీ ఆదాయం.. మెరుగైన జీవనోపాధి లక్ష్యం

### నెల్లూరులో స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం చంద్రబాబు

**అమరావతి :** ప్రతీ కుటుంబానికి మెరుగైన ఆదాయం, జీవనోపాధి కల్పించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వన్ ఫ్యామిలీ.. వన్ ఎంట్రప్రెన్యూర్ విధానంలో భాగంగా ప్రతీ ఇంటా చిరు వ్యాపారమో చిరు పరిశ్రమనో స్థాపించేలా పని చేస్తున్నామని సీఎం వెల్లడించారు. శనివారం నెల్లూరులోని మైపాడు గేట్ వద్ద ఏర్పాటు చేసిన స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌ను సీఎం అమరావతి నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. 7 కోట్లతో అత్యాధునికంగా ఈ దుకాణాలను ఏర్పాటు మిగతా 5 లో





## కాంగ్రెస్‌లో మరో ఇద్దరు మంత్రుల పంచాయితీ

- మేడారం కాంట్రాక్టుల విషయంలో రచ్చ
- వరంగల్‌లో వేలు పెడుతున్న పొంగులేటి
- మండిపడ్డ కొండా సురేఖ దంపతులు

02

మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్ మధ్య వివాదం మరువక ముందే.. కాంగ్రెస్ క్యాబినెట్ మంత్రుల మధ్య మరో లొల్లి మొదలైంది. మేడారం అభివృద్ధి టెండర్ల విషయంలో వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ఆ శాఖకు చెందిన మంత్రుల మధ్య విభేదాలు ముదిరి రచ్చకెక్కాయి. మంత్రి పొంగులేటిపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సీఎం రేవంత్ రెడ్డికి, పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు.



## విజయవాడ-సింగపూర్ విమాన సర్వీసు

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు విజయవాడ అభివృద్ధికి హద్దులు చెరిపేసిన రామ్మోహన్ నాయుడు.. త్వరలో మరిన్ని గ్లోబల్ సిటీలకు..

05



## ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్

05

15 ఏళ్లు పూర్తి చేసుకున్నందుకు ప్రత్యేక అభినందనలు



## 14న బీసీ కులాల బంద్

కిషన్ రెడ్డి మద్దతు కోరిన కృష్ణయ్య

.. వివరాలు 2లో



# బెంగాల్‌లో మరో దారుణం

## వైద్య విద్యార్థినిపై గ్యాంగ్ రేప్ ■ నిందితుల కోసం పోలీసుల గాలింపు

**కోల్‌కతా,అక్టోబర్ 11 :** పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మరో గ్యాంగ్ రేప్ ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. దుర్గాపూర్‌లోని ఒక ప్రైవేట్ మెడికల్ కాలేజీ సమీపంలో ఎంబీబీఎస్ సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగింది. సదరు విద్యార్థిని ఒడిశా రాష్ట్రం నుంచి వచ్చి పశ్చిమ బెంగాల్‌లో ఎంబీబీఎస్ చదువుతోంది. ఒడిషా రాష్ట్రం జలేశ్వర్ కు చెందిన యువతి శుక్రవారం రాత్రి పానీపురి తినేందుకు తన స్నేహితుడితో కలిసి కాలేజీ నుంచి రాత్రి 8:30 గంటల సమయంలో బయటకు వెళ్లింది. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో గమనించిన రాకాసిమూకలు దుర్మార్గానికి ఒడిగట్టారు. అమ్మాయితో ఉన్న అబ్బాయిని పక్కకు నెట్టేసి గట్టిగా కొట్టారు. ఆ అమ్మాయిని దుర్మార్గులు కాలేజీ వెనకాల ఉన్న అడవిలోకి లాక్కెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం బాధితురాలి ఫోన్ లాక్కుని దూరంగా పడేసి అక్కడి నుంచి పారిపోయారు. విద్యార్థిని స్నేహితుడు జరిగిన విషయమంతా తన హాస్టల్ లోని విద్యార్థులకు చెప్పగా అందరు కలిసి బాధితురాలిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి పేరెంట్స్‌కు జరిగిన విషయం తెలియజేయగా.. ఒడిషాలోని జలేశ్వర్ నుంచి బయల్దేరి పశ్చిమ బెంగాల్ కు చేరుకున్నాయి. తమ కూతురికి జరిగిన ఘటనపై గుండెలవిశేలా రోదించారు. తక్షణమే ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాలేజీలో సరైన భద్రతా చర్యలు లేవని యాజమాన్యంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మరోవైపు ఈ ఘటనపై దుర్గాపూర్ న్యూ టౌన్‌షిప్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. పశ్చిమ బెంగాల్ మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి షశి పంజా మాట్లాడుతూ.. విద్యార్థిని చికిత్స పొందుతోందని, వైద్యులు అప్రమత్తంగా ఉండి చికిత్స అందిస్తున్నారని చెప్పారు. యువతిపై సామూహిక అత్యాచారం చేయడం దారుణమని పేర్కొన్నారు. పోలీసుల విచారణపై తల్లిదండ్రులు నమ్మకంతో ఉన్నారన్నారు. ఇలాంటి నేరాలను రాజకీయం చేయవద్దని కోరారు. మరోవైపు కాలేజీ నుంచి రాష్ట్ర ఆరోగ్య శాఖ నివేదికను కోరింది. మహిళా జాతీయ కమిషన్ ఒక బృందం దుర్గాపూర్‌కు వెళ్లి బాధితురాలు, ఆమె తల్లిదండ్రులను కలవడం కోసం సిద్ధమవుతోంది.

# నాపై కేసులు ఎందుకు పెట్టారు?

## డీజీపీకి ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ



**హైదరాబాద్,అక్టోబర్ 11:** హైదరాబాద్‌లో తన మీద పోలీసులు నమోదు చేసిన కేసుల వివరాలను గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ బయటపెట్టారు. అక్రమ కేసులను నమోదు చేయడానికి గల కారణం ఏంటో చెప్పాలని రాష్ట్ర డీజీపీకి లేఖ రాశారు. మధ్య ప్రదేశ్‌లో జరిగిన ఓ హిందూ సభలో తాను మాట్లాడిన మాటలను పోలీసులు వక్రీకరించి కేసు నమోదు చేసారని ఫిర్యాదు చేశారు. హైరాదాబాద్ సిటీకి సంబంధం లేకుండా కేసు ఎలా పెడతారని లేఖలో ప్రశ్నించారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. రాజాసింగ్ ఫిర్యాదుపై రాష్ట్ర పోలీసులు తీసుకునే యాక్షన్‌పై ఉత్కంఠ నెలకొంది. రాజాసింగ్‌పై నమోదైన పోలీస్ స్టేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి. కాంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్, కాలా పత్తర్, నాంపల్లి, శాలిబండ, సంతోష్ నగర్, భవానీ నగర్, కామాటిపుర, హబీబ్ నగర్, అంబర్‌పేట్, బోరబొండ, హుస్సేనీ ఆలం, మాదన్నపేట, గోల్కొండ, ఫలక్‌నుమా, అత్తాపూర్, కుల్సుంపుర, పహాడీ షరీఫ్, నాంపల్లి, గుడి మల్కాపూర్, బేగంపేట, తలాబ్ కట్ట, బేగం బజార్, చంద్రాయణగుట్ట, మదనపేట పోలీస్ స్టేషన్ 2వ ఫిర్యాదు, బస్వకళ్యాణ్ కర్ణాటక పోలీస్ స్టేషన్, మలక్‌పేట, తాండూర్, బీదర్ కర్ణాటక, ముషీరాబాద్, బంజారాహిల్స్, బహదూర్‌పుర.. ఇలా మొత్తం 31 పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు అయినట్లు పేర్కొన్నారు.


# గాంధీపై అనుచిత వ్యాఖ్యలు

## నటుడు శ్రీకాంత్‌పై ఎమ్మెల్సీ ఫిర్యాదు



**హైదరాబాద్, అక్టోబరు 11 :** జాతిపిత మహాత్మాగాంధీపై సినీ నటుడు శ్రీకాంత్ భరత్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలపై పలువురు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో శ్రీకాంత్ భరత్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ శనివారం బషీర్ బాగ్ సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బల్మూర్ వెంకట్ మీడియాతో మాట్లాడారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన శ్రీకాంత్ భరత్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వాక్ స్వాతంత్రం పేరిట హద్దులు మీరి కొంతమంది మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. శ్రీకాంత్ భరత్ వ్యాఖ్యలపై సినీ ఇండస్ట్రీ పెద్దలు స్పందించాలని కోరారు. త్వరలో మా అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణు మంచుని కలిసి శ్రీకాంత్ భరత్ సభ్యత్వం రద్దు చేయాలని కోరుతామని పేర్కొన్నారు.

# గంజాయి ధ్వంసంతో తండావాసులు దాడి



**సంగారెడ్డి, అక్టోబరు 11:** సంగారెడ్డి జిల్లాలోని చల్లగిద్దా తండాలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గంజాయి మొక్కలను ధ్వంసం చేశారని పోలీసులపై తండా వాసులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. చల్లగిద్దా తండాలో గంజాయి సాగు చేస్తున్నట్లు సంగారెడ్డి జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో పోలీసులు ఇవాళ ఉదయం తండాకు చేరుకుని విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పత్తి చేనులో గంజాయి మొక్కలు కనిపించగా, వాటిని పోలీసులు ధ్వంసం చేశారు. ఈ క్రమంలో పోలీసులపై తండా వాసులు దాడికి దిగారు. రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. అంతటితో ఆగకుండా పోలీసుల సెల్‌ఫోన్లను తండా వాసులు లాక్కున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న నారాయణఖేడ్ డీఎస్పీ పోలీసు బలగాలతో చల్లగిద్దా తండాకు చేరుకున్నారు.

# హైకోర్టు స్టేతో సుప్రీంలో సవాల్

మొదటి పేజీ తరువాయి

వినిపించాలని నిర్ణయించినట్లు సమాచారం. హైకోర్టు స్టే నేపథ్యంలో స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కోసం సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయించింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి , టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, సుప్రీంకోర్టు న్యాయవాది అభిషేక్ మను సింగ్వి తదితరులు జూమ్ మీటింగ్ లో మాట్లాడారు. హైకోర్టు స్థానిక సంస్థలు ఎన్నికల నోటిఫికేషన్, జీవో 9 మీద స్టే ఇవ్వడంపై తదుపరి చర్యల గురించి సుదీర్ఘంగా చర్చించారు. జీవో 9 ని అమలు చేసేందుకు సుప్రీం కోర్ట్ తలుపు తట్టాలని నిర్ణయానికి వచ్చారు.ఈ సందర్భంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని సీఎం రేవంత్ అన్నారు. మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న లక్ష్యం గా ముందుకెళ్తోంది. బీసీలకు రిజర్వేషన్లు విషయం తేల్చే వరకు స్థానిక ఎన్నికలకు వెళ్లబోమని ఇప్పటికే మంత్రులు చెప్పారు. మరో వైపు సుప్రీం తీర్పు ప్రకారం పాతపద్దతిలో అంటే.. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకుండా స్థానిక ఎన్నికలు నిర్వహించుకోవచ్చని హైకోర్టు తెలిపింది. జీవో 9 పై మాత్రమే స్టే ఇచ్చిందని..రిజర్వేషన్ల విషయంలో క్లారిటీ ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రభుత్వానికి లేఖ రాసింది. మరోవైపు వచ్చే వారంలో క్యాబినెట్ భేటీ జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. కాగా హైకోర్టు జీవో 9పై స్టే విధిస్తూ, 2 వారాల్లో పిటిషనర్లు కౌంటర్ దాఖలు చేయాలని, అలాగే 4 వారాల్లో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. తాజాగా బీసీ రిజర్వేషన్ల పై హైకోర్టు ఆర్డర్ కాపీ వెలువడింది. జీఓ 9, 41, 42 ల పై హైకోర్టు స్టే విధించింది. ట్రిపుల్ టెస్టు పాటించకపోవడం పై హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. సుప్రీం కోర్టు నిబంధనల ప్రకారం 50 శాతం రిజర్వేషన్లు మించి ఉండడాన్ని తప్పుబట్టింది. తదుపరి విచారణ డిసెంబర్ 3 కు వాయిదా వేసింది. వికాస్ కృష్ణా రావు గవాలి, రాహుల్ రమేష్ వాగ్ కేసుల్లో సుప్రీంకోర్టు



తీర్పులను హైకోర్టు పరిగణలోకి తీసుకున్నది.

# తెలంగాణ ఐకానిక్‌గా టీ స్క్వేర్ నిర్మాణం

## నవంబర్ నెలాఖరుకల్లా పనులు చేపట్టాలి

## అధికారులతో సమీక్షలో సీఎం ఆదేశం

**హైదరాబాద్, అక్టోబర్ 11:** టీ స్క్వేర్ నిర్మాణం తెలంగాణ ఐకానిక్‌గా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఏఐ హబ్, టీస్క్వేర్ ప్రాజెక్టులపై ఐసీసీసీలో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ, టీజీఐఐసీ సంయుక్తంగా ఈ రెండు ప్రాజెక్టులు చేపడుతున్నాయి. రాయదుర్గం సమీపంలో చేపట్టనున్న టీస్క్వేర్ నిర్మాణ పనులను నవంబర్ నెలాఖరుకు ప్రారంభించాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. టీస్క్వేర్‌లో ఆపిల్ వంటి అంతర్జాతీయ సంస్థల ఔట్‌లెట్లు ఉండాలన్నారు. ఏఐ హబ్ తాత్కాలిక ఏర్పాటు కోసం ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ భవనాలను పరిశీలించాలని సూచించారు. ఏఐ హబ్ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రముఖ ఏఐ సంస్థల ప్రతినిధులతో బోర్డు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఐకానిక్ బిల్డింగ్‌గా వి-హబ్ ఉండేలా నిర్మాణం చేయాలని సంబంధిత అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో శనివారం మధ్యాహ్నం ఏఐ హబ్, టీస్క్వేర్ అభివృద్ధిపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి



శ్రీధర్ బాబు, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, సంజయ్ కుమార్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, టీజీఐఐసీ ఎండీ శశాంక, టీ ÷ఫైబర్ ఎండీ వేణుప్రసాద్, ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నవంబర్ నెల చివరి కల్లా వి హబ్ పనులు ప్రారంభం కావాలని అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు. వి హబ్ నిర్మాణం కోసం జైకా ఫండ్ వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. వి హబ్ నిర్మాణంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని.. పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని చెప్పారు. వి హబ్‌లో ఆపిల్ లాంటి ఇంటర్నేషనల్ బ్రాండ్స్ తమ ఔ÷-లటెట్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. యుటిలిటీ జోన్ ఏర్పాటు చేయడంతోపాటుగా వి హబ్ 24 గంటలపాటు పని చేయాలన్నారు. ఏఐ హబ్ తాత్కాలిక ఏర్పాటు కోసం ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీల్లో భవనాలను పరిశీలించాలని ఆదేశించారు. ఏఐ హబ్ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఏఐ సంస్థల ప్రతినిధులతో బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు.

# మరో ఇద్దరు మంత్రుల పంచాయితీ

## మేడారం కాంట్రాక్టుల విషయంలో రచ్చ ● వరంగల్‌లో వేలు పెడుతున్న పొంగులేటి

**వరంగల్, అక్టోబర్ 11:** మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్ మధ్య వివాదం మరువక ముందే.. కాంగ్రెస్ క్యాబినెట్ మంత్రుల మధ్య మరో లొల్లి మొదలైంది. మేడారం అభివృద్ధి టెండర్ల విషయంలో వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ఆ శాఖకు చెందిన మంత్రుల మధ్య విభేదాలు ముదిరి రచ్చకెక్కాయి. మంత్రి పొంగులేటిపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సీఎం రేవంత్ రెడ్డికి, పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. వరంగల్ రాజకీయాలతోపాటు దేవాదాయ శాఖలో మంత్రి పొంగులేటి జోక్యం చేసుకుంటున్నట్లు కొండా దంపతులు అందులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకి ఫోన్ చేసిన కొండా మురళి ఆయనకు ఫిర్యాదు చేశారు. పొంగులేటి తన సొంత కంపెనీకి పనులు ఇప్పించుకుంటున్నారని తెలిపారు. ఆయన వల్ల జిల్లాలో తాము ఇబ్బంది పడుతున్నామని వెల్లడించారు. అదేవిధంగా జిల్లా రాజకీయాలను ఖర్గేకి వివరించారు. పార్టీ పెద్దలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లారు. హైకమాండ్ నుంచి సానుకూల స్పందన వచ్చిందని కొండా దంపతులు పేర్కొన్నారు. కాగా, ఇటీవల మేడారంలో పర్యటించిన సీఎం రేవంత్ రేవంత్ రెడ్డి.. పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వరంగల్ జిల్లా రాజకీయాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జోక్యం చేసుకుంటున్నారంటూ కాంగ్రెస్ నేత కొండా మురళి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ జిల్లాలో పొంగులేటి పెత్తనం ఏంటని ఆయన ప్రశ్నించారు. దీనిపై ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖలో పొంగులేటి జోక్యంపై పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేకు ఫిర్యాదు చేశారు. మేడారం టెండర్ల వ్యవహారంపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పొంగులేటి సొంత కంపెనీకి పనులు ఇప్పించుకున్నారని అందులో ఆరోపించారు. ఈ వ్యవహారంలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీలతోపాటు మీనాక్షి నటరాజన్‌కు సైతం కొండా మురళి ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో హైకమాండ్ నుంచి సానుకూల స్పందన వచ్చినట్లు ఆయన తెలిపారు.

# ఐపీఎస్ అధికారి ఆత్మహత్యపై సీఎం దిగ్భ్రాంతి

## దురహంకారానికి నిదర్శనమన్న రేవంత్

**హైదరాబాద్, అక్టోబరు 11:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హర్యానా కేడర్ ఐపీఎస్ అధికారి, ఏడీజీపీ వై పూరన్ సింగ్ ఆత్మహత్య చేసుకోవడం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అణగారిన వర్గాలకు వ్యతిరేకంగా జరిగిన ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కులం కారణంగా బలవంతంగా ఆత్మహత్య చేసుకున్న ఘటనకు ఈ ఐపీఎస్ అధికారి మృతి ఒక ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. అడిషనల్ డీజీపీ స్థాయి అధికారిని కులం పేరుతో వేధించడం చూస్తే.. సామాన్య ప్రజల దయనీయ జీవన పరిస్థితులను అర్థం చేసుకో వచ్చునన్నారు. ఇలాంటి అసహనకర సంఘటన చోటు చేసుకోవడం తీవ్ర ఆందోళనకరమని విచారం వ్యక్తం చేశారు. అణచివేతకు గురైన వర్గాల పట్ల చూపిస్తున్న ద్వేషం.. సమాజాన్ని విషపూరితం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరహా అవమానకర సంఘటనల వల్ల రాజ్యాంగం, సమానత్వంతోపాటు న్యాయంపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతోందన్నారు. అణగారిన వర్గాలపై ఈ తరహా దాడులను ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలంటూ ఈ సందర్భంగా ప్రజలకు సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. ఇది ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఘటనపై దేశంతోపాటు ప్రజలంతా ఆలోచించాలన్నారు. మృతుని కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

# నాలుగు రోజులు వర్షాలు

## హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్, అక్టోబరు 11:** తెలంగాణలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర తమిళనాడు తీరప్రాంతం, పరిసర ప్రాంతాల్లో సగటు సముద్రమట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని పేర్కొంది. ఉత్తర కోస్తాంధ్ర, పరిసర ప్రాంతాల్లో సగటు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని.. దక్షిణ ఒడిశా నుంచి ఏపీ తీర ప్రాంతం మీదుగా ఉత్తర తమిళనాడు వరకు సగటు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతుందని చెప్పింది. శనివారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆదివారం కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో.. సోమవారం కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. మంగళవారం ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట,



మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

# 14న బీసీ కులాల బంద్

**హైదరాబాద్, అక్టోబరు 11:** బీసీ రిజర్వేషన్లకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసనగా ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపునిస్తున్నట్లు బీసీ సంఘాల నాయకుడు ఆర్ కృష్ణయ్య ప్రకటించారు. అన్ని బీసీ సంఘాల మద్దతుతో బంద్ నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. అందరూ కలిసి బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. రాజకీయ పార్టీలు, కుల సంఘాలు బంద్‌కు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బంద్‌కు బీజేపీ మద్దతు ఇవ్వాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కోరడం జరిగిందని తెలిపారు. దీనిపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కిషన్ రెడ్డి చెప్పారని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చాక కోర్టులు జోక్యం చేసుకోవడం ఏంటని ప్రశ్నించారు. బీసీ సంఘాలు ఇప్పటికే పెద్ద ఎత్తున రౌండ్ టేబుల్ సమావేశం, నిరసనలు, ధర్నాలు చేస్తున్నారని ఎంపీ ఆర్.కృష్ణయ్య వెల్లడించారు.

# కాళేశ్వరం కడితే.. మూడేళ్లకే కూలింది

- కృష్ణాగోదావరి జలాల్లో రాజీపడేది లేదు
- ఆల్మట్టి ఎత్తును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించం
- హరీష్ రావు అబద్ధాల ప్రచారంమానుకోవాలి
- మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్



**హనుమకొండ, అక్టోబర్ 11:** తెలంగాణ నీటి హక్కులను కాపాడేందుకు తాము పోరాడుతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్ట్‌పై కేంద్రానికి ఇప్పటికే లిఖిత పూర్వక ఫిర్యాదు చేశామని చెప్పారు. అలాగే ఆలమట్టి ఎత్తు పెంపునకు వ్యతిరేకంగా కూడా తాము ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. బనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో కట్టకుండా చూస్తామని మంత్రి ఉత్తమ్ ప్రకటించారు. అయితే నీటి పంపకాల పంచాయతీలో మంత్రి హోదాలో హాజరైన ఏకైక వ్యక్తిని తానేనని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తు చేశారు. మీరు నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ పనికి రాకుండా పోయిందంటూ హరీశ్ రావుకు చురకలంటించారు. ఈ 22 నెలల్లో కాళేశ్వరం ప్రాజక్ట్ నయాపైసా కూడా పనికి రాలేదన్నారు. మంత్రి సీతక్కతో కలిసి హనుమకొండలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిరుపయోగంగా ఉండి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నుంచి చుక్కనీరు లిఫ్ట్ చేయకుండా మేం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మూడో పంటలో కూడా భారతదేశంలో అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సృష్టించింది. ఈ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 108.5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పడుతోంది. దాంట్లో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేయబోతోంది. భారత దేశంలో ఇంత ధాన్యం ఇప్పటి వరకు ఏ రాష్ట్రం కొనుగోలు చేయలేదని మంత్రి వివరించారు. హరీశ్ రావు మంత్రిగా ఉన్న సమయంలో గోదావరి జలాలను ఆంధ్రకు అప్ప జెప్పారని గుర్తు చేశారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ వాటా నీటిని తాము కాపాడుకుంటామని తెలిపారు. తప్పడు మాటల ద్వారా అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారంటూ హరీశ్ రావుపై మండిపడ్డారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బీఆర్ఎస్ కట్టిన ఏకైక కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ కూలిపోయిందని వ్యంగ్యంగా అన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ తుమ్మడిహెట్టి వద్ద ఠట్టెడు మట్టి ఎత్త లేదని విమర్శించారు. గోదావరి జలాల విషయంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే తెలంగాణకు మేలు జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. హరీశ్ రావు మాట్లాడిన మాటలలో వాస్తవాలు ఏమి లేవని.. ఈ తరహా ప్రచారాన్ని మానుకోవా లంటూ ఆయనకు ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దేశంలోనే అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డుల కెక్కిందని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. త్వరలో ధాన్యం కొనుగోళ్లు కూడా ప్రారంభమవుతాయన్నారు. గోదావరి, కృష్ణా జలాల విషయంలో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందంటే అది భారత రాష్ట్ర సమితి పాలనలోనే. కృష్ణా జలాల్లో 511 టీఎంసీలు ఏపీ ప్రభుత్వం తీసుకోవచ్చని, తెలంగాణకు కేవలం 299 టీఎంసీలు చాలని సంతకాలు చేసింది కేసీఆర్ ప్రభుత్వమే. మన నీటి హక్కులు కాపాడే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ముందుకెళ్తున్నాం. నీటి వాటాల విషయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలే. గోదావరి- బనకచర్ల ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వ్యతిరేకిస్తోంది. ఇదే విషయాన్ని గతంలో అనేక సార్లు చెప్పాం. కర్ణాటకలో అల్మట్టి డ్యాం ఎత్తు పెంపును కూడా వ్యతిరేకిస్తున్నాం. కృష్ణా జలాల్లో 70 శాతం తెలంగాణకే కేటాయించాలని మేం వాదనలు వినిపిస్తున్నాం. పదేళ్లలో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు మాత్రమే నిర్మించింది. అది కూడా మూడేళ్లకే కూలిందని మంత్రి ఉత్తమ్ అన్నారు. అవాస్తవాలు మాట్లాడుతూ.. తమ ప్రభుత్వాన్ని బద్నాం చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి. హరీశ్ రావుకు తెలంగాణ భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. అబద్దాలను ప్రచారం చేస్తూ ఆరోపణలు చేయడం సరికాదంటూ హరీశ్ రావుకు ఆయన హితవు పలికారు. బనకచర్లపై హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. అంతేకాదు.. బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణానికి పార్టీ వ్యతిరేకమని తాము మొదటి నుంచి చెబుతున్నామని గుర్తు చేశారు.



# నల్లమల పిల్లి రేవంత్ రెడ్డి

## కృష్ణా, గోదావరి నీళ్లు దోస్తున్నా ఉలుకేదీ

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు వెటకారం

**హైదరాబాద్, అక్టోబర్ 11:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నల్లమల పులి కాదు.. నల్లమల పిల్లి అని మాజీ మంత్రి హరీశ్‌రావు సెటైర్లు వేశారు. కింది నుంచి గోదావరి నీళ్లు ఏపీ తీసుకుపోతే.. పైన కృష్ణా నీళ్లు కర్ణాటక తీసుకుపోతే, మన బ్రతుకు ఏం కావాలని హరీశ్‌రావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి మొన్న మల్లికార్జున ఖర్గేను పరామర్శించడానికి కర్ణాటకకు వెళ్లినప్పుడు, ఆలమట్టి డ్యాం ఎత్తు పెంపు గురించి సిద్ధరామయ్య, శివకుమార్ దగ్గర మాట్లాడుతాడను కున్నా. వాళ్ళ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అయినా రేవంత్ రెడ్డి మాట్లాడలేదు. ఆలమట్టి డ్యాం ఎత్తు పెంచితే తెలంగాణ ఎడారిగా మారుద్దని కనీసం బుద్ధి రేవంత్ రెడ్డికి లేదు. రాహుల్ గాంధీతో కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక ఫోన్ కూడా చేపించలేకపోతున్నాడు రేవంత్ రెడ్డి. రేవంత్ రెడ్డి ఢిల్లీకి బ్యాగులు మోయడం ఒక్కటే పని కాదు.. తెలంగాణ బాగోగుల గురించి కూడా పట్టించుకో అని హరీష్ రావు సూచించారు. ఏపీ 463 టీఎంసీల నీళ్లు మళ్లిస్తే నేను మీద 112 టీఎంసీలు ఆపుకుంటా అని కర్ణాటక అంటుంది.. నేను 74 టీఎంసీలు ఆపుకుంటా అని మహారాష్ట్ర అంటుంది. 112 టీఎంసీలు కర్ణాటక, 74 టీఎంసీలు మహారాష్ట్ర ఆపితే మన పరిస్థితి ఏంది. మాట్లాడితే నల్లమల బిడ్డ అంటాడు.. ఆ నల్లమలను అనుకొని పారే కృష్ణా నదిలో ఆ మహబూబ్ నగర్ జిల్లాకు నష్టం జరిగితే ఎందుకు మాట్లాడటం లేదు. నువ్వు నల్లమల పులివా, పిల్లివా, ఎలుకవా.. ఎందుకు మాట్లాడటం లేదు. పులి అయితే మాట్లాడేవాడివి.. పిల్లివి, ఎలుకవు కాబట్టి మాట్లాడటం లేదు అని హరీశ్‌రావు ఘాటుగా విమర్శించారు.

# 48 గంటలు టైమిస్తున్నా!

- మధుకర్ ఆత్మహత్యకు బాధ్యులైన వారిని అరెస్ట్ చేయాల్సిందే
- వేధించిన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాల్సిందే
- లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవు
- కాంగ్రెస్ సర్కార్ పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నిప్పులు



**హైదరాబాద్, అక్టోబర్11 :** "48 గంటలు టైమిస్తున్నా. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలోని వేమునపల్లి బీజేపీ అధ్యక్షులు మధుకర్ చావుకు బాధ్యులైన వారిని అరెస్ట్ చేసి జైలుకు పంపాలి. కారకులైన పోలీసులను సస్పెండ్ చేయాలి. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలుంటాయి. హైదరాబాద్ తోపాటు రామగుండం కమిషనరేట్ ను బీజేపీ కార్యకర్తలతో కలిసి ముట్టడిస్తాం. కార్యకర్తలే బాధ్యులకు తగిన గుణపాఠం చెబుతారు. అంతదాకా తెచ్చుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా" అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి డెడ్ లైన్ విధించారు. యాట మధుకర్ ది ఆత్మహత్య కాదని, కాంగ్రెస్ ప్రేరేపిత హత్య అని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతల అరాచకాలు, దౌర్జన్యాలతోపాటు పోలీసుల వేధింపులు తాళలేకే మధుకర్ ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అరాచకాలపై పోరాడి ఓడిస్తే... అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అంతకు మించి అరాచకాలు, దౌర్జన్యాలు చేస్తోందన్నారు. శనివారం సాయంత్రం బెల్లంపల్లి నియోజకవర్గంలోని వేమనపల్లి మండలం నీల్వాయికి విచ్చేసిన బండి సంజయ్ యాట మధుకర్ నివాసానికి వెళ్లారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మధుకర్ ఆత్మహత్యకు కారణాలపై ఆరా తీశారు. కాంగ్రెస్ నేతల వేధింపులు, ఇంటి పై దాడి చేసి దౌర్జన్యం చేయడమే కాకుండా మధుకర్ పైనే అత్యాచార యత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి తీవ్రంగా వేధించారని కుటుంబ సభ్యులు వాపోయారు. పోలీసుల వేధింపులు, కాంగ్రెస్ గూండాలు దౌర్జన్యాలు భరించలేకే మధుకర్ ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు రోదిస్తూ చెప్పారు. మధుకర్ తీవ్ర పేదరికంలో కొట్టు మిట్టాడుతున్నారని, సొంత ఇల్లు కూడా లేదని చెబుతూ తలుపులు కూడా లేని ఇంటిని చూపించారు. మధుకర్ కుటుంబ పరిస్థితిని కళ్లారా చూసిన బండి సంజయ్ తీవ్రంగా చలించిపోయారు. వెంటనే ఆ కుటుంబానికి తక్షణ సాయంగా రూ.లక్ష అందజేశారు. మధుకర్ కుటుంబానికి బీజేపీ పూర్తి అండగా ఉంటుందని, ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపైన, పోలీసుల తీరుపైనా తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. మధుకర్ ది ఆత్మహత్య కాదు. దుర్గామాత ఉత్సవాల్లో కొంతమంది ఫాల్తుగాళ్లు తప్పతాగి ఇండ్లు కదిలిపోయేలా డీజే సౌండ్ పెట్టి ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తే ప్రశ్నించిన మధుకర్ ఇంటిపై దాడి చేసి కొట్టారన్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన పోలీసులు వాళ్లకే వత్తాసు పలుకుతూ మధుకర్ ను వేధింపులకు గురిచేయడంవల్లే తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులతోపాటు చుట్టుపక్కల ప్రజలంతా చెబుతున్నారన్నారు. గతంలో బీఆర్ఎస్ ఇట్లనే చేస్తే వాళ్ల అరాచకాలపై పోరాడి జైలుకు పోయింది బీజేపీ కార్యకర్తలేనని, కాంగ్రెస్ ఏనాడూ ఒక్క పోరాటం కూడా చేయలేదని, కానీ, ప్రజలు ఆ పార్టీకి ఓటేసి గెలిపిస్తే.. బీఆర్ఎస్ ను మించి అరాచకాలు, దౌర్జన్యాలు చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఉంటే కేంద్రంలో బీజేపీ అధికారంలోఉందనే విషయాన్ని మర్చిపోవద్దని, రాష్ట్రంలోనూ రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని, ఈసారి అట్లాంటి వాళ్లందరికీ చుక్కలు చూపిస్తామని, గూండాగిరీ చేసే వాళ్లను యూపీ తరహాలో శిక్షిస్తామని హెచ్చరించారు.

# జూబ్లీహిల్స్ కోసం బీఆర్ఎస్ వార్ రూమ్

## పార్టీ నేతలతో కేటీఆర్ టెలి కాన్ఫరెన్స్



**హైదరాబాద్, అక్టోబర్ 11:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై ప్రతిపక్ష బీఆర్ఎస్ సీరియస్‌గా దృష్టి సారించింది. ఇందులో భాగంగా శనివారం ఉప ఎన్నిక ఇంఛార్జ్‌లతో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ టెలీ కాన్ఫిరెన్స్ నిర్వహించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంపై ఇంచార్జ్‌లకు కేటీఆర్ దిశానిర్దేశర చేశారు. మరోవైపు బై ఎలక్షన్ కోసం వార్ రూం ఏర్పాటు చేస్తోంది బీఆర్ఎస్. వార్ నుంచే ఉప ఎన్నిక కార్యకలాపాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఉప ఎన్నిక ప్రచారం, సభలు, ర్యాలీలకు బీఆర్ఎస్ ప్లాన్‌ను సిద్ధం చేస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు ర్యాలీలు నిర్వహించనున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో బీఆర్ఎస్ ముందుకు వెళ్తోంది. కాగా.. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్‌లో ఉపఎన్నిక అనివార్యమైంది. ఈ క్రమంలో జూబ్లీహిల్స్‌లో మరోసారి గులాబీ పార్టీ జెండా ఎగువేయాలనే లక్ష్యంతో ఉంది బీఆర్ఎస్. అందులో భాగంగానే జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ భార్య మాగంటి సునీత పేరును ప్రకటించింది ఆ పార్టీ. సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవడం బీఆర్ఎస్‌కు పెద్ద సవాల్ అనే చెప్పుకోవాలి. ఇప్పటికే ప్రచారాన్ని కూడా నిర్వహిస్తోంది. ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తోంది. సిట్టింగ్ స్థానాన్ని దక్కించుకోవాలనే పట్టుదలతో బీఆర్ఎస్ ఉంది. నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరుగనుంది. నవంబర్ 14న కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఈనెల (అక్టోబర్) 13న నోటిఫికేషన్ విడుదల కానుండగా.. అక్టోబర్ 21 నామినేషన్ దాఖలుకు చివరి తేదీ. అలాగే ఈనెల 22న నామినేషన్ల పరిశీలన జరుగనుంది.

# బహిర్భూమికి వెళ్లి బావిలో పడ్డ చిన్నారుల మృతి

**మహబూబాబాద్, అక్టోబరు 11:** జిల్లాలోని కొత్తగూడ మండలం ఎంచగూడెంలో విషాదం చోటుచేసుకుంది. దసరా పండుగ కోసమని ఇటీవలే ఎంచగూడెం గ్రామానికి ఇటికాల నర్సయ్య, స్వాతి దంపతుల కుమారుడు రితిక్, నర్సయ్య సోదరి అనిత, శ్రీనివాస్ దంపతుల కుమారుడు జతిన్ అమ్మమ్మ ఇంటికి వచ్చారు. అయితే వీరి బంధువు ఒకరు చనిపోవడంతో.. కుటుంబ సభ్యులందరూ వేరే గ్రామానికి వెళ్లారు. ఇంటి వద్ద ఉన్న రితిక్, జతిన్ కలిసి.. గ్రామ శివార్లలో ఉన్న వ్యవసాయ బావి వద్దకు బహిర్భుమికి వెళ్లారు. ఇద్దరు కూడా ప్రమాదవశాత్తు బావిలో పడి ప్రాణాలు కోల్పోయారు. బావిలో తేలియాడుతున్న పిల్లలను చూసి స్థానికులు అప్రమత్తమయ్యారు. పోలీసులకు సమాచారం అందించారు. కొత్తగూడ ఎస్ఐ రాజ్ కుమార్ తన బృందంతో ఘటనాస్థలానికి చేరుకుని రితిక్, జతిన్ మృతదేహాలను బావిలో నుంచి బయటకు తీశారు. ఇద్దరు పిల్లలు చనిపోవడంతో వారి తల్లిదండ్రులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



# రిజర్వేషన్లపై సుప్రీంను ఆశ్రయించండి

## ఇప్పటికే చాలా ఆలస్యం అయ్యిందన్న కవిత



**హైదరాబాద్,అక్టోబర్ 11:** తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల జీవో, ఎన్నికల నోటిఫికేషన్ అమలును నిలిపివేస్తూ హైకోర్టు ఇచ్చిన స్టేపై సుప్రీంకోర్టును రేవంత్ సర్కార్ ఆశ్రయించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఇప్పటికే చాలా ఆలస్యం అయ్యిందని.. ఇకనైనా సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆమె స్పందించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రాజకీయ రిజర్వేషన్లతోపాటు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులకు రాష్ట్ర అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదం తెలిపి 6 నెలలు గడిచిందని గుర్తు చేశారు. ఈ రెండు బిల్లులు రాష్ట్రపతి వద్దకు చేరినా ఆమోదం పొందలేదని తెలిపారు. ఈ బిల్లుల చట్టబద్ధత కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చిన్న ప్రయత్నం కూడా చేయలేదని విమర్శించారు. అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదించిన బిల్లులు రాష్ట్రప్రతి వద్ద, చట్ట సవరణ బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండగానే రేవంత్ సర్కార్ తెచ్చిన జీవో నం.9పై హైకోర్టు స్టే విధించిందని పేర్కొన్నారు. ఈరోజు ఉదయం 8.30 గంటల ప్రాంతంలో హైకోర్టు ఉత్తర్వుల కాపీ అందిందని చెప్పారు. అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదించిన బిల్లులను ఆరు నెలలుగా కోల్డ్ స్టోరేజీలో పెట్టిన కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతిపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించి న్యాయ పోరాటం చేయాలని పేర్కొన్నారు.

# ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పోరేషన్

## సిఎం రేవంత్‌కు చిన్నారెడ్డి లేఖ

హైదరాబాద్,అక్టోబరు11: ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం కోసం రాష్ట్ర ప్రభుత్వమే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ ఛైర్మన్ జి.చిన్నారెడ్డి కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తూ ఓ లేఖ రాశారు. రాష్ట్రంలో వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే, వారిని ప్రైవేటు ఏజెన్సీలు నియమించడం వల్ల శ్రమ దోపిడీకి గురవుతున్నారు. ప్రైవేటు రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇవ్వడం లేదు. సుమారు 20శాతం వరకు వేతనాల్లో కోత విధించడంతో పాటు.. జీతాలు కూడా ఆలస్యంగా ఇస్తున్నారు. ఉత్తర్ ప్రదేశ్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు ఇటీవల కేబినెట్ తీర్మానం చేసింది. తెలంగాణలో కూడా అదే తరహా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి రాసిన లేఖలో చిన్నారెడ్డి వివరించారు. దంఈఓత నిరుద్యోగులకు ఊరట దక్కుతుందని అన్నారు. అలాగే అవసరమున్నచోట ప్రభుత్వమే రిక్రూట్ చేసుకోవచ్చన్నారు.

## సంపాదకీయం



# చేపలను మింగుతున్న కాలుష్యం!

పరిశ్రమల కాలుష్యం నదులను, చెరువులను, చివరకు సముద్రాన్ని కూడా కలుషితం చేస్తోంది. మన జీవితాలు ఏమయితేనేమీ అన్న ధోరణిలో పరిశ్రమల యజమానులు కాలుష్యాన్ని విచ్చలవిడిగా వెదజల్లుతున్నారు. ఒకప్పుడు పటాన్ చెరువు కాలుష్యంపే ఏళ్లుగా పోరాటాలు జరిగాయి. తరవాత ఎల్‌బినగర్ సిరిస్ కంపెనీ కాలుష్యంపైనా పోరాటాలు సాగాయి. హుస్సేన్ సాగర్ కాలుష్యం అలాగే ఉండిపోయింది. కొబ్బరినీళ్లలా హుస్సేన్ సాగర్ నీళ్లను చేస్తానన్న కెసిఆర్ కూడా పట్టించుకోలేదు. ఢిల్లీ కాలుష్యంపై సుప్రీంకోర్టు గట్టిగానే హెచ్చరించినా అడుగులు పడడం లేదు. ఇప్పుడు ఉప్పాడ కాలుష్యం పై మత్స్యకారులు పోరాటం చేస్తున్నారు. దీనిపై డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ గట్టిగానే స్పందించారు. అయితే ఆయన పట్టుదల ఎంతవరకు అన్నది తేలాల్సి ఉంది. పట్టుదలతో కాలుష్యాన్ని అరికట్టగలిగితే చిరస్థాయిగా నిలిచిపోతారు. సముద్రాన్ని కాపాడుకున్నవారం అవుతాం. అలాగే విశాఖలో సముద్రజలాల కాలుష్యం కూడా ఇంతకుమించి ఉంది. వీటిపై ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. కాకినాడ జిల్లాలో ఉన్న పారిశ్రామిక కాలుష్యం, మైనింగ్ మూలంగా తలెత్తుతున్న కాలుష్య ఇబ్బందులపై కాలుష్య నియతం÷-రణ అధికారులతో పవన్ కళ్యాణ్ చర్చించారు. కాకినాడలో చేపట్టిన మత్స్యకారులతో మాట..మంతిలో మత్స్యకారులు ప్రస్తావించిన అంశాలు, వారి సందేహాలపై పీసీబీ నుంచి వివరాలు తీసుకున్నారు. పొల్యూషన్ ఆడిట్‌కి అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించారు. కాకినాడ జిల్లాతోపాటు గోదావరి జిల్లాల్లో ఉన్న కాలుష్య పరిస్థితులు, పర్యావరణ పరిరక్షణపై వివరాలు అడిగి పవన్ కల్యాణ్ తెలుసు కున్నారు. దీనిపై ఎలాంటి అడుగులు వేస్తారన్నది ఇప్పుడు అందరి దృష్టి ఉంది. నిజానికి ఉప్పాడ తీరంలో ఉంటున్న వారంతా సముద్రాన్నే నమ్ముకుని చేపల వేట ద్వారా కుటుంబాలను పోషించుకుంటున్న మత్స్యకారులు. ఏళ్ల తరబడి వేటే ఆధారంగా జీవిస్తున్నారు. వీరి ఉపాధికి ఫార్మా కంపెనీలు గండి కొడుతున్నాయి. ఈ పరిశ్రమల వ్యర్థాలను సముద్రంలోకి విడిచిపెడుతుండడంతో చేపల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడుతోంది. కాకినాడ జిల్లా కెఎస్‌ఇజడ్ పరిధిలో లైఫిజ్, అరబిందో ఫార్మా కంపెనీల నుంచి వచ్చే వ్యర్థాలను సముద్రంలోకి విడిచిపెట్టేందుకు యు.కొత్తపల్లి మండలంలో కోనపాపపేట, తొండంగి మండలం పెరుమల్లపురం మధ్యలో మూడు కిలోమీటర్ల పొడవున భారీ పైపు లైన్‌ను రెండేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. దీనిద్వారా ఫార్మా వ్యర్థాలు, విషపూరిత జలాలను శుద్ధి చేయకుండా సముద్రంలోకి నేరుగా విడుదల చేస్తున్నారు. అరబిందో పరిశ్రమ నుంచి కూడా భారీ పైపులైను ద్వారా వ్యర్థాలను సముద్రంలోకి విడిచి పెడుతున్నారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం చేపల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. నిర్వహణ ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ఫార్మా కంపెనీలు, తీర ప్రాంతానికి ఆనుకుని ఉన్న హేచరీల ద్వారా రసాయనిక జలాలు, ఇతర వ్యర్థాలు సముద్రంలోకి వదిలేస్తున్నారు. దీనివల్ల చేపలు దూరంగా వెళ్లిపోయాయి. కొన్ని చేపలు చనిపోతున్నాయి. పరిశ్రమల కాలుష్యంపై వైసిపి హయాం నుంచీ పోరాటం చేస్తున్నారు.. ఎవరూ పట్టించుకోవట్లేదు. ప్రభుత్వం మారిన తర్వాతైనా న్యాయం జరుగుతుందని ఆశించారు. వ్యర్థాలను శుద్ధి చేసిన తర్వాతే వ్యర్థాలను సముద్రంలోకి వదలాలని కోరుతున్నారు. యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ నుంచి తొండంగి మండలం అద్దారిపేట వరకు సుమారు 32 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉంది. ఈ రెండు మండలాల్లో 18 గ్రామాలకు చెందిన దాదాపు 50 వేల మంది మత్స్యకారులు చేపల వేటే ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. ఫార్మా కంపెనీల వ్యర్థాల వల్ల చేపలు చనిపోతున్నాయని వారు ఆందోళన చెందుతున్నారు. మూడేళ్ల నుంచి చేపల ఉత్పత్తి తగ్గిపోయిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చిన్నబోటుపై వేటకు వెళ్తే రోజుకు రూ.5 వేల నుంచి రూ.8 వేల విలువైన మత్స్య సంపద దొరికేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని చెబుతున్నారు. ఒక్కసారి వేటకు వెళ్తే చిన్నబోటుకు రూ.2 వేలు, పెద్ద బోటుకు రూ.25 వేల నుంచి రూ.30వేల వరకూ ఆయిల్‌కు ఖర్చవుతుందని తెలిపారు. పెద్ద బోట్లలో 12 మంది వరకూ వేటకు వెళ్తారని, 15 రోజుల వరకూ సముద్రం లోనే ఉండాల్సి ఉంటుందన్నారు. ఆయిల్, ఐస్, ఇతర నిర్వహణకు మొత్తంగా రూ.1.50 లక్షల వరకూ ఖర్చు అవుతుందని తెలిపారు. ఖర్చులుపోనూ గతంలో రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ ఆదాయం సమకూరేదని, ప్రస్తుతం చేపలు దొరక్కపోవడంతో ఖర్చులు కూడా రావట్లేదని ఉప్పాడ మత్స్యకారులు తెలిపారు.గత జగన్ ప్రభుత్వ హయాం నుంచి ఈ సమస్యల పరిష్కారం కోసం మత్స్యకారులు ఆందోళనలు సాగిస్తున్నారు. మత్స్యకారులు గతేడాది ఏప్రిల్‌లో పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. బీచ్ రోడ్డుని పూర్తిగా నిర్బంధించి పది రోజులపాటు నిరసన గళాన్ని వినిపించారు. ఎన్నికల కోడ్‌తో ఆందోళన విరమించారు. ఎన్నికల సమయంలో ఉప్పాడలో నిర్వహించిన బహిరంగ సభలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాట్లాడారు. కాలుష్య పరిశ్రమలను నిలిపేస్తామని హామీ ఇచ్చారు. ఆయన డిప్యూటీ సిఎం అయినప్పటికీ హామీ అమలు కాలేదు. దీంతో, మత్స్యకారులు మళ్లీ ఆందోళనబాట పట్టారు. వేల సంఖ్యలో ఉప్పాడ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ స్పందించి ఇటీవలే వారితో చర్చించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారానికి వంద రోజుల సమయం కావాలని కోరారు. న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ హామీ ఎంతవరకు అమలవుతుందో చూడాలి. అయితే వెంటనే అధికారులతో సమస్యపై చర్చించడంతో కొంత ఆశ చిగురిస్తోంది.

# నోబెల్ శాంతి బహుమతి ఇమ్మని అడగలేదు

- మచాడతో ఫోన్‌లో మాట్లాడనని ట్రంప్ వెల్లడి
- ఆమె పోరాటానికి తన మద్దతు ఉంటుందని ప్రకటన



**వాషింగ్టన్, అక్టోబర్ 11:** ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి బహుమతి దక్కకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా స్పందించారు. ఈ బహుమతి కోసం ట్రంప్ తహతహలాడిన విషయం తెలిసిందే. అయితే, ట్రంప్ 'శాంతి' ఆశలపై నీళ్లు చల్లుతూ 2025 నోబెల్ శాంతి బహుమతి వెనెజువెలా ప్రధాన ప్రతిపక్ష నాయకురాలు, ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న మరియా కొరీనా మచాడోకు నోబెల్ కమిటీ శుక్రవారం ప్రకటించింది. ఈ నేపథ్యంలో శాంతి బహుమతి దక్కకపోవడంపై ట్రంప్ తాజాగా స్పందించారు. ఈ మేరకు మరియా కొరీనా మచాడోతో ఫోన్‌లో సంభాషించినట్లు తెలిపారు. 'కొరీనా మచాడోతో ఫోన్‌లో మాట్లాడాను. నా గౌరవార్థం దాన్ని స్వీకరించినట్లు ఆమె నాతో చెప్పారు. అలా అని ఆ బహుమతి నాకు ఇచ్చేయమని నేను అడగలేదు. విపత్తు సమయంలో వెనెజువెలాలోని ప్రజలకు ఆమె చాలా సాయం చేశారు. నేను ఆమెకు తోడున్నా. ఇకముందు కూడా ఉంటా' అని వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి మరియా కొరీనా మచాడోను వరించిన విషయం తెలిసిందే. ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కోసం విశేషంగా కృషి చేసిన మచాడో వెనెజువెలా ఉక్కు మహిళగా కూడా పేరుపొందారు. టైమ్ మ్యాగజైన్ ప్రచురించిన ప్రపంచంలోని అత్యంత పలుకుబడిగల 100 మంది ప్రముఖుల జాబితాలో కూడా ఆమె చోటు దక్కించుకున్నారు. గత ఏడాది జరిగిన వెనెజువెలా పార్లమెంట్ ఎన్నికలలో భారీ స్థాయిలో రిగ్గింగ్ జరిగి ప్రస్తుత అధ్యక్షుడు నికొలస్ మదురో గెలుపొందిన తర్వాత 58 ఏళ్ల మచాడో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ శాంతి బహుమతి దక్కడంపై మరియా కొరీనా స్పందిస్తూ.. 'స్వేచ్ఛ కోసం, ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్న వెనెజువెలా ప్రజలందరికీ ఈ గుర్తింపు గొప్ప ప్రేరణ ఇస్తుంది. లక్ష్యసాధనలో విజయానికి చేరువలో ఉన్నాం. ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాలు మాకు మిత్రులు. ఈ పురస్కారాన్ని కష్టాల్లో ఉన్న వెనెజువెలా ప్రజలతోపాటు మా పోరాటానికి నిర్మాణాత్మక మద్దతు ఇస్తున్న ట్రంప్‌నకు అంకితం ఇస్తున్నా' అని అన్నారు.

# వికసిత్ భారత్‌లో రైతులది ముఖ్య భూమిక

- ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను పండించాలి
- ఇతర దేశాలపై ఆధారపడకుండా స్వయంసమృద్ధి సాధించాలి
- జీఎస్‌టీ సంస్కరణతో రైతులు, గ్రామీణ రంగానికి ప్రయోజనం
- సాగు వ్యయం తగ్గించేందుకు ఐదేళ్లలో రూ.13లక్షల కోట్ల సబ్సిడీ
- ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని ప్రారంభించిన మోడీ






**న్యూఢిల్లీ, అక్టోబరు 11:** దేశం వికసిత్ భారత్ వైపు అడుగులు వేయడంలో రైతులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. భారత్ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే.. కేవలం వరి, గోధుమ పంటల పైనే కాకుండా ప్రొటీన్ అధికంగా లభించే పప్పులకు సంబంధించిన సాగును మరింత పెంచాలని రైతులకు సూచించారు. ప్రపంచ మార్కెట్‌లకు ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను పండించాలన్నారు. దేశంలో పంటల ఉత్పత్తికి అయ్యే ఖర్చులు తగ్గించి.. రైతుల ఆదాయం పెంచే దిశగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో పదేళ్లలో వ్యవసాయ రంగంలో కేవలం రూ.5 లక్షల కోట్ల సబ్సిడీలు ఇస్తే.. తమ ప్రభుత్వం పదేళ్లలో రైతులకు రూ.13 లక్షల కోట్లకు పైగా సబ్సిడీలు ఇచ్చిందని పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో శనివారం జరిగిన ప్రత్యేక కృషి ప్రోగ్రాంలో ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా గత నెలలో అమల్లోకి వచ్చిన జీఎస్‌టీ సంస్కరణతో రైతులు, దేశంలోని గ్రామీణ రంగానికి మరింత ప్రయోజనం చేకూరిందని మోదీ చెప్పారు. గత ప్రభుత్వాలకు వ్యవసాయం పై ఎలాంటి విజన్ లేదని విమర్శించారు. రైతుల ఆదాయం పెంచేందుకు, పంటల సాగు వ్యయం తగ్గించేందుకు గత పదేళ్లుగా ఎన్డీయే ప్రభుత్వం ఎరువులపై రూ.13లక్షల కోట్ల సబ్సిడీ ఇచ్చిందని ప్రధాని మోదీ అన్నారు. యూపీఏ పదేళ్లలో రూ.5 లక్షల కోట్లు మాత్రమే సబ్సిడీగా ఇచ్చిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు వ్యవసాయరంగానికి ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని వివరించారు. రైతులకు కేంద్రంలోని గత కాంగ్రెస్ ప్రభుత్వం చేసేందేమీ లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 2004 నుంచి 2014 వరకూ యూపీఏ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయరంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. అయితే బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 11 ఏళ్లుగా రైతుల అభివృద్ధి, స్వయం సమృద్ధికి ఎన్నో చర్యలు తీసుకుందని వివరించారు. వ్యవసాయరంగానికి సంబంధించిన వివిధ శాఖలు ఇష్టారీతిలో వ్యవహరించడం వల్ల దేశంలోని వ్యవస్థాయ వ్యవస్థ బలహీనమవుతూ వచ్చిందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిలో మార్పులు చేస్తూ విత్తనాల దగ్గర నుంచి మార్కెట్ వరకూ రైతులకు ప్రయోజనాలు చేకూరే లెక్క లేనని సంస్కరణలు తెచ్చామని చెప్పారు. దేశ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు దాదాపు రెట్టింపయ్యాయని, ఆహారధాన్యాలు, పళ్లు, కాయగూరల ఉత్పత్తి సుమారు 90 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెరిగిందని, గతంలో ఇది 64 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉండేదని చెప్పారు. 2014 నుంచి తేనె ఉత్పత్తి రెట్టింపు అయిందని అన్నారు. అభివృద్ధి భారతాన్ని కోరుకుంటే ప్రతి రంగంలోనూ ఇండియా బలపడాల్సి ఉంటుందన్నారు. ఏవో కొన్ని సాధించినంత మాత్రాన తృప్తి పడిపోరాదని సూచించారు. వెనుకబడిన ప్రాంతాలపై దృష్టి పెట్టినప్పుడే గణనీయమైన ఫలితాలు ఉంటాయన్నారు. ఇవాళ యాస్పిరేషనల్ జిల్లాల్లో ప్రసూతి మరణాలు తగ్గాయని, చైల్డ్ హెల్త్ మెరుగైందని, విద్యాప్రమాణాలు పెరిగాయని చెప్పారు. ఈ జిల్లాలు ఇతర జిల్లాల కంటే మెరుగైన రీతిలో దూసుకెళ్తున్నాయని, ఈ మోడల్ ఆధారంగా వ్యవసాయంలో వెనుకబడిన 100 జిల్లాలను అభివృద్ధి చేసేందుకు దృష్టి సారించామని, ఇందువల్ల అవి మరింత మెరుగైన జిల్లాలుగా మారనున్నాయని చెప్పారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే అన్ని రంగాల్లో నిరంతరం కొత్త మార్పులు చోటుచేసుకోవాలని ప్రధాని పేర్కొన్నారు. ఈ ఆలోచనలో భాగంగానే ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు దేశంలోని 100కు పైగా జిల్లాలను వెనకబడిన జిల్లాలుగా ప్రకటించి.. ఆపై వాటిని పూర్తిగా మరిచిపోయాయని ప్రధాని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ వెనకబడిన జిల్లాలపై ప్రత్యేక దృష్టిసారించి, వాటిని ఆశావహ జిల్లాలుగా ప్రకటించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాజెక్టులను అమలుచేస్తోందన్నారు. వీటన్నింటినీ ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన కిందకు తీసుకువస్తున్నట్లు తెలిపారు. వెనకబడిన జిల్లాలలోని అనేక ప్రాంతాల్లో గత పాలకులు రోడ్లు కూడా వేయించలేదని.. అటువంటి వాటిని తమ ప్రభుత్వం డిజిటల్ ఇండియా దిశగా నడిపిస్తోం దన్నారు. గ్రామీణప్రాంత ప్రజలకు విద్య, వైద్యం, నివాసం, విద్యుత్, రోడ్డు వంటి అన్నిరకాల సదుపాయాలు కల్పించడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత పదకొండేళ్లలో రైతులు పలు విజయాలు సాధించారని.. పదివేలకు పైగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పడ్డాయన్నారు.

# వాట్సాప్ లేకుంటే ఏమి?

## అరట్టై ఉపయోగించండి • పిటిషనర్‌కు సుప్రీం సలహా



**న్యూఢిల్లీ, అక్టోబరు 11:** వాట్సప్‌కు పోటీగా తీసుకొచ్చిన స్వదేశీ మెసేజింగ్ యాప్ 'అరట్టై' పేరు ఇటీవల నెట్టింట మార్మోగుతోంది. తాజాగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టులోనూ దీని ప్రస్తావన వచ్చింది. వాట్సప్ ఖాతా పునరుద్ధరణకు సంబంధించి దాఖలైన ఓ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. వాట్సప్ లేకపోతే ఏం.. అర్టటై వాడొచ్చు కదా అని సూచించింది. తన ఖాతాను వాట్సప్ బ్లాక్ చేసిందని, దాన్ని పునరుద్ధరించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. సామాజిక మాధ్యమాలు ఇలా ఖాతాలను ఉన్నట్టుండి నిషేధించకుండా ఉండేలా మార్గదర్శకాలు జారీ చేయాలని పిటిషనర్ న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై సుప్రీం ధర్మాసనం ఒకింత అసహనం వ్యక్తంచేసింది. ఆర్టికల్ 32 కింద ఈ పిటిషన్ ఎందుకు వేశారని అడిగింది. వాట్సప్ యాక్సెస్ ఉండటం ప్రాథమిక హక్కు ఎలా అవుతుందని ప్రశ్నించింది. దీనికి పిటిషనర్ తరఫు న్యాయవాది బదులిస్తూ.. పిటిషనర్ ఓ పాలీ డయాగ్నిక్ సెంటర్‌లో పనిచేస్తున్నారు. గత 10-12 ఏళ్లుగా వాట్సప్‌లోనే తన క్లయింట్‌లతో టచ్‌లో ఉన్నారు. ఉన్నట్టుండి ఆ ఖాతాను బ్లాక్ చేశారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. అయితే ఏంటీ? కమ్యూనికేషన్ కోసం ఇతర యాప్‌లు కూడా ఉన్నాయి. వాటిని ఉపయోగించొచ్చు కదా..! ఈ మధ్యే స్వదేశీ యాప్ 'అర్టటై' కూడా వచ్చింది. దాన్ని వాడుకోండి. మేక్ ఇన్ ఇండియా! అని సూచించింది. ఈ పిటిషన్ హైకోర్టులో కూడా విచారణకు అర్హమైంది కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీనిపై ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరిస్తూ పిటిషన్‌ను తిరస్కరించింది. కోర్టు అనుమతితో పిటిషనర్ తన వ్యాజ్యాన్ని ఉపసంహరించుకున్నారు.దేశీయ సంస్థ జోహో అభివృద్ధి చేసిన అర్టటైకి విపరీతమైన ప్రజాదరణ లభిస్తోంది. ఇప్పటికే కోటి మందికి పైగా దీన్ని డౌన్‌లోడ్ చేసుకున్నారు. అర్టటై అంటే తమిళంలో పిచ్చాపాటీ సంభాషణ అని అర్థం. ఈ యాప్ ద్వారా మెసేజ్‌లు, వాయిస్, వీడియో కాల్స్ చేసుకోవటానికి, మీటింగుల్లో పాల్గొనటానికి, స్టోరీలు, ఫొటోలు, డాక్యుమెంట్స్ షేర్ చేసుకోవచ్చు.

# అఫ్ఘాన్ మంత్రి మీడియా సమావేశం

## మహిళా జర్నలిస్టులకు అందని ఆహ్వానం

## తమకు సంబంధం లేదని వెల్లడించిన కేంద్రం



**న్యూఢిల్లీ, అక్టోబర్ 11:** అఫ్ఘానిస్థాన్ విదేశాంగ శాఖ మంత్రి ముత్తకీ పాల్గొన్న ప్రెస్‌మీట్‌కు మహిళా జర్నలిస్టులను అనుమతించకపోవడంపై వివాదం రేగుతోంది. ఈ వివాదంపై తాజాగా కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఈ పత్రికాసమావేశం నిర్వహణలో తమ పాత్ర ఏమీ లేదని స్పష్టం చేసింది. పత్రికా సమావేశానికి సంబంధించి అహ్వానాలు ముంబైలోని అఫ్ఘాన్ కాన్సుల్ జనరల్‌లో గల కొందరు ఎంపిక చేసిన జర్నలిస్టులకు అందాయని విదేశాంగ శాఖ తెలిపింది. ఎంబసీ పరిసరాలు భారత ప్రభుత్వ పరిధిలోకి రావని కూడా స్పష్టం చేసింది. అఫ్ఘాన్ మంత్రి ప్రెస్ మీట్‌లో మహిళా జర్నలిస్టులు ఎవరూ కానరాలేదు. పత్రికా సమావేశానికి వెళ్లేందుకు ప్రయత్నించిన కొందరు మహిళలను కూడా అడ్డుకున్నట్టు వార్తలు వచ్చాయి. దీంతో సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. మహిళా జర్నలిస్టులందరూ గౌరవప్రదమైన డ్రెస్ కోడ్‌నే అనుసరించినా వివక్ష ఎందుకని కొందరు నెట్టింట ప్రశ్నించారు. తాలిబాన్‌ల పాలనలో అఫ్ఘాన్ మహిళలు తీవ్ర అణచివేత ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. విద్య, ఉద్యోగం, రాజకీయ రంగంలో మహిళలపై అక్కడ తీవ్ర ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితిపై ఐక్యరాజ్య సమితి కూడా ఆందోళన వ్యక్తం చేసింది. మానవ హక్కుల ఉల్లంఘనలు సంక్షోభస్థాయికి చేరుకున్నాయని పేర్కొంది.

# కల్తీ మద్యాన్ని గుర్తించేలా మొబైల్ యాప్

మొదటి పేజీ తరువాయి



చేసింది. 30 మాడ్యులర్ కంటైనర్లతో 120 దుకాణాలను ఏర్పాటు చేసి వీధి వ్యాపారులకు స్థిర వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించింది. వీటిని వర్చువల్‌గా ప్రారంభించిన అనంతరం సీఎం చంద్రబాబు నేరుగా లబ్దిదారులైన దుకాణదారులతో మాట్లాడారు. అనంతరం సీఎం మాట్లాడుతూ..."నెల్లూరులో స్మార్ట్ స్ట్రీట్‌లో దుకాణాలు పొందిన 120 మంది ఇప్పుడు ఎంట్రప్రెన్యూర్‌లు అయ్యారు. 18 ఏళ్లకు పైగా వీధి వ్యాపారాలు చేసి ఇప్పుడు అత్యాధునిక దుకాణాలు పొంది వ్యాపారాలు చేస్తున్న మీ అందరికీ అభినందనలు తెలియచేస్తున్నాను. మహిళలు, దివ్యాంగులు, వెనకబడిన వర్గాలకు ఈ దుకాణాలను అత్యంత పారదర్శకంగా కేటాయించాం. గతంలో అపరిశుభ్రమైన పరిస్థితుల్లో వ్యాపారాలు చేసుకునే స్థితి నుంచి ఇప్పుడు అత్యాధునిక దుకాణాల ద్వారా వ్యాపారం చేసుకునే సౌలభ్యం మీకు కలిగింది. కొనుగోలుదారులకు అన్ని వస్తువులూ ఒకే చోట లభించేలా ఈ స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ ప్రాంతం ఏర్పాటు అయ్యింది. ఎవరైనా ఒక వస్తువు కొనుగోలు చేయాలంటే ఎక్కడికీ వెళ్లకుండా ఒకే చోట ఉండేలా ఏర్పాటు చేయటం అభినందనీయం. రూఫ్ టాప్ సీటింగ్, వైఫై లాంటి ఏర్పాట్లు చేయటం సంతోషంగా ఉంది. ఈ వినూత్న ప్రయత్నం చేసిన మంత్రి నారాయణ, పురపాలక శాఖ, మెప్మా అధికారులను అభినందిస్తున్నాను. ఈ తరహా వినూత్న ఆలోచనలు, ప్రయత్నాలు మరిన్ని జరగాలి. అని ముఖ్యమంత్రి అన్నారు. కూటమి ప్రభుత్వం పేదలు, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేలా కార్యక్రమాలను అమలు చేస్తోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ ద్వారా నెల్లూరుకు ముందుగానే దీపావళి వచ్చిందని.. ఈ వెలుగులు శాశ్వతం చేస్తామని సీఎం అన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇదే తరహాలో ఆధునిక దుకాణాలను ఏర్పాటు చేస్తామని సీఎం స్పష్టం చేశారు. నెల్లూరు మైపాడు గేట్ వద్ద స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ ఏర్పాటు చేసి తొలిసారి ఓ మంచి ప్రయోగం చేశామని, ఇది చరిత్రలో నిలిచిపోతుందని ముఖ్యమంత్రి అన్నారు. 120 మంది చిన్నపారిశ్రామిక వేత్తలుగా మొదటి అడుగు వేశారని.. మీరు మరింతగా ముందుకెళ్లాలని ముఖ్యమంత్రి అభిలాషించారు. రాష్ట్రంలో డ్వాక్రా, మెప్మా సంఘాలకు చెందిన 1 లక్ష మంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేస్తామని అన్నారు. నెల్లూరు మైపాడు గేట్‌లో ఏర్పాటు చేసిన స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌లో దుకాణాలు దక్కించుకున్న మహిళలు అమితానందాన్ని వ్యక్తం చేశారు. మహిళా వ్యాపారులతో ముఖ్యమంత్రి అమరావతి నుంచి వర్చువల్‌గా మాట్లాడి అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ఈ స్మార్ట్ దుకాణాలు వారి జీవితాల్లో ఎలాంటి మార్పులు తెస్తాయన్న అంశాలను వారి నుంచే అడిగి తెలుసుకున్నారు. దుకాణాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని.. వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. వీధి వ్యాపారాలకు సైతం కిరాయి చెల్లించుకోలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం తమకు ఈ దుకాణలు ఇచ్చి ఆదుకుని తమ జీవితాల్లో వెలుగులు నింపిందని లబ్దిదారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన సీఎం పేదలు, మధ్యతరగతి వారి జీవన ప్రమాణాలు పెంచేందుకే ప్రభుత్వం కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ లో దుకాణాలు పొందిన మహిళా వ్యాపారులు వాటి హక్కు పత్రాలను చేతుల్లో పట్టుకుని ముఖ్యమంత్రికి చూపించి సంతోషాన్ని వ్యక్తం చేశారు. అలాగే సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమం ద్వారా నిత్యావసరాలతో పాటు వివిధ వస్తువుల ధరలు తగ్గాయని రెండు శ్లాబ్‌లతో ప్రజలపై భారం తగ్గిందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ నెల 16వ తేదీన ప్రధాని మోదీ కూడా కర్నూలుకు వచ్చి ఈ అంశాలను ప్రజలకు వివరిస్తారని ముఖ్యమంత్రి తెలిపారు. గత పాలనలో మద్యం విధానంలో చాలా అక్రమాలు చోటు చేసుకున్నాయని సీఎం అన్నారు. గంజాయి, డ్రగ్స్, నాసిరకం మద్యంతో 30 వేల మంది ప్రాణాలు తీసి ఆడబిడ్డల తాళిబొట్లు తెంచారని ఆక్షేపించారు. రాష్ట్రంలో ఎవరు నకిలీ మద్యం తయారుచేసినా, విక్రయించినా వారికి అదే చివరి రోజు అవుతుందని సీఎం హెచ్చరించారు. ఇటీవల ములకలచెరువులో నకిలీ మద్యం తయారు చేసిన వారిని పట్టుకుని కేసులు పెట్టామని ..ఈ వ్యవహారంలో టీడీపీ వారున్నా ఉపేక్షించకుండా అరెస్టు చేసి కఠినంగా వ్యవహరించామని అన్నారు. కొందరు దీనిని రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తూ శవరాజకీయాలు చేస్తున్నారని అన్నారు. తండ్రి చనిపోతే డ్రామాలాడారని.. బాబాయిని చంపేసి మాపై దుష్ప్రచారం చేయడం చూశామని వ్యాఖ్యానించారు. నెల్లూరులో సాధారణ మరణాన్ని కూడా మద్యం తాగి చనిపోయారంటూ ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. తప్పుడు ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. ప్రజలు కూడా ఫేక్ ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నకిలీ మద్యాన్ని గుర్తించేందుకు త్వరలోనే ప్రభుత్వం ఓ యాప్ ను తీసుకురానుందని సీఎం ప్రకటించారు. అనుమానం ఉన్న ఎవరైనా మద్యం బాటిల్‌పై ఉన్న హోలో గ్రామ్ స్కాన్ చేస్తే వివరాలు తెలుసుకునేలా యాప్ రూపొందిస్తున్నట్టు వివరించారు. పీపీపీ విధానంలో కొత్తగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజీల్లో నాణ్యమైన ఉచిత వైద్యం అందిస్తే వైసీపీకి వచ్చిన అభ్యంతరం ఏమిటని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. పీపీపీలో నిర్మించే వైద్య కళాశాలల్లో నాణ్యమైన వైద్య సేవలతో పాటు 110 మెడికల్ సీట్లు అదనంగా పేద విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయని సీఎం స్పష్టం చేశారు. ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్న వ్యక్తులు వారికి అనారోగ్యం కలిగితే కార్పోరేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారని.. కానీ పేదలకు మాత్రం ఉచితంగా నాణ్యమైన వైద్యం వద్దా అని నిలదీశారు. తాను ఏ పని చేసినా పేదలను దృష్టిలో ఉంచుకునే చేస్తానని, మంచి విద్య, వైద్యంతో పాటు ఆదాయం పెరిగేందుకు కృషి చేస్తానని అన్నారు. గత పాలకులు అనుసరించిన విధానంతో ఆస్పత్రులు కడితే కనీసం 20 ఏళ్లు పడుతుందని అప్పటి వరకూ పేదలు ఇబ్బందులు పడాలా అని సీఎం ప్రశ్నించారు. పీపీపీ విధానంలో రెండేళ్లలోనే ఆస్పత్రులు అందుబాటులోకి వస్తాయన్నారు. యజ్ఞంలా చేస్తున్న మంచి కార్యక్రమాలకు విఘ్నాలు కల్పించే ప్రయత్నం జరుగుతోందన్నారు. నెల్లూరులో కృష్ణపట్నం, రామాయపట్నం, దుగరాజపట్నం పోర్టులతో పాటు దగదర్తి ఎయిర్ పోర్టు, బుల్లెట్ ట్రైన్ కనెక్టివిటీ లాంటి ప్రాజెక్టులు వస్తున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజలు ఎంపిక చేసుకున్న ప్రభుత్వానికి వారి సహకారం అవసరం అని సీఎం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లా సహా నెల్లూరు జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఫోన్ చేసి ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అరుదైన మైలురాయిని పురస్కరించుకుని ప్రధాని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఇరువురు నాయకుల మధ్య జరిగిన ఈ సంభాషణ వారి మధ్య ఉన్న స్నేహపూర్వక సంబంధాన్ని మరోసారి చాటిచెప్పింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. చంద్రబాబు రాజకీయ జీవితంలో ఆయన దార్శనికత, సుపరిపాలన పట్ల నిబద్ధత స్థిరంగా కొనసాగాయని ప్రశంసించారు. "2000ల ప్రారంభంలో తామిద్దరం ముఖ్యమంత్రులుగా ఉన్నప్పటి నుంచి అనేక సందర్భాల్లో కలిసి పనిచేశాం," అని మోదీ గుర్తు చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ సంక్షేమం కోసం చంద్రబాబు ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్నారని, ఆయనకు అన్నివిధాలా శుభాకాంక్షలు తెలుపుతున్నానని మోదీ అన్నారు.ప్రధాని మోదీ ఫోన్ కాల్, ఆయన తెలిపిన శుభాకాంక్షలకు ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. "మీ దార్శనిక నాయకత్వంలో 'వికసిత భారత్' లక్ష్యాన్ని సాధించడంలో ఆంధ్రప్రదేశ్‌ను ఒక కీలక శక్తిగా నిలబెడతాం. మీ మద్దతుతో స్వర్ణాంధ్రను నిర్మించేందుకు నేను పూర్తి నిబద్ధతతో ఉన్నాను" అని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రధాని మోదీ దయతో కూడిన మాటలకు, ఆయన ఫోన్ కాల్ కు తాను ఎంతో సంతోషిస్తున్నానని పేర్కొన్నారు.

## రాష్ట్రంలో అంతటా కల్తీమయం



**విశాఖపట్టణం :** రాష్ట్రంలో ఉన్నది కూటమి ప్రభుత్వం కాదని.. కల్తీ ప్రభుత్వమని వైయస్సార్‌పీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖపట్నం వైసిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పిల్లలకిచ్చే తాగునీరు మొదలు భోజనం, ఆసుపత్రిలో మందులు, మద్యం సహా అంతా కూటమి పాలనలో కల్తీమయమైందని మండిపడ్డారు. నాడు వైయస్.జగన్ హయాంలో విద్యాంధ్రగా ఉన్న ఏపీ చంద్రబాబు పాలనలో మధ్యాంధ్రగా మారిందని ఆక్షేపించారు. కల్తీ ప్రభుత్వం తీరు ప్రజలకు అర్ధమైందని.. ప్రజా కోర్టులో కూటమి నేతలకు తగిన శిక్ష ఖాయమని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వానికి మహిళలంటే ఏ కోశాన గౌరవం లేకపోగా? చంద్రబాబునాయుడికి, టిడిపి నేతలకు మహిళల మాన ప్రాణాలంటే కూడా లెక్కలేదు. తమ ముడుపులు కోసం ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కల్తీమద్యం కుంభకోణమే ఇందుకు నిదర్శనం. దేశంలోనే అతిపెద్ద కల్తీమద్యం కుంభకోణం కూటమి ప్రభుత్వ హయాంలోనే పట్టుబడింది. ఈ కుంభకోణంలో సూత్రధారులు, పాత్రధారులు కూడా టీడీపీ నేతలేనని సాక్షాత్తూ ఎక్సైజ్ శాఖ అధికారులే చెప్పారు. తెలుగుదేశం పార్టీ నాయకులే ఊరూరా కల్తీ మద్యం సరఫరా చేస్తున్నారు. అలాంటి దుస్థితి రాష్ట్ర ప్రజలకు వచ్చింది. టీడీపీ నేతలు మహిళలు, ప్రజల ప్రాణాల పట్ల బందిపోట్లు, దోపిడీ దొంగల కంటే ఘోరంగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో నారా వారి పాలన కాస్తా కల్తీ సారావారి పాలనగా మారింది. రాష్టాన్ని చీఫ్ మినిష్టర్ పరిపాలిస్తున్నట్టు కాక చీఫ్ లిక్కర్ మాఫియా పాలిస్తున్న చందంగా తయారైంది. ఇది మంచి ప్రభుత్వం కాదు.. రాష్టాన్ని కల్తీ మద్యంలో ముంచే ప్రభుత్వమన్న విషయం కూడా తేలిపోయింది. ప్రజలకు అందిస్తున్నది కూడా సుపరిపాలన కాదు కల్తీపాలన అన్నది కూడా ప్రజలకు అర్ధమయింది. ఇది కూటమి ప్రభుత్వ పాలన కాదు, కల్తీ ప్రభుత్వ పాలన, ప్రజలకు అందుతున్నది గుడ్ గవర్నెన్స్ కాదు.. కల్తీ మద్యాన్ని అందిస్తున్న పాలన అన్న విషయం కూడా తేలిపోయింది. వైయస్ జగన్ హయాంలో రాష్టాన్ని నాణ్యమైన విద్యాంధప్రదేశ్, వైద్యాందప్రదేశ్‌గా మార్చాలని తాపత్రయపడితే.. చంద్రబాబు నాయుడు మాత్రం నాసిరకం మధ్యాంధప్రదేశ్‌గా మార్చడానికి ప్రయత్నిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. కారణం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన దగ్గర నుంచి రాష్ట్రంలో మద్యం అమ్మకాలు జోరు పెరగ్గా.. కల్తీ మద్యం అమ్మకాల కోసం అయితే చంద్రబాబు ఏకంగా ప్రణాళికలు రచిస్తున్నారు.

## ఉప్పాడ కాలుష్యంపై చర్యలు



మొదటి పేజీ తరువాయి

యంత్రాంగం పాల్గొంది. ఉప్పాడ తీర ప్రాంతంలో కాలుష్య నియంత్రణ అంశాలపై దిశానిర్దేశం చేశారు పవన్ కల్యాణ్. కాకినాడ జిల్లాలో ఉన్న పారిశ్రామిక కాలుష్యం, మైనింగ్ మూలంగా తలెత్తుతున్న కాలుష్య ఇబ్బందులపై చర్చించారు. కాకినాడలో చేపట్టిన మత్స్యకారులతో మాట.. మంతిలో మత్స్యకారులు ప్రస్తావించిన అంశాలు, వారి సందేహాలపై పీసీబీ నుంచి వివరాలు తీసుకున్నారు పవన్ కల్యాణ్. పొల్యూషన్ ఆడిట్‌కి అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించారు. కాకినాడ జిల్లాతోపాటు గోదావరి జిల్లాల్లో ఉన్న కాలుష్య పరిస్థితులు, పర్యావరణ పరిరక్షణపై వివరాలు అడిగి పవన్ కల్యాణ్ తెలుసుకున్నారు.

## విజయవాడ-సింగపూర్ మధ్య ఇండిగో నూతన విమాన సర్వీసు



**విజయవాడ:** విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం, సింగపూర్ మధ్య నూతన విమాన సర్వీస్‌ను ఇండిగో సంస్థ ప్రారంభించనుంది. ఈ సేవను నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కీలకమైన పాత్ర పోషించారు. తాజాగా ఈ సర్వీసుకు సంబంధించి వివరాలను రామ్మోహన్ నాయుడు మీడియాకు వెల్లడించారు. విజయవాడ నుండి వారానికి మూడు సార్లు మంగళ, గురు, శనివారాల్లో ఈ సర్వీసు ఉండనుందని.. ఈ నవంబర్ 15 నుండి ఈ ఇండిగో విమాన సర్వీసు ప్రారంభం కానుందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. విజయవాడ నుండి సింగపూర్ లోని ఛాంగీ విమానాశ్రయాల మధ్య నేరుగా వారానికి మూడు సార్లు ఈ విమాన సర్వీసు స్థానికులకు సేవలందించనుంది. కాగా, ఇదే సర్వీసు విషయమై ఈ సంవత్సరం జులై 28వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగపూర్ పర్యటన సమయంలో ప్రస్తావన వచ్చినట్టు రామ్మోహన్ నాయుడు గుర్తు చేశారు. ప్రవాసాంధ్రుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు.. వందరోజులలోనే సర్వీసును ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. స్వర్ణాంధ్ర 2047లో ప్రవాసాంధ్రుల పాత్ర అత్యంత కీలకమైనదని రామ్మోహన్ నాయుడు తెలిపారు. చంద్రబాబు నాయుడు.. తన విజన్ ను స్పష్టంగా అమలుచేస్తున్న నేపథ్యంలో విమానయాన అవసరాలు పెరగనున్నాయనీ.. భవిష్యత్ లో కోటికి పైగా ప్రవాసాంధ్రులు ప్రయాణాలు జరిపే అవకాశం ఉండటంతో ఇంటర్నేషనల్ కనెక్టివిటీని మరింత విస్తృతం చేస్తామని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ప్రజలు, వ్యాపారవేత్తలు, విద్యార్థుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని ఈ విమాన సర్వీసును అందుబాటులోకి తీసుకువచ్చారు. పౌర విమానయాన అభివృద్ధిలో విప్లవాత్మక ముందడుగుగా విజయవాడ ప్రాంతవాసులు, ప్రజా ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు, విద్యార్థి సంఘాలు.. ఈ సర్వీసు పట్ల ఆసక్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో స్థానికుల అభ్యర్థన, ఆలోచన మేరకు కేంద్రం సానుకూలంగా స్పందించడంతో నూతన విమాన సర్వీసు ఏర్పాటుకు రామ్మోహన్ నాయుడు మరింత చొరవ తీసుకున్నారు. ఇది కేవలం విజయవాడకే కాకుండా, తూర్పు ఆంధ్ర ప్రజలకు కూడా వరంగా మారనుంది. సింగపూర్ వంటి అంతర్జాతీయ నగరానికి ప్రత్యక్ష కనెక్షన్ లభించడంతో విజయవాడ %-% గుంటూరు ప్రాంతాల విద్యార్థులకు, పరిశ్రమలకు, పారిశ్రామికవేత్తలకు, పర్యాటకులకు నూతన అవకాశాలు ఏర్పడతాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సన్ రైజ్ స్టేట్ ఆంధ్రప్రదేశ్ లో అంతర్జాతీయ నగరం అమరావతి రూపుదిద్దుకుంటున్న నేపథ్యంలో ఈ ఇంటర్నేషనల్ కనెక్టివి మరింత లాభిస్తుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగావకాశాల కోసం, ఉన్నత విద్య కోసం అంతర్జాతీయంగా ప్రయాణించే యువతకి ఇది గొప్ప వారధిగా మారనుంది. నూతన విమాన సర్వీస్ అందుబాటులోకి తెచ్చినందుకు స్థానికులు కేంద్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా కింజరాపు రామ్మోహన్ నాయుడుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. విజయవాడ నుండి మల్టీపుల్ టైమింగ్స్‌తో ప్రయోజనం పొందేలా ఇండిగో సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంది. ప్రజా విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని ఫ్లైట్ టైమింగ్స్‌ను రూపొందించడంపై అభినందనలు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో విజయవాడ అభివృద్ధి సాధించేందుకు ఈ విమాన సర్వీసు దోహదపడుతుందని, రాబోయే రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ రూట్లు తెరవాలని స్థానికులు కోరుతున్నారు.

## దళితుల ముసుగులో దగాకోరు రాజకీయాలు

### వైకాపా తీరుపై మండిపడ్డ హోంమంత్రి అనిత



**చిత్తూరు :** దళితులకు న్యాయం చేయలేని వైకాపా పెద్దలు వారి ముసుగులో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఏపీ హోం మంత్రి అనిత మండిపడ్డారు. దళితుల జోలికొస్తే తీవ్ర చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. వెదురుకుప్పం మండలం దేవలంపేటలో ఇటీవల జరిగిన అంబేడ్కర్ విగ్రహం కాల్చివేత ఘటన నేపథ్యంలో.. శనివారం ఆ ప్రదేశాన్ని మంత్రి పరిశీలించారు.ప్రజలు బుద్ధి చెప్పినా వైకాపా నేతల తీరు మారలేదు. నకిలీ మద్యం తయారీపై కఠిన చర్యలు తప్పవు. సొంత పార్టీ నేతలున్నా చర్యలకు వెనుకాడం. అక్రమాలకు పాల్పడిన వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. నకిలీ మద్యం తయారీలో భాగస్వాములందరిపై కేసులు పెడతాం. అందులోని సూత్రధారులనూ బయటపెడతాం. దీని వెనుక ఉన్న కుట్రలను ఛేదిస్తాం అనిత అని పేర్కొన్నారు. మాజీమంత్రి పేర్ని నాని మచిలీపట్నం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి మరీ పోలీసులను బెదిరించడం దారుణమని ఈ సందరభంగా మంత్రి అనిత అన్నారు. అతని చర్యలు పోలీసులను అవమానించేలా ఉన్నాయన్నారు. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో శనివారం హోం మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. పేర్ని నానిపై చర్యలు తీసుకుంటామన్నారు. తప్పు చేసిన వారికి నోటీసులిస్తామని, కేసులు పెడతామని హెచ్చరించారు.

## కరాటే గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన మహమ్మద్ ఆసియాకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అభినందనలు





**వరంగల్ అక్టోబర్ 11. (సమయం న్యూస్) :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి గర్వకారణంగా నిలిచిన యువ ప్రతిభావంతులు మహ్మద్ ఆసియా, మహ్మద్ ఇర్ఫాన్ గిన్నిస్ వరల్డ్ రికార్డులో బంగారు పతకం సాధించడం పట్ల ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. హనుమకొండ మైనార్టీ గురుకులంలో ఇంటర్ చదువుతున్న మహ్మద్ ఆసియా మరియు కొత్తవాడ గోల్డెన్ కిడ్స్ హై స్కూల్ చదువుతున్న మహ్మద్ ఇర్ఫాన్ తమ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి తమిళనాడులో జరిగిన కరాటే మహోత్సవంలో ప్రపంచస్థాయి గౌరవం సంపాదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు ఇద్దరినీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సన్మానించి అభినందించారు. జిల్లాకు, రాష్ట్రానికి పేరు తేవడం గర్వకారణమని అభినందిస్తూ వీరిద్దరి భవిష్యత్తు మరింత ప్రతిభావంతంగా ఉండాలని కోరారు. తమిళనాడు చెన్నైలోని తాంబరం S.I.B.E.T కాలేజీలో వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మాస్టర్ బాలమురుగన్ ఆధ్వర్యంలో, లండన్ నుండి వచ్చిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారి మిస్టర్ రిషి నాద్ సమక్షంలో ఈ ప్రతిష్టాత్మక పోటీ జరిగింది.

## వరంగల్ తూర్పు లోని పలు వివాహాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన శ్రీ నన్నపునేని నరేందర్ .



**వరంగల్ అక్టోబర్ 11. (సమయం న్యూస్) :** ఈరోజు వరంగల్ తూర్పునియోజకవర్గంలోని 1) 100 ఫీట్ రోడ్ లోని శుభం గార్డెన్స్ లో 19 డివిజన్ కు చెందిన బుషిపాక రవికుమార్ కుమార్తె వివాహానికి మరియు 2) ఉరుసుగుట్టలోని నాని గార్డెన్స్ లో గట్టు అంజయ్య కుమార్తె వివాహానికి మరియు 3) శివనగర్ లోని K P S కన్వెన్షన్ హాల్లో ఇంజమూరి సూర్యనారాయణ గారి కుమారుడి వివాహానికి మరియు పలు వివాహాలకు హాజరై నూతన వధూవరులను"మీ వివాహ జీవితం సంతోషకరంగా, శాంతిమయంగా, ప్రేమతో నిండిపోవాలని మనసారా కోరుకుంటున్నాను ." ఆశీర్వదించిన లిగ్రేటర్ వరంగల్ తొలి మేయర్ %వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్

మరియు ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భయ్యా స్వామి గారు మరియు మాజీ ఆర్టీఏ మెంబర్ గోరంట్ల మనోహర్ గారు 19 డివిజన్ ఇంచార్జ్ చిలువేరు పవన్ గారు మరియు బి ఆర్ ఎస్ ముఖ్య నాయకులు జీకే సంపత్, పుల్యాల రమేష్,20 డివిజన్ ఇంచార్జ్ మహమ్మద్ ఇక్బాల్, ఖ్యాతం రంజిత్,కిరణ్ నాయక్,హరీష్, నవీన్ రాజకుమార్ మరియు 12 డివిజన్ యువజన నాయకులు రాకేష్ మరియు మాజీ ప్రజా ప్రతినిధులు ముఖ్య నాయకులు మరియు యువజన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఉడిమేశ్వరం గ్రామములో పంటల పరిశీలన-కీటక నియంత్రణ పరికరాలపై రైతులకు సూచనలు

- వ్యవసాయ అధికారి జి. తులసి



**కొడంగల్ మండలం, అక్టోబర్,11 (సమయం న్యూస్) :** కొడంగల్ మండల వ్యవసాయ అధికారి జి. తులసి వ్యవసాయ విస్తరణ అధికారి ఐసాక్ హెరాల్డ్, రైతులు శ్రీనివాస్, మోహన్, మోహన్ రెడ్డి, రాములు మరియు శ్రీకాంత్ లతో కలిసి వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలంలోని ఉడిమేశ్వరం గ్రామములో పంటలను సందర్శించారు. వ్యవసాయ అధికారులు రైతులకు పత్తి, కంది మరియు వరి పంటలలో స్టిక్కీ ట్రాప్స్ (జిగురు అట్టలు) మరియు ఫెరోమోన్ ట్రాప్స్ వినియోగం గురించి అవగాహన కల్పించారు. ఈ పరికరాల ఉపయోగం ద్వారా రైతులకు క్రింది విధమైన ప్రయోజనాలు లభిస్తాయి:కీటక దాడులను ముందుగానే గుర్తించడం ు పంటలపై దాడి చేసే చీమలు, తెల్ల దోమలు, త్రిప్స్ వంటి పురుగులను ముందుగా గుర్తించవచ్చు. పురుగుమందుల వినియోగం తగ్గింపు ు కీటకాల సంఖ్య తగ్గడం వలన రసాయన పురుగుమందుల వాడకాన్ని తగ్గించవచ్చు. వ్యయ నియంత్రణ ు పురుగుమందుల ఖర్చు తగ్గి రైతులకు ఆర్థిక లాభం కలుగుతుంది. పర్యావరణ పరిరక్షణ ు రసాయనాల వాడకం తగ్గడం వల్ల పర్యావరణం మరియు మట్టి ఆరోగ్యం కాపాడబడుతుంది. ఉత్పత్తి నాణ్యత పెంపు ుకీటక నష్టం తగ్గి పంట దిగుబడి మరియు నాణ్యత మెరుగుపడుతుంది. స్టిక్కీ ట్రాప్స్ (జిగురు అట్టలు) మరియు ఫెరోమోన్ ట్రాప్స్ పంటలలో సమర్థవంతమైన కీటక నియంత్రణ పద్ధతులు కావున, రైతులు వీటిని తప్పనిసరిగా తమ పొలాలలో ఉపయోగించాలని అధికారులు సూచించారు.

# పత్తి చేనును పరిశీలించిన గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి



**సమయం న్యూస్ గజ్వేల్ అక్టోబర్ 11 :** వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ అలీరాజపేట గ్రామంలో ఇద్దరు రైతులు కలిసి దాదాపు 15 ఎకరాలు ప్రతి ఎకరానికి 15000 వేలు కౌలుకు తీసుకొనిప పెట్టుబడులతో కలిపి 8 లక్షల వరకు రైతులు ఖర్చు చేసే రైతులకు సకాలంలో యూరియా అందకపోవడం దానికి తోడుగా అకాల వర్షాలతో పత్తి పంటలు ఎదగకపోవడం వలన ఒక చెట్టుకు కేవలం 5 కాయలు మాత్రమే ఉండటంతో పత్తి రైతులు ఎకరానికి 50వేల వరకు నష్టపోతున్నామనీ వంటేరు ప్రతాప్ రెడ్డి ముందు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు వెంటనే గజ్వేల్ నియోజకవర్గ వ్యాప్తంగా పత్తి పంట నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి 50 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వంటేరు ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు గజ్వేల్ నియోజకవర్గంలోనీ రైతాంగం కొన్నివేల ఎకరాలలో పత్తి పంటలను వేసుకుంటారు. గజ్వేల్ నియోజకవర్గం లో దాదాపు 25 వరకు పత్తి మిల్లులు ఉన్నప్పటికీ ఇప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క సిసిఐ కొనుగోలు కేంద్రాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించకపోవడం దారుణం అన్నారు వెంటనే పత్తి సిసిఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ప్రతి క్వింటాలుకు 10 వేల రూపాయల మద్దతు ధర ఇవ్వాలని రైతుల పక్షాన వంటేరు ప్రతాప్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు కేవలం 5900 కు మాత్రమే కొనడం దళారులకు ప్రభుత్వం వత్తాసు పలకడం చాలా దారుణం అన్నారు గత కేసీఆర్ ప్రభుత్వం హయాంలో పత్తి సీజన్ కంటే ముందే సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి దళారులు చేసే మోసాల నుండి కాపాడుతూ రైతులకు మద్దతు ధర కల్పిస్తూ పత్తిని కొనుగోలు చేశామని గుర్తు చేశారు ఈ అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని తెలిపారు, రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు, రైతులకు రెండు దఫాలుగా రైతుబంధును ఎగ్గొట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డిది అన్నారు ,రైతులకు గతంలోని కేసీఆర్ ప్రభుత్వం 24 గంటల కరెంటు ఇస్తే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం పంటలకు 10 గంటల కూడా ఇవ్వకుండా రైతులకు ఇబ్బందులకు గురి చేసిందని తెలిపారు రేవంత్ రెడ్డి 22 నెలల అసమర్థ పాలనలో దాదాపు 2 లక్షల 80 వేల కోట్ల అప్పుచేసి ఏ సంక్షేమ కార్యక్రమానికి ఖర్చు పెట్టారో ఏ పథకం అమలు చేశారో ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేశారో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సమాధానమివ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి రైతుల పండించిన పంటలకు మద్దతు ధరలను కల్పిస్తూ రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో PACS చైర్మన్ అలెటి ఇంద్రసేనా రెడ్డి మాజీ ఎంపీపీ బాలేశం గౌడ్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ గజ్వేల్ AMC మాజీ వైస్ ఛైర్మన్ బట్టు సుధాకర్ రెడ్డి ఈటిక్యాల మాజీ సర్పంచ్ చంద్ర శేఖర్ జగదేవపూర్ మాజీ ఎంపీటీసీ కొత్త కవిత శ్రీనివాస్ రెడ్డి మునిగడప మాజీ ఎంపీటీసీ కిరణ్ గౌడ్ తిగుల్ PACS డైరెక్టర్ కామల్ల భూమయ్య మండల కోఅప్షన్ మెంబర్ ఎగ్బాల్ పీర్లపల్లి మాజీ ఎంపీటీసీ యాదవరెడ్డి నాయకులు మహేష్ శ్రీనివాస్ యాదగిరి నరేష్ సత్తి రెడ్డి సురేష్ లు పాల్గొన్నారు

# పేదల కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

● అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి






**వరంగల్ అక్టోబర్ 11. (సమయం న్యూస్) :** గుడిసెవాసుల జనరల్ బాడీ సమావేశంలో ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ వరంగల్ నగరంలో నివసించే పేదల కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించి ఆదుకోవాలని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ ఇంటి జాగాలు పట్టాలు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కోరారు.

ఈరోజు వరంగల్ నగరంలోని గుడిసెవాసుల జనరల్ బాడీ సమావేశం ఎంసిపిఐ(యు) జిల్లా కమిటీ సభ్యుడు గణిపాక ఓదేలు అధ్యక్షతన స్థానిక అండర్ బ్రిడ్జి ప్రాంతంలోని పార్టీ జిల్లా కార్యాలయ ఆవరణలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథి హాజరైన ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ నిలువ నీడ లేని పేదలు రెక్కాడితే తప్ప డొక్కాడని పరిస్థితిలో అక్కడ పుట్ట చేత పట్టుకొని వేలాదిమంది పట్టణాలకు వలస వస్తున్నారని అలాంటి వారికి స్థలాలు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని కానీ ఆ బాధ్యతను పాలకులు విస్మరిస్తున్నారని దశాబ్దాల తరబడి ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసి నివసిస్తున్న పేదలకు ఇప్పటికీ కనీస సదు-పాయాలు కల్పించకపోవడం సిగ్గుచేటు అన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్న పట్టించుకునే నాధుడు లేరని ఇలాంటి పరిస్థితుల్లో తక్షణమే జక్కలొద్ది గుడిసెవాసుల కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలని లేకపోతే పెద్ద ఎత్తున ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళన పోరాటాలు చేపడతారని హెచ్చరించారు. పార్టీ నగర కార్యదర్శి మాలోత్ సాగర్ మాట్లాడుతూ పోరాడితే తప్ప పేదల సమస్యలు పరిష్కారం కావాలని ఆ దిశలో స్థానిక సమస్యలపై ఉద్యమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. అధికార యంత్రాను ఇప్పటికైనా పేదల నివసిస్తున్న కాలనీలకు సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నగర నాయకులు నర్ర ప్రతాప్ మంద రవి కన్నం వెంకన్న కుసుంబ బాబురావు సుంచు జగదీశ్వర్ ముక్కెర రామస్వామి మలోత్ ప్రత్యూష మహమ్మద్ మెహబూబ్ భాష తాటికాయల రత్నం కలకొట్ల యాదగిరి ఎగైన మల్లికార్జున్ రాయినేని ఐలయ్య నలివెల రవి దాసారపు అనిల్ స్వప్న కోటేశ్వర్ యాకన్న వెంకన్న సునీత ప్రమీల స్వప్న జమీల్ ఉపేందర్ రఘుపతి భరత్ సలీం కలమ్మ దివ్య నదియా కోటి శ్యామ్ పూలమ్మ ఆశ బేగం వెలుగు మాధవి ఎం లావణ్య ఎండి మైరునిషా లావణ్య ముంతాజ్ కైసర్ బేగ సంతోష్ జమునమ్మ సల్మా లక్ష్మీ రవి తదితరులతోపాటు వందలాదిమంది పేదలు పాల్గొన్నారు.

మత ప్రచారం చేస్తూ విద్యార్థులపై క్రైస్తవ మత సిద్ధాంతాలను బలవంతంగా రుద్దుతున్న

## విద్యాసంస్థల గుర్తింపును వెంటనే రద్దు చేయాలి



**వరంగల్ అక్టోబర్ 11. (సమయం న్యూస్):** భారతీయ జనతా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డివర్ధన్నపేట. భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వర్ధన్నపేట మండల కేంద్రంలోని పుస్కోస్ పాఠశాల విద్యను నేర్పే క్రమంలో ప్రతి శుక్రవారం ప్రతి తరగతి నుంచి కొంతమంది విద్యార్థులను ఎంచుకొని వారికి క్రైస్తవ మత సిద్ధాంతాలను నేర్పే విధంగా ప్రయత్నం చేస్తూ వారిపై బలవంతంగా క్రైస్తవ మత పుస్తకాలను రుద్దుతూ వారి ప్రార్థనలను నేర్పుతూ మతాన్ని మార్చే విధంగా బాల్యం నుంచే వారిని ప్రేరేపిస్తూ విద్యను నేర్పుతున్న పాఠశాలను గుర్తింపు రద్దు చేయాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇప్పటికే ఈ విషయాన్ని మండల జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని ఆయన తెలిపారు. వారు సరియైన సమయంలో స్పందించి ఆ పాఠశాలపై నిర్ణయం తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి మరియు కేంద్ర మానవ వనరుల శాఖ కార్యదర్శి గారికి పోస్టు మరియు మెయిల్ ద్వారా పంపించడం జరుగుతుంది అని వీటితోపాటు పాఠశాలలో జరుగుతున్న మత బోధనలు కార్యకలాపాలపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి గారికి కూడా వాట్సాప్ ద్వారా మరియు మెయిల్ ద్వారా పంపించడం జరుగుతుంది కావున ఈ విషయాన్నిపై అధికారులు స్పందించి చర్య తీసుకోకుంటే భారతీయ జనతా పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కొండేటి సత్యం. జిల్లా కార్యదర్శి జడ సతీష్. రాష్ట్ర దళిత మోర్చా కార్యవర్గ సభ్యులు పంజా వెంకటేశ్వర్లు. మండల కార్యదర్శి సట్ల అనిల్. నియోజకవర్గ సోషల్ మీడియా మాజీ కన్వీనర్ పోశాల సురేష్ .యువ మోర్చా నాయకులు వడ్లకొండ మనిదీప్. ఎలిషాల రాకేష్. మహంతి. సీనియర్ నాయకులు చీపురు వెంకటస్వామి. సుభాష్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై కొరడా

- బొల్లారం మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాల కూల్చివేత
- మున్సిపల్ కమిషనర్ బి. కిషన్ హెచ్చరిక



**పటాన్ చెరు,జిన్నారం,అక్టోబర్ 11 (సమయం న్యూస్):** బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అనధికార భవనాలపై మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు ప్రారంభించారు. శనివారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన మూడు ప్రత్యేక బృందాలు పోలీసుల సహకారంతో భారీ స్థాయిలో అక్రమ నిర్మాణాలను కూల్చివేశాయి. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బి. కిషన్ మాట్లాడుతూ పట్టణ పరిధిలో నివాస, వాణిజ్య భవనాలను నిర్మించే ముందు ప్రతి ఒక్కరూ మున్సిపాలిటీ నుండి తప్పనిసరిగా బిల్డింగ్ పర్మిషన్ తీసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా చట్టవిరుద్ధంగా నిర్మాణాలు చేపడితే వాటిని వెంటనే కూల్చివేయడమే కాకుండా, సంబంధిత వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే భవన నిర్మాణ అనుమతుల కోసం ప్రజలు BuildNow యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, ఏవైనా సందేహాలు ఉంటే మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించాలని కమిషనర్ బి. కిషన్ పౌరులకు విజ్ఞప్తి చేశారు.

# సుప్రీం కోర్టు ప్రధానన్యాయమూర్తి గవాయిపై దాడి హేయం, పిరికి చర్య

- విద్యావేత్త , ప్రముఖ న్యాయ నిపుణులు
- మహమ్మద్ అసద్



**ఖమ్మం , అక్టోబర్ 11 : ( సమయం న్యూస్ ) :**ఇటీవల మన దేశ సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తి గవాయిపై దాడి హేయం , పిరికి చర్యని విద్యావేత్త , ప్రముఖ న్యాయ పుణులు మహమ్మద్ అసద్ అభివర్ణించారు. భారత రాజ్యాంగ వ్యవస్థలో అత్యంత ముఖ్యమైన జ్యూడీషరీ వ్యవస్థలో ఇలాంటి సంఘటన జరగటం మనకు మన ప్రజాస్వామ్య స్ఫూర్తికి ఎంతో చేటు కలిగించే దుర్ఘటనగా తెలిపారు. స్వాతంత్రం సిద్ధించిన కొన్ని దశాబ్దాల అనంతరం ఈ స్థితి దాపురించడం వెనుక న్యాయస్థానం , న్యాయ మూర్తులను బలహీనపరిచే , తీర్పులను ప్రభావితపరిచే ... ఒక విధానాన్ని అమలు చేస్తున్నట్లు కనిపిస్తుందని అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టు తో పాటు హైకోర్టులలో ఇలాంటి ఉదంతాలు జరిగినప్పటికీ నివారించేందుకు తగిన రక్షణ వ్యవస్థ ఉంటుందని ... జిల్లా, మండల స్థాయి కోర్టులలో ఇటువంటి సంఘటనల నివారణకు ఎలాంటి రక్షణ వ్యవస్థలు లేకపోవడం ఆందోళనకరమన్నారు. న్యాయస్థానాలు , న్యాయమూర్తులు, తీర్పులు ఇతర వ్యవస్థల మీద గౌరవ మర్యాదలు, విలువలు క్షీణించిహాహాపోవడం దేశంలో 2014 నుండి ప్రారంభమయ్యాయి అని స్పష్టం చేశారు. కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికార పగ్గాలు చేత బూనిన అనంతరం బిజెపి పాలిత రాష్ట్రాలలో సైతం ఇటువంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టికల్ 14 ప్రకారం బుల్డోజర్ల ప్రయోగం రాజ్యాంగానికి వ్యతిరేకమని పలుసార్లు సుప్రీంకోర్టు పేర్కొన్నప్పటికీ ఇటీవల కూడా ఉత్తరప్రదేశ్ లో బుల్డోజర్ ను ప్రయోగించడం పెరుగుతున్న నిరంకుశ , నియంతృత్వ ధోరణికి అద్దం పడుతుందని మహమ్మద్ అసద్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే బాబ్రీ మసీదు తీర్పును విశ్లేషించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇటీవల పదవి విరమణ చేసిన మాజీ సీజేఐ చంద్రచూడ్ ఇటీవల వరుసగా ఇస్తున్న పలు ఇంటర్వ్యూలను గమనిస్తుంటే ఈ విషయం అందరికీ అర్థమవుతుందన్నారు. సుప్రీంకోర్టు , న్యాయమూర్తులు రాజకీయ ఒత్తిడిలకు , బావ సారూప్యత భావాలకు ప్రభావితం కావడం ఈ తీర్పు ద్వారా అర్థం చేసుకో వచ్చున్నారు. ఇదే సమయంలో ఆదాని ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పలు కేసులలో ఆ దానికే అనుకూలంగా తీర్పులు వెలువడటం వెనుక కూడా గల రాజకీయ కోణం గమనించవచ్చు అన్నారు. వక్ఫ్ సవరణ చట్టం బిల్లు ఉద్దేశం .. ఆలోచన పై కేసు వేసిన వారిఆందోళనను గమనించకుండా , సరి చేయకుండా సుప్రీంకోర్టు తీర్పు ఉందని పేర్కొంటూ కొన్ని అంశాలలో స్టే ఇచ్చినప్పటికీ ముఖ్యమైన అంశాలలో సుప్రీంకోర్టు వాటిని స్పృశించకుండా వదిలి పెట్టడాన్ని ఆక్షేపించారు. గత దశాబ్ద కాలంగా మాత్రమే కాదు మొదటి నుండి బడుగు బలహీన వర్గాలంటే అగ్రవర్ణాలకు చులకన అనేది సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై జరిగిన దాడి ఒక ఉదాహరణ గా నిలుస్తుందని , ఇటువంటి చర్యలకు సమాజం ఆమోద ముద్ర వేయడం , స్వాగతించటం అనేది గదా దశాబ్దాకాలంగా జరుగుతున్నదని తెలిపారు. మన పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవ సమయంలో రాష్ట్రపతి ముర్ము ను ఆహ్వానించకపోవడంపై వచ్చిన ఆరోపణలు, విమర్శలు ఆమె సామాజిక వర్గం పట్ల చూపించే , చూపిస్తున్న వివక్షతకు తార్కాణంగా నిలిచిందని , అప్పుడే ఎంతోమంది ఆవేదనపడ్డ విషయాన్ని గుర్తు చేస్తూ విద్యావేత్త , ప్రముఖ న్యాయ నిపుణులు మహమ్మద్ అసద్ తన అభిప్రాయాలను వ్యక్తపరిచారు.

# రైతును రాజు చేయడమే లక్ష్యం

- మంత్రి పొంగులేటి



**ఖమ్మం, అక్టోబర్ 11: ( సమయం న్యూస్ ) :**రైతును రాజును చేయడం, పేదలకు సొంత ఇల్లు ఇవ్వడం, ప్రతి అర్హుడికి రేషన్ కార్డు, సంక్షేమ ఫలాలు అందించడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం నేలకొండపల్లి మండలంలో పర్యటించి , మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలకు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి శంకుస్థాపన చేశారు. ముజ్జు గూడెం గ్రామంలో ముజ్జుగూడెం నుండి గువ్వలగూడెం వరకు రూ. 2.60 కోట్ల అంచనా వ్యయంతో బీటీ రోడ్డు, పైనంపల్లి గ్రామంలో రూ.15 లక్షల అంచనా వ్యయంతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ నాటినుండి ముజ్జుగూడెం గ్రామంలో 3.68 కోట్ల రూపాయలతో వివిధ రోడ్లు మంజూరు చేసుకొని కొన్ని పూర్తి చేసుకున్నట్లు, కొన్ని టెండర్ దశలో ఉన్నాయని అన్నారు. పైనంపల్లి గ్రామంలో 12.59 కోట్లతో రోడ్లు, వివిధ అభివృద్ధి పనులు చేసుకున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడే నాటికి ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలులో వెనక్కి తగ్గడం లేదని అన్నారు. ఆర్థిక పరిస్థితిని బాగు చేస్తూ 200 యూనిట్ల ఉచితవిద్యుత్, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. 25 లక్షల మంది రైతులకు 2 లక్షల వరకు రుణమాఫీ క్రింద 21 వేల కోట్లు ప్రభుత్వం ఏర్పడ్డ 9 నెలల్లోనే అందించామన్నారు. రైతు భరోసా సహాయం 12 వేలకు పెంచినట్లు, పోయిన నెలలో ఒకేసారి 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం సరఫరా, 11 లక్షల నూతన రేషన్ కార్డుల జారీ, పాత రేషన్ కార్డులలో 17 లక్షల కొత్త పేర్లు నమోదు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు.సన్న వడ్లు పండించిన రైతులకు మద్దతు ధరతో పాటు క్వింటాకు 500 రూపాయల బోనస్ మొదటి విడత అందించామని, రెండో విడత అందించనున్నట్లు అన్నారు. గత ప్రభుత్వం పేదలకు సొంతిల్లు అందించే పథకం నిర్లక్ష్యం చేసిందని, ప్రజా ప్రభుత్వంలో 22 వేల 500 కోట్లతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసామని అన్నారు. పాలేరు నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామన్నారు. రాబోయే 3 సంవత్సరాలలో మూడు విడతల్లో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని అన్నారు. ప్రతి సోమవారం ఇళ్ళు కట్టుకున్న స్టేజిని బట్టి డబ్బులు లబ్దిదారుని ఖాతాలో జమ చేస్తున్నామన్నారు. పేదల పక్షపాతి ఇందిరమ్మ ప్రభుత్వమని, ప్రజలు ఆదరించి, ప్రభుత్వానికి వెన్నంటి ఉండాలని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఇ యాకోబు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు , తదితరులు పాల్గొన్నార

# యధా విధిగా ప్రజావాణి కార్యక్రమం

- కలెక్టర్ ప్రతిక్ జైన్
- వివిధ సమస్యల పై ఫిర్యాదులు ఇచ్చేందుకు
- జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి రావొచ్చు-కలెక్టర్



**వికారాబాద్, అక్టోబర్,11-(సమయం న్యూస్) :** వివిధ సమస్యల పై ప్రజల అర్జీలు ఇచ్చేందుకు ఈ నెల 13వ తేదీ (సోమవారం) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని యధా విధిగా నిర్వహించడం జరుగుతుందని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రజలంతా గమనించి ,వివిధ సమస్యల పై ఫిర్యాదులు ఇచ్చేందుకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి రావొచ్చని తెలిపారు.

# అంగన్వాడి కేంద్రాలలో సమాచార హక్కు చట్టం పై అవగాహన సదస్సు



**వరంగల్ అక్టోబర్ 11. (సమయం న్యూస్) :** 42వ డి డివిజన్, రంగశాయి పేట లోని అంగన్వాడీ కేంద్రాల లో సమాచార హక్కు చట్టం పై పిల్లల తల్లితండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఐ సి డి ఎస్ వరంగల్ ప్రాజెక్ట్ సూపర్వైజర్ బత్తిని రమాదేవి గారు... అంగన్వాడి కేంద్రాలలో సమాచార హక్కు చట్టం వారోత్సవాలలో భాగంగా అవగాహన సదస్సులు నిర్వహించారు, ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు, పోషణ మాసం కార్యక్రమం సందర్భంగా కూడా అంగన్వాడి కేంద్రాలలో పోషణ మాసం ప్రతిజ్ఞ పిల్లలకి అన్నప్రాసన కార్యక్రమం చేయించడం జరిగింది, ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు వినీత, యశోద, హైమావతి, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ ఆయాలు, స్వరూప, జయ, ఏ ఎల్ ఎంసి కమిటీ సభ్యులు పిల్లలు తల్లులు పాల్గొన్నారు.

# పాఠశాల స్కూల్ అసిస్టెంట్ సస్పెండ్

**ఖమ్మం, అక్టోబర్ 11:( సమయం న్యూస్ )** జిల్లాలోని నేలకొండపల్లి మండలం సుర్దేపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తూ, ప్రస్తుతం జిల్లా విద్యాధికారి కార్యాలయంలో డిప్యుటేషన్ పై పనిచేయుచున్న టి. లక్ష్మణ్ రావు ను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారిణి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. టి. లక్ష్మణ్‌రావు, స్కూల్ అసిస్టెంట్, తన హెడ్‌క్వార్టర్ వదిలి కొణిజర్ల సమీపంలోని క్రాకర్స్ దుకాణానికి వెళ్లి, ఇతరులతో కలిసి వాగ్వివాదం చేయటంతో పాటు, అసభ్యపదజాలంతో దూషించి, సీసీ టివి కెమెరాలను ధ్వంసం చేసిన ఆరోపణలపై, కొణిజర్ల పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదయినట్లు జిల్లా విద్యాధికారిణి అన్నారు. తెలంగాణ సివిల్ సర్వీస్ కండక్ట్ రూల్స్‌కు విరుద్ధంగా ప్రవర్తించినందుకు, తన చట్టబద్ధమైన విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, శాఖ ప్రతిష్టను భంగపరిచే చర్యలకై సస్పెన్షన్ చేస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో జిల్లా విద్యాధికారిణి పేర్కొన్నారు.

# పప్పుధాన్యాల్లో ఆత్మనిర్భరత అవగాహన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

- వ్యవసాయ శాఖ అధికారులు కూడా గ్రామాల్లోకి
- వెళ్లి రైతులకు పండించే పంటలపై
- అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి ఎమ్మెల్యే- టి.రామ్మోహన్ రెడ్డి





**పరిగి మండలం,అక్టోబర్,11(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా పరిగి మండలం నస్కల్ గ్రామంలోని రైతు వేదికలో "పప్పుధాన్యాల్లో ఆత్మనిర్భరత" అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టిఆర్ఆర్ మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం కీలకమైన స్థానం కలిగి ఉందని అన్నారు. ముఖ్యంగా పప్పుధాన్యాల ఉత్పత్తిలో రైతులు ఆత్మనిర్భరులుగా మారాల్సిన అవసరం ఉందిని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఉత్పత్తి పెంపుతో పాటు మార్కెటింగ్ వ్యవస్థలో పారదర్శకతను తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా పప్పుధాన్యాల పంటలకు మార్కెట్ విలువ పెరగాలంటే సమయానికి విత్తనాలు, సరైన నిల్వ సదుపాయాలు తోపాటు రైతు సమూహాల మధ్య సమన్వయం అత్యంత అవసరం అని ఎమ్మెల్యే తెలిపారు.రైతులకు పంటలపై అవగాహన పెంచుకొని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలతో పంటలకు సరైన ఎరువులు అలాగే మందులు వాడడం ద్వారా ఉత్పత్తిని పెంచి ఎక్కువ లాభాలు పొందవచ్చని ఎమ్మెల్యే సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు కూడా గ్రామాల్లోకి వెళ్లి రైతులకు పండించే పంటలపై అవగాహన కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహించాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అయ్యుబ్, పూడూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేంద్ర ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు దండు అశోక్, శ్రీధర్, చంద్రయ్య, బాదం శ్రీనివాస్ గుప్తా, వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సమూహాల ప్రతినిధులు, అలాగే స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లిహిల్స్ లో ఎన్నికాల ప్రచారములో పాల్గొన్న ఎమ్ అర్ అర్



**మేడ్చల్ మల్కాజిగిరి సమయం న్యూస్ అక్టోబర్ 11 :** ఈరోజు బంజారాహిల్స్ శ్రీనగర్ కాలనీలో మాజీ మంత్రివర్యులు, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి గారి నివాసంలో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఇన్చార్జిల కీలక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు ఉపఎన్నిక ఏర్పాట్లు ప్రచార వ్యూహాలు, బూత్ స్థాయిలో కార్యకర్తల సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై పార్టీ విజయాన్ని సాధించే దిశగా కార్యాచరణ రూపొందించబడింది. ఈ సమావేశం ద్వారా నేతలు ఏకాభిప్రాయంతో పనిచేసేందుకు సంకల్పబద్ధంగా ముందుకెళ్లాలని నిర్ణయించారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు శ్రీ ఎల్. రమణ నవీన్ కుమార్ రెడ్డి గారు మల్కాజ్ గిరి ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి గారు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్,స్థానిక నాయకులు అప్పు ఖాన్, వినయ్ మరియు పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ మధురనగర్లో సమీక్ష సమావేశం



**వరంగల్ అక్టోబర్ 11. (సమయం న్యూస్) :** జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్ గెలుపే ధ్యేయంగా అందరూ కలిసి పని చేయాలనీ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ దేదీప్య రావు దిశానిర్దేశం చేసిన మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు ఈ సందర్భంగా రాబోయే ఉపఎన్నికలో ఖచ్చితంగా బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు.

12-10-25 Samayam_Layout 1 10/12/2025 3:36 AM Page 8



# అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన రుద్ర గాని మాధవ్



**ఖమ్మం ,అక్టోబర్11:( సమయం న్యూస్ )** నగరంలోని 57వ డివిజన్లో గల 116వ పోలింగ్ బూత్ లో ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని శనివారం భారతీయ జనతా పార్టీ టూ టౌన్ ప్రధాన కార్యదర్శి , 57వ డివిజన్ శక్తి కేంద్ర ఇంచార్జ్ రుద్ర గాని మాధవరావు సందర్శించి, పరిశీలించారు. సీజనల్ వ్యాధుల ప్రబలించే సమయంలో సెంటర్లో ఉండాల్సిన మెడిసిన్స్ కాలపరిమితిని , నాణ్యతను ఆయన పరిశీలించారు. పిల్లలకు పౌష్టికాహారం గుడ్డు, బాలామృతం వారికి బిస్కెట్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. అలాగే అంగన్వాడి కేంద్రంలోని వసతులు గురించి అంగన్వాడీ టీచర్ రజినిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సెంటర్లోని పిల్లలకు 15 పలకలు ఇస్తానని హామీ ఇచ్చారు.

# కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవులకు దరఖాస్తులకు ఆహ్వానం




**ఖమ్మం ,అక్టోబర్ 11: ( సమయం న్యూస్ ) :** జిల్లా కాంగ్రెస్ , నగర అధ్యక్షుల పదవులకు కాంగ్రెస్ పార్టీ శ్రేణుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ పార్టీ ఏఐసీసీ అబ్జర్వర్ మహేంద్రన్ తెలిపారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవ్ రెడ్డి భవన్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహ్మద్ జావేద్ల అధ్యక్షతన జరిగిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పిసిసి కోఆర్డినేటర్స్ డాక్టర్ పి.శ్రవణ్ కుమార్ రెడ్డి, రవళి రెడ్డి, రాజీవ్ రెడ్డి, చెక్కిలం రాజేశ్వరరావు, నగర కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్ చౌదరి, మాజీ శాసనమండలి సభ్యులు బాలసాని లక్ష్మీనారాయణ, మాజీ శాసనసభ సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చోటా బాబా, అనుబంధ సంఘాల అధ్యక్షులు వేజెండ్ల సాయికుమార్, బొడ్డు బొందయ్య, పుచ్చకాయల వీరభద్రం, మొక్క శేఖర్ గౌడ్, సయ్యద్ గౌస్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు యడ్లపల్లి సంతోష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

# మాన్య పద్మావతి జ్ఞాప కార్థం దుస్తుల పంపిణీ..




**ఖమ్మం, అక్టోబర్ 11 :( సమయం న్యూస్ )** ఎదులపురం మున్సిపాలిటీ బి ఖమ్మం రూరల్ పరిధిలోని చిన్న తండా కు చెందిన బానోతు మాన్య, గుమ్మడి పద్మావతి ల జ్ఞాపకార్థం తమ్ముడి కుమారుడు బానోతు రక్షిత్ రాథోడ్, మేనల్లుడు వడిత్యా రఘురామ్ కలసి ఖమ్మం నగరం లోని అన్నం ఫౌండేషన్ లో శనివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనాథలకు, మానసిక వికలాంగులకు అనేక సేవలు అందిస్తున్న అన్నం శ్రీనివాస్ కు తమవంతు సహాయ సహకారం అందజేస్తామని రక్షిత్ తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలోకి చేరికలు

## కండువాలు కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి



**కొత్తపల్లి మండలం, అక్టోబర్,11(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గం లోని కొత్తపల్లి మండలం కొత్తపల్లి తండాకి చెందిన దాదాపు 30 మందికి పైగా కాంగ్రెస్ పార్టీ నుండి బీఆర్ఎస్ పార్టీ కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, మండల నాయకుల సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది. వారికి గులాబీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# బంగారు నంది అవార్డు అందుకున్న రాజీపేట నాగేష్ ముదిరాజ్!

- మక్స్ గ్లోబల్ పౌండేషన్ ఆధ్వర్యంలో నంది అవార్డు అందజేత!!




**,శివంపేట అక్టోబర్ 11 ( సమయం న్యూస్) :** మండల కేంద్రమైన శివ్వంపేటకు చెందిన జర్నలిస్ట్ అక్షరవిజేత పత్రిక విలేకరి రాజీపేట నాగేష్ ఉత్తమ జర్నలిస్ట్ గా బంగారు నంది అవార్డు ను అందుకున్నారు. శుక్రవారం మక్స్ గ్లోబల్ పౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని నందమూరి తారకరామారావు కళా ప్రాంగణం లో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ వేడుకలలో తెలంగాణ సంస్కృతిక సారధి చైర్మన్ వెన్నెల గద్దర్,ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ రావు దంపతుల చేతుల మీదుగా జర్నలిస్ట్ నాగేష్ కు ఉత్తమ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతిక సారధి చైర్మన్ వెన్నెల గద్దర్ మరియు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రతి నిత్యం ప్రజా సమస్యలను ప్రభుత్వం ద్రుష్టికి తీసుకెళ్లడంలో ఎనలేని కృషి చేసిన జర్నలిస్టు సేవలను గుర్తించిన మక్స్ గ్లోబల్ పౌండేషన్ ఉత్తమ అవార్డులను అందించడం అభినందనీయమని అన్నారు. అవార్డు అందుకోవడ మంటే మరింత బాధ్యతలు పెరిగినట్లేనని అందుకు అనుగుణంగా ప్రజల అవసరాలను గురించి వార్త కథనాలను తయారు చేయాలనీ సూచించారు. బంగారు నంది అవార్డు గ్రహీత రాజీపేట నాగేష్ మాట్లాడుతూ అవార్డు అందుకోవడం తనకేంతో సంతోషంగా ఉందని, అవార్డు అందించిన మక్స్ గ్లోబల్ పౌండేషన్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో గ్లోబల్ పౌండేషన్ ఎగ్జి క్యూటివ్ డైరెక్టర్ దినేష్ చర్లపల్లి, ఫౌండర్ కాజా సాబ్ , ప్రెసిడెంట్ నీరజ గోని,మా టీవీ బిగ్ బాస్ 7 విన్నర్ పల్లవి ప్రశాంత్, అక్షర విజేత పత్రిక పేపర్ ఎడిటర్ డాక్టర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణి కార్యక్రమం సోమవారం యధావిధిగా నిర్వహించాబడును

-కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి జిల్లా,అక్టోబర్,11(సమయం న్యూస్) :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈనెల 13(సోమవారం) యధావిధిగా నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండటం వల్ల తాత్కాలికంగా గత వారం ప్రజావాణి కార్యక్రమాన్ని వాయిదా వేయాల్సి వచ్చిందని.. ప్రస్తుతం స్థానిక ఎన్నికల నిర్వహణ ప్రక్రియ నిలిచిపోయినందున, ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి యధావిధిగా ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులను సమర్పించవచ్చని తెలిపారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి





**వనపర్తి మండలం, అక్టోబర్,11(సమయం న్యూస్) :** వనపర్తి మండలంలోని సవాయిగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సానే నాగిరెడ్డి. మరియు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త ఈరన్న గత వారం రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శనివారం వారి స్వగృహానికి వెళ్ళి,వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ మంత్రి వెంట డేగ మహేశ్వరరెడ్డి,చిట్యాల రాము, శ్రీను, తులసి రామకృష్ణ, అంజి మోహనరెడ్డి రమేష్ తదితరులు ఉన్నారు.

# మెనూ ప్రకారం భోజనం అందించాలి

- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి
- నవాబ్ పేట మండలం రుద్రారం,ఎన్మన్ గండ్ల గ్రామాల్లో జిల్లా కలెక్టర్ పర్యటన
- ఎన్మన్ గండ్ల బి. సి.బాలికల సంక్షేమ వసతి గృహం మధ్యాహ్నం భోజనం పరిశీలన,మెనూ పాటించకపోవడం తో వసతి గృహ సంక్షేమ అధికారిణి పై చర్యలకు ఆదేశం
- రుద్రారం గ్రామం లో వర్షపు నీరు ప్రవహించిన డ్రైన్,చౌకధర దుకాణం,ఎన్మన్ గండ్ల గ్రామం లో చెరువు,బి. సి .బాలికల వసతి గృహం,ఇందిరమ్మ ఇండ్లు పరిశీలించిన కలెక్టర్





**మహబూబ్ నగర్ అక్టోబర్( సమయం న్యూస్). :** మెనూ పాటించకపోతే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి హెచ్చరించారు. శనివారం జిల్లా కలెక్టర్ నవాబ్ పేట మండలం రుద్రారం,ఎన్మన్ గండ్ల గ్రామాల్లో పర్యటించారు. నవాబ్ పేట మండలం ఎన్మన్ గండ్ల గ్రామం లో బి.సి.బాలికల సంక్షేమ వసతి గృహం ను తనిఖీ చేశారు. వసతి గృహం లో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మెనూ పాటించక నీళ్ళ సాంబార్ తో, కూరగాయలు లేక భోజనం గమనించిన కలెక్టర్ వసతి గృహ సంక్షేమ అధికారిణి ని పై చర్యలు తీసుకోవాలని సంబంధిత జిల్లా బి.సి.సంక్షేమ శాఖ అధికారిణి ఆదేశించారు. మెనూ పాటించాలని,విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారుగ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పరిశీలించారు. కోస్గి భవాని ఇంటి నిర్మాణ పరిశీలించి ఆమె తో కలెక్టర్ మాట్లాడి ఇంటి నిర్మాణం,ఎంత ఖర్చు అవుతుంది తదితర విషయాలు తెలుసుకున్నారు. గ్రామంలో చెరువు ను పరిశీలించారు. వర్షాలు వలన చెరువులు నిండి ప్రవహించే నీటి ప్రవాహం అధికారులు గమనించి అప్రమత్తంగా ఉంటూ ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రుద్రారం గ్రామంలో డ్రైన్ పరిశీలించారు రెండు రోజుల క్రితం గ్రామంలో డ్రైన్ వర్షాల వలన నీరు ప్రవహించి ఇండ్లల్లో రావడం జరిగిన విషయం తెలిసిందే. గ్రామంలో చౌక ధరం దుకాణం ను తనిఖీ చేశారు. బియ్యం పంపిణీ పరిశీలించారు. చౌక ధర దుకాణం పరిశుభ్రంగా ఉంచాలని డీలర్ ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట తహశీల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు

# హైకోర్టు స్టే పై ప్రభుత్వం తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

- (జాజుల శ్రీనివాస్ గౌడ్) జాతీయ అధ్యక్షులు బీసీ సంక్షేమ సంఘం
- ఒకవైపు న్యాయపోరాటం, ఇంకొక వైపు ప్రధాని వద్దకు అఖిలపక్షం సీఎం తీసుకెళ్లాలి
- 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి బీసీ రిజర్వేషన్ల రక్షణకు బిజెపి బాధ్యత తీసుకోవాలి
- బీసీ రిజర్వేషన్ల ఉద్యమానికి జై కొట్టిన అఖిలపక్షం
- అఖిలపక్ష పార్టీలు,

**బీసీ సంఘాల సంయుక్త సమావేశంలో**

- జాజుల, కోదండరాం, విహెచ్, వెల్లడి

బీసీ రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన స్టేను నిరసిస్తూ రాష్ట్రంలో జరిగే బీసీ రిజర్వేషన్ల ఉద్యమానికి అఖిలపక్షం జై కొట్టింది హైకోర్టు ఇచ్చిన

స్టే పై సుప్రీంకోర్టుకు వెళ్లాలని అలాగే బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించడానికి ప్రధాని నరేంద్ర మోడీని అఖిలపక్షంతో సీఎం రేవంత్ రెడ్డి వెళ్లి కలిసి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని బీసీ రిజర్వేషన్లు పెంచే వరకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించవద్దని ఈరోజు జరిగిన అఖిలపక్ష సమావేశం ఏకగ్రీవంగా డిమాండ్ చేసింది

ఈరోజు హైదరాబాదులోని బంజారాహిల్స్ లో ఉన్న కళింగ భవన్ లో బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే పరిష్కార మార్గాలు భవిష్యత్ కార్యాచరణ పై బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో అఖిలపక్ష రాజకీయ పార్టీలు బీసీ సంఘాల సంయుక్త సమావేశం జరిగింది ఈ సమావేశంలోవి హనుమంతరావు, అద్దంకి దయాకర్, ఈరావత్ అనిల్ (కాంగ్రెస్)కోదండరాం (టీజేఎస్)నెల్లికంటి సత్యం (ఎమ్మెల్సీ సిపిఐ) ఆనంద్ కుమార్ గౌడ్ (బిజెపి)బండారు రవి కుమార్ (సిపిఎం), గోవర్ధన్ (సిపిఐ ఎంఎల్ ) హాజరయ్యా కోదండరాం, టిజెస్ ప్రెసిడెంట్ బీసీ రిజర్వేషన్లు సాధించు కోవాలి అందరూ మద్దతు తెలిపారు అసెంబ్లీలో.కోర్ట్ లో పిటిషన్ లు దాఖలు చేశారు50 శాతం అనేది రాజ్యాంగం లో లేదు కోర్టులు కూడా చెప్పలేదుప్రత్యేక పరిస్తుతుల్లో 50 శాతం దటవచ్చు అని కోర్టులు కూడా చెప్పాయి లీగల్ పోరాటం కొనసాగాలి ఇది అపొద్దు కార్యాచరణ కూడా రెడీ చేయాలిఅందరిని ఐక్యం చేయాలిఅన్ని ప్రజాస్వామ్య శక్తులు కలిసి రావాలి అన్ని పార్టీ లు ముందుకు రావాలిఢిల్లీ లో కార్యాచరణ ఖరారు చేయాలి బీజేపీ కాంగ్రెస్ సీపీఐ సీపీఎం మిగతా పార్టీ లు కూడా ముందుకు రావాలి రిజర్వేషన్లు కు అన్ని పార్టీ లు మద్దతు తెలిపి ఇపుడు నిలబడదు కదా మేము ముందే చెప్పాము అని అంటున్నారు

ఇది రిజర్వేషన్లు కల్పించే అంశంపై చిత్తశుద్ధి ఉందా అనుమానం వస్తుంది బీసీ ల్లో అన్ని రంగాల్లో అసమానతలు ఉన్నాయి రిజర్వేషన్లు ప్రయత్నం నిరంతరం కొనసాగించాలి హైదరాబాద్, ఢిల్లీ లో, కోర్టుల్లో, బయట ఎమ్ చేయాలో నిర్ణయించాలి

అవకాశవాదం పక్కన పెట్టాలని అన్ని పార్టీ లను కోరాలి

సమానత్వం కి రిజర్వేషన్లు ప్రాతిపదిక

జాజులజిబీసీ ల సమస్య తప్ప చాలా సమస్యలు ను బీసీ ప్రధాని పరిష్కారం చేశారు

ప్రధాని అపాయింట్ మెంట్ ఇపించండిఎంపీ లక్ష్మణ్ చొరవ తీసుకోవాలిసీఎం తో అన్ని పార్టీ లు బీసీ సంఘాలు వచ్చి కలుస్తాయిబీసీ సమాజం రోడ్ల్ మీద కు వస్తే పరిస్థితి వేరే ఉంటుందికులాల వారిగా వీడిపోతే రాష్ట్రంలో చాలా సమస్యలు వస్తాయివెంటనే అల్ పార్టీ మీటింగ్ ఏర్పాటు చేయండిబీసీ రిజర్వేషన్లు కు అందరూ మద్దతు తెలిపారు

కానీ రిజర్వేషన్లు కట్లేదుఅద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ

ఇపుడు పోరాటం చేయాల్సిన టైం వచ్చింది

తెలంగాణ ఉద్యమం లో జానారెడ్డిఊ కోదండరాం కేసీఆర్ లు తొలి మీటింగ్ ఇక్కడే పెట్టారు

బీసీ రిజర్వేషన్లు కు విలన్ ఎవరో చూస్తున్న

కోర్టులో కేస్ లు వేసిన వ్యక్తులు చాలా చిన్న వాళ్ళు

ఓసీ, ఎస్సి ఎస్టి లు కూడా బీసీ రిజర్వేషన్లు కు మద్దతు పలికారుజె ఏ సి ఏర్పాటు చేయండి

ఐక్యం గా బంద్ చేయాలి, బంద్ పై ఎకఫక్ష నిర్ణయాలు వద్దు ఎంబిసి లకు ఇప్పటికి గుర్తింపు లేదు

42 శతమ్ రిజర్వేషన్లు వస్తే వెనుకబడిన బీసీ లకు పదవులు వస్తాయిప్రత్యేక కార్యాచరణ ప్రకటించాలి

ఎస్సి ఎస్టి సంఘాలు కూడా మద్దతు కోరాలి

బీసీ సంఘాలు ఐక్యం గా ముందుకు రావడం అభినందినియంచట్ట సభల్లో కూడా 42 శాతం రిజర్వేషన్లు కావాలిఅల్ పార్టీ మీటింగ్ ఏర్పాటు చేయాలి

పోరాటం కు రెడీ కావాలిబీజేపీ, బిఅరెస్ లో కూడా బీసీ నేతలు రిజర్వేషన్లు కు మద్దతు తెలుపు తున్నారు

భేషజాలు వద్దు అందర్నీ కలుపు కొని పోవాలి

ఎమ్మెల్సీ సత్యం...సీపీ ఐగవర్నర్ ల తో రాజకీయం చేస్తున్నారు

అసెంబ్లీ ఆమోదించిన బిల్ ను గవర్నర్ మీద ఒత్తిడి తెచ్చి ఆమోదించడం లేదు

నోటి కడా ముద్ద ను లాక్కున్నరు

అందరూ ను కలుపు కొని తెలంగాణ ఉద్యమ తరహా లో పోరాటం చేయాలి

ఆలస్యం చేయొద్దు

అన్ని రంగాల్లో బీసీ లు వెనుకబడి ఉన్నారు

కేంద్రం మీద ఒత్తిడి తీసుకురావాలికాంగ్రెస్ కు చిత్తశుద్ధి ఉంది కాబట్టే కుల గణన చేసింది అసెంబ్లీ లో ఆమోదం చేశారుఇరావత్ అనిల్ హైకోర్టు స్టే పై సోమవారం సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరపున పిటిషన్ దాఖలు చేస్తామని, అలాగే బిసి రిజర్వేషన్లు పెంచడానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని ఆయన అన్నారు వివిధ పార్టీల నాయకులు బీసీ సంఘాలు డిమాండ్ చేసినట్టుగా అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసే విధంగా సీఎం రేవంత్ రెడ్డి తో మాట్లాడి సానుకూల నిర్ణయం తీసుకుంటామని ప్రధాని సమయం బిజెపి నేతలు ఇప్పిస్తే అఖిలపక్ష నేతలతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రధాని కలిసి తెలంగాణలో జరిగిన ప్రధాన ప్రక్రియను రిజర్వేషన్ పెంచాల్సిన అవశ్యకతను వివరిస్తామని ఆయన వెల్లడించారు

ఆనంద్ గౌడ్..బీజేపీ ఓబీసీ మోర్చా స్టేట్ ప్రెసిడెంట్

పార్టీ ల మీద విమర్శలు వద్దు

రిజర్వేషన్లు అంశం క్షేత్ర స్థాయి కి వెళ్ళింది

అందరూ ఐక్యం గా ఉంది పోరాటం చేయాలి

చాలా రాష్ట్రాల్లో రిజరేషన్లు ఇవ్వాలని విఫలం అయ్యారు

జయలలిత 9వ షెడ్యూ ల్ లో పట్టు బట్టి చేసారు

బీసీ సంఘాలు చాలా ఉన్నాయి ఒకే వేదిక మీద కి రావాలిఉమ్మడి గా సీఎం ప్రధాని, అన్ని పార్టీ ల దగ్గరకు వెళ్దాంపార్లమెంట్ లో రిజర్వేషన్లు ఆమోదం పొందాలి అంటే అన్ని పార్టీ ల ఎంపీ లు మద్దతు పలకాలి

సిపిఎం నేత రవికుమార్

బీసీ రిజర్వేషన్లకు మొదటి ముద్దాయి బిజెపి అని, రాజ్ భవన్ లను రాజకీయ కేంద్రాలుగా చేసుకుని బిజెపి రాజకీయం చేస్తుందని బీసీలంతా వేలాదిగా రాజభవన్ ముట్టడించాలని ఆయన పిలుపునిచ్చారుఈ సమావేశంలో 30 బీసీ కుల సంఘాలు, 80 కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షులు, యూనివర్సిటీల ఆచార్యులతోపాటు

బీసీ సంఘాల నేతలు విజిఆర్ నారగొని, దాసు సురేష్,ఇందిరా శోభన్, కుందారం గణేష్ చారి, ప్రొఫెసర్ సంఘని మల్లేశ్వరి, ప్రొఫెసర్ నరేందర్, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, కనకాల శ్యాం కుర్మా, ఉప్పర శేఖర్ సగర, , దిటి మల్లయ్య, మురళీకృష్ణ, బర్ల మణిమంజరి సాగర్, గొడుగు మహేష్ యాదవ్, వరికుప్పల మధు, జిల్లెల నరసింహా, దేశగోని సాంబశివ గౌడ్, కిరణ్ కుమార్, పిడికిలి రాజు, నరసింహ నాయక్, తారకేశ్వరి, సమత యాదవ్, శ్యామల, తదితరులు పాల్గొన్నారు

(జాజుల శ్రీనివాస్ గౌడ్)
జాతీయ అధ్యక్షులు
బీసీ సంక్షేమ సంఘం

## ఈ నెల 13వ తేదీ నుండి ప్రజావాణి కార్యక్రమం పునఃప్రారంభం

**- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**




**నిర్మల్ అక్టోబర్11( సమయం న్యూస్):** 2వ సాధారణ జెడ్ పి టి సి, ఎం పి టి సి ఎన్నికల నిర్వహణ కారణంగా తాత్కాలికంగా నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 13వ తేదీ (సోమవారం) నుండి యధావిధిగా కొనసాగించబడుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం యథాతథంగా నిర్వహించబడుతుందని తెలిపారు. ప్రజలు, అర్జీదారులు తమ సమస్యలు, ఫిర్యాదులు, విజ్ఞప్తులను నేరుగా అధికారుల సమక్షంలో సమర్పించుకోవచ్చని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి ముఖ్య వేదికగా నిలుస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## పలుచోట్ల మంచినీటి సరఫరాకు అంతరాయం

**హైదరాబాద్ అక్టోబర్11( సమయం న్యూస్) :** కోదండాపూర్ నుంచి గొడకొండ్ల వరకు ఉన్న హైదరాబాద్ మహానగరానికి మంచినీటిని సరఫరా చేస్తున్న కృష్ణ డ్రింకింగ్ వాటర్ సప్లై ప్రాజెక్ట్ (కేడీడబ్ల్యూఎస్పీ) ఫేజ్- 3, పంపింగ్ మెయిన్ కి సంబంధించి 2375 ఎంఎం డయా పైప్‌లైన్‌పై భారీ నీటి లీకేజీని అరికట్టడానికి గానూ, ఎయిర్ వాల్వ్, గేట్ వాల్వ్, పనిచేయని వాల్వ్‌లను మార్చడం వంటి మరమ్మత్తు పనులను చేపట్టనున్నారు. ఈ పనులు తేదీ: 13.10.2025, సోమవారం ఉదయం 6 గంటల నుండి 14.10.2025 మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు మొత్తం 36 గంటల పాటు ఈ పనులు కొనసాగుతాయి. కాబట్టి.. ఈ 36 గంటల వరకు కృష్ణ డ్రింకింగ్ వాటర్ సప్లై ప్రాజెక్ట్ ఫేజ్ - 3 రింగ్ మెయిన్ - 1 కింద ఉన్న రిజర్వాయర్ల పరిధిలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది.

అంతరాయం ఏర్పడే ప్రాంతాలు:

1. గచ్చిబౌలి, కొండాపూర్, మాధాపూర్, అయ్యప్ప సొసైటీ, కావూరి హిల్స్.
2. ప్రశాసన్ నగర్, ఫిల్మ్‌నగర్, జూబ్లీ హిల్స్, తట్టి ఖానా, భోజగుట్ట, షేక్‌పేట్, హకీంపేట్, కర్వాన్, మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్, గోల్కొండ, లంగర్ హౌస్.
3. దుర్గా నగర్, బుద్వేల్, సులేమాన్ నగర్, గోల్డెన్ హైట్స్, 9 నంబర్, కిస్మత్‌పూర్, గంధంగూడ, బండ్లగూడ, శాస్త్రిపురం, అల్లబండ, మధుబన్, ధర్మసాయి (శంషాబాద్).
4. సాహెబ్‌నగర్, ఆటోనగర్, సరూర్‌నగర్, వాసవి నగర్, నాగోల్, ఎన్‌టీఆర్ నగర్, వనస్థలిపురం, దేవేందర్ నగర్, ఉప్పల్.
5. స్నేహపురి, భారతనగర్, రాంపల్లి, బోడుప్పల్, చెంగిచెర్ల, మానిక్ చంద్, మల్లికార్జున నగర్, పీర్జాదిగూడ, పెద్దఅంబర్‌పేట్.

నీటి సరఫరాలో అంతరాయం కలగనున్న ప్రాంతాల్లోని వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోగలరని కోరడమైనది.

## వరంగల్, నల్గొండలో ఇంక్యూబేషన్ కేంద్రాలు.

- 'టీ-హబ్' తరహాలో ఏర్పాటు, కొత్త ఆలోచనలకు ప్రోత్సాహం
- 'ఫార్మసీ ఆఫ్ పర్పస్' గా తెలంగాణను మార్చాలన్నదే మా సంకల్పం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**హైదరాబాద్ అక్టోబర్11( సమయం న్యూస్). :** తెలంగాణను "ఇన్నోవేషన్ హబ్" గా మార్చాలన్నదే తమ సంకల్పమని, వరంగల్, నల్గొండలోనూ టీ-హబ్ తరహాలో ఇంక్యూబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయ-ంబోతున్నట్లుగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఇందుకు సంబంధించి త్వరలోనే కాకతీయ, మహాత్మాగాంధీ విశ్వ విద్యాలయాలతో ఎంవోయూ కుదుర్చుకోనున్నట్లుగా వివరించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న 'కాకతీయ యూనివర్సిటీ ఫార్మా అలుమ్ని' గోల్డెన్ జూబ్లీ వేడుకలను శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సైన్స్ కు మానవత్వాన్ని జోడిస్తే ప్రతి ఆవిష్కరణ సమాజహితానికి బాటలు వేస్తుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణను గ్లోబల్ ఫార్మా, లైఫ్ సైన్సెస్ హబ్ గా మాత్రమే కాకుండా 'ఫార్మసీ ఆఫ్ పర్పస్'గానూ మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. రీసెర్చ్ ను మార్కెట్‌కు, పాలసీని రోగికి అనుసంధానించే సమగ్రమైన 360 డిగ్రీల ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. 18 నెలల్లోనే లైఫ్ సైన్సెస్ రంగంలో కొత్తగా రూ.54వేల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చామన్నారు. ఎలీ లిల్లీ లాంటి అంతర్జాతీయ ఫార్మా దిగ్గజ కంపెనీలను తెలంగాణకు తీసుకొచ్చి, ఇక్కడి యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. డాక్టర్ల కంటే వేగంగా రోగాలను నిర్ధారించినా, అనుభూతి చెందే మనసును మాత్రం ఏ యంత్రం భర్తీ చేయలేదన్నారు. దేశంలో తమ అనుభవాన్ని 'నాలెడ్జ్ ఇన్వెస్ట్ మెంట్'గా పెట్టేందుకు ముందుకు రావాలని ప్రవాసీ భారతీ-య నిపుణులకు విజ్ఞప్తి చేశారు. పేటెంట్లను కాకుండా మీ ఆవిష్కరణ వల్ల ఎంత మందికి మేలు జరిగిందన్నదే చరిత్ర గుర్తుంచుకుంటుందని యువ ఇన్నోవేటర్స్ కు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్ రెడ్డి, డా.బి.ప్రభా శంకర్, రాంప్రసాద్ రెడ్డి, ప్రద్యుమ్న, డా.తామర విజయ్ కుమార్, ప్రొఫెసర్ భాస్కర్ ఆర్.జాస్తి, రాజేశ్వర్ తోట, ప్రొఫెసర్ జె. కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ, రాజన్న మొక్కలు భీమేశ్వరాలయానికి మార్పు

**హైదరాబాద్, అక్టోబర్11( సమయం న్యూస్).:** శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానము ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టుచునందున భక్తుల సౌకర్యార్థం మొక్కు బడులు, ఆర్జిత సేవలకొరకై, అనగా కోడె మొక్కుబడి, అభిషేకములు, అన్నపూజ, కుంకుమపూజ, నిత్య కళ్యాణము, చండి హెరీమం, మొదలగు మొక్కు బడులు తీర్చుకొనుటకు 11.10.2025 శనివారం నుండి వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం లో నిర్వహించడానికి ఏర్పాట్లు చేయుడ మైనది. అలాగే శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆలయములో (ప్రాధాన ఆలయములో ) నిత్య కైంకర్యములు, ఛత్సుకాల పూజలు, ఆలయ అర్చకులచే యధావిధిగా అంతరంగితముగా నిర్వహింపబడును. ఈ ఏర్పాట్లను భక్తులు గమనించి సహకరించగలరని వేములవాడ ఈ.ఓ ఒక ప్రకటన లో తెలిపారు..

## జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందాలి.

**వసతిగృహాల్లో మెనూ, విద్యార్థుల సామర్థ్యాలను ప్రశ్నలు జవాబులు రూపంలో అడిగి తెలుసుకున్న కలెక్టర్**

**శంకరంపేట ఆర్ మండలంలో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్ రాహుల్ రాజ్**

**శంకరం పేట అక్టోబర్11( సమయం న్యూస్). :** జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వసతిగృహాల్లో నాణ్యమైన మెనూ, విద్యార్థుల ఉత్తమ విద్యా బోధన అందుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు.

శనివారం శంకరంపేట ఆర్ మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, సంక్షేమ వసతి గృహాన్ని పరిశీలించారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి పీహెచ్ సీలోని హాజరు పట్టికను తెప్పించుకుని పరిశీలించారు. ప్రతి రోజు ఇన్ పేషెంట్లు ( , అవుట్ పేషెంట్లు ఎంత మంది వస్తున్నారు. మందులు అందుబాటులో ఉన్నాయా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. నిరంతరం వైద్యసేవలు అందుతున్నాయని రోగులు చెప్పడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సంక్షేమ వసతి గృహాన్ని పరిశీలించి విద్యార్థులకు అందుతున్న

మెనూ పరిశీలించి సౌకర్యాలపై ఆరా తీశారు, విద్యార్థుల సామర్థ్యాలను ప్రశ్నలు జవాబులు రూపంలో అడిగి తెలుసుకుని సంతృప్తి చెందారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణ ధ్యేయంగా జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మెరుగైన పనితీరు కనపడుతున్నాయని చెప్పారు. సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల వసతి సౌకర్యాలతో పాటు గుణాత్మక విద్య బోధన లక్ష్యంగా ముందుకు పోతున్నామని కలెక్టర్ వివరించారు. అయన వెంట , వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు తదితరులు ఉన్నారు.

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం కోసం రాష్ట్ర ప్రభుత్వమే కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాసిన**

**రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి**

**హైదరాబాద్ అక్టోబర్ 11( సమయం న్యూస్) :** ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం కోసం ప్రభుత్వమే ప్రత్యేకంగా కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్రంలో వేలాది మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్నారని, అయితే వారిని ప్రైవేట్ ఏజెన్సీలు నియమించడం వల్ల శ్రమ దోపిడీకి గురవుతున్నారని చిన్నారెడ్డి పేర్కొన్నారు. ప్రైవేట్ రిక్రూట్మెంట్ ఏజెన్సీలు ఈ పీ ఎఫ్, ఈ ఎస్ ఐ వంటి సౌకర్యాలు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇవ్వకపోవడంతోపాటు దాదాపు 20శాతం వరకు వేతనాల్లో కోత విధిస్తున్నారని, పైగా ఆ వేతనాలు కూడా ప్రతి నెల ఆలస్యం చేస్తున్నారని చిన్నారెడ్డి సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం కోసం ప్రభుత్వ పరంగా నూతనంగా కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలని ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారని చిన్నారెడ్డి ఆ లేఖలో వివరించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం కోసం 2023 కంపెనీస్ యాక్ట్ 8 ప్రకారం ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం కార్పొరేషన్ ను ఏర్పాటు చేయనున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా ఇదే తరహా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కార్పొరేషన్ ను ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేయాలని చిన్నారెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.

## దేశంలో ప్రజల వద్ద ఉన్న బంగారం విలువ రూ.337 లక్షల కోట్లు



**హైదరాబాద్ అక్టోబర్11( సమయం న్యూస్) :** బంగారం.. భారతీయులకు ఎంతో ఇష్టమైన వాటిల్లో ముందువరుసలో ఉంటుంది. వందల సంవత్సరాల నుంచి భారతీయుల జీవితాల్లో ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది. ఒకప్పుడు ఆభరణాలుగా ధరించేందుకు ఉపయోగించే వారు కానీ, ఇప్పుడు ఒక పెట్టుబడి సాధనంగా మారిపోయింది. అత్యవసర సమయంలో ఆర్థికంగా అండగ నిలుస్తుందని భావిస్తున్నారు. అందుకే వీలైనంత మేరకు తమ స్థోమతకు తగినట్లుగా బంగారం కొంటున్నారు. ఓవైపు బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్నా బంగారం కొనేవాళ్లు కొంటూనే ఉన్నారు. సామాన్యులకు అందనంత దూరానికి బంగారం వెళ్లింది. 2025లోనే ఇప్పటి వరకు చూసుకుంటే పసిడి ధర ఏకంగా 62 శాతం పెరిగింది. అయితే, భారత ప్రజల దగ్గర ఎంత బంగారం ఉంది అనే ప్రశ్న మీకు ఎప్పుడైనా వచ్చిందా? ఆ ప్రశ్నకు సమాధానం తెలిస్తే కళ్లు చెదరాల్సిందే. 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర (24 క్యారెట్లు) రూ.1.25 లక్షల మార్క్ దాటింది. కిలో వెండి రేటు రూ.1.84 లక్షలపైకి ఎగబాకింది. అంతర్జాతీయ అనిశ్చితులు, అమెరికా టారిఫ్‌లు, ఫెడ్ నిర్ణయాలతో పాటు దేశీయంగా దసరా, దీపావళి పండగ సీజన్ గిరాకీ బంగారం ధరలు పెరిగేందుకు కారణమవుతున్నట్లు బులియన్ మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. బంగారం ధర భారీగా పెరిగిన క్రమంలో భారత ప్రజల వద్ద ఉన్న బంగారం విలువపై మోర్గాన్ స్టాన్లీ ఓ నివేదిక విడుదల చేసింది. మరి ఆ వివరాలు తెలుసుకుందాం.

**వేల టన్నులు.. లక్షల కోట్లు..**

మోర్గాన్ స్టాన్లీ అంచనా ప్రకారం.. భారత్‌లో ప్రజల వద్ద మొత్తం 34,600 టన్నుల బంగారం ఉంది. దీని విలువ ప్రస్తుతం 3.8 ట్రిలియన్ డాలర్లుగా అంచనా. అంటే భారత కరెన్సీలో చూసుకుంటే ప్రజల వద్ద ఉన్న బంగారం విలువ రూ.337 లక్షల కోట్లు. ఇది భారత దేశ జీడీపీలో ఏకంగా 89 శాతంగా ఉంటుందని నివేదిక పేర్కొంది. ప్రజల ఇంటి బ్యాలెన్స్ షీట్‌లో ఇది సానుకూల అంశంగా తెలిపింది. బంగారం ధరలు రోజు రోజుకూ పెరుగుతుండడం ప్రజల సంపదను మరింత పెంచుతున్నట్లు శుక్రవారం విడుదల చేసిన నివేదికలో మోర్గాన్ స్టాన్లీ తెలిపింది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా బంగారం కొనుగోలు చేస్తున్న దేశాల్లో భారత్ రెండో స్థానంలో కొనసాగుతోంది. ప్రపంచ బంగారం డిమాండ్‌లో భారత్ 26 శాతంతో ఉంది. చైనా 28 శాతంతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. భారత ప్రజలు ఆర్థిక పరమైన ఆస్తుల్లో ఇటీవలి కాలంలో ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (%జుఖీ%)ల ద్వారా బంగారంలో ఎక్కువగా ఇన్వెస్ట్ చేస్తున్నట్లు నివేదిక తెలిపింది. గడిచిన ఏడాది కాలంలో చూసుకుంటే గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి భారీగా పెట్టుబడులు వచ్చినట్లు పేర్కొంది. రానున్న భవిష్యత్తు కాలంలోనూ ఈ ట్రెండ్ కొనసాగవచ్చని, బంగారం కొనుగోలు చేసేందుకు భారత ప్రజలు ఆసక్తి కనబర్చవచ్చని పేర్కొంది.

12-10-25 Samayam_Layout 1 10/12/2025 3:36 AM Page 10



## తప్పుడు ఆరోపణల కత్తి.!
# కౌన్సిలింగ్‌పై నేరం ముద్ర!?

(సహారా భాను, రాష్ట్ర అధ్యక్షురాలు, జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి, 8897512100)



**హైదరాబాద్ అక్టోబర్11( సమయం న్యూస్).**మహిళల రక్ష ణ కోసం ఉద్దేశించిన చట్టాలు ఎలా దుర్వినియోగం అవుతున్నాయో, ఆ దుర్వినియోగానికి వ్యతిరేకంగా పోరాడేవారిపై ఎలా ప్రతీకార చర్యలు తీసుకుంటున్నారో.. కేసు పరిష్కారంలో భాగంగా చట్టబద్ధమైన భరణం వంటి అంశాలపై చర్చించడం అనేది కౌన్సిలింగ్ ప్రక్రియలో సహజం. ఈ చర్చను బలవంతపు వసూలుగా మార్చి చూపడం, తప్పుడు ఫిర్యాదుదారుల ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది. ఈ ప్రయత్నం సామాజిక కార్యకర్త నిజాయితీని దెబ్బతీయడమే కాక, ఆమె వృత్తిపరమైన గౌరవానికి భంగం కలిగిస్తుంది. కార్యకర్త చేసిన వాస్తవ వ్యాఖ్యను వక్రీకరించి, దానిని బెదిరింపుగా చూపడం అనేది ఆమె సహాయక పాత్రను అణచివేయడానికి ఉ ద్దేశించిన చర్య.

## పీజేఆర్ నాన్ లోకల్ అంటూ డైలాగ్స్ కొట్టిన జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ మాట మార్చారూ..

**హైదరాబాద్ అక్టోబర్11( సమయం న్యూస్) :** నవీన్ యాదవ్ వ్యాఖ్యలపై పీజేఆర్ అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంపైపలు మీడియా సంస్థలు ప్రముఖంగా కథనాలు వేశాయి.. దీంతో, దెబ్బకి దిగొచ్చేశాడు నవీన్ యాదవ్..అబ్బబ్బే, నేను అలా అనలేదు.. ఆయన యూనివర్సల్ లీడర్.. లోకల్ నాన్ లోకల్ అంటూ పీజేఆర్ లాంటి గొప్ప నాయకుడి ఏముండవు అంటూ చెప్పుకొచ్చాడు.. పైగా ఎవరో తప్పుదోవ పట్టించారని నిట్టూర్చే ప్రయత్నం చేశాడు..శనివారం పీజేఆర్ తనయ విజయా రెడ్డిని ఆమె నివాసానికి వెళ్లి కలిసిన నవీన్ తనకు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరాడు..విజయా రెడ్డి సమక్షం లోనే పీజేఆర్ యూనివర్సల్ లీడర్ అంటూనే తన నాన్ లోకల్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లుగా నవీన్ యాదవ్ మాట్లాడుకొచ్చాడు..

## భద్రాచలం సన్నిధిలో
# వింత సంస్కృతి నడుస్తుంది

### తప్పుచేసి సస్పెండ్ అయిన వారికి మళ్లీ తిరిగి ఆ ప్లేస్‌లోకి పోస్టింగ్...

**భద్రాచలం, అక్టోబర్ 11 (సమయం న్యూస్):** భక్తులు రాముల వారి కోసం ఇచ్చిన డబ్బులు తీసుకొని, నిరూపణ జరిగి సస్పెండ్ అయిన వ్యక్తికి, మళ్లీ అక్కడే అదే పోస్టింగ్? అసలేం జరుగుతుంది? ఇటీవల చర్ల రోడ్డులో గల గిరిజన గురుకుల కళాశాలలో గత ఆరు నెలలుగా పురుగుల అన్నం పెడుతూ విద్యార్థులకు జీవితాలతో ఆడుకుంటునా ప్రిన్సిపల్ వార్డెన్లపై నిరూపణ జరిగి సస్పెండ్ అయిన కుడా మరల అదే కళాశాలలో పోస్టింగ్? ఎలా సాధ్యం? అసలేం జరుగుతుంది?తప్పుచేసి సస్పెండ్ అయిన వాళ్ళకి సాధారణంగా మల్ల అక్కడ పోస్టింగ్ ఇవ్వడం జరగదు, కానీ దానికి భిన్నంగా భద్రాచలంలో సస్పెండ్ అయిన వారికి మరలా అక్కడే పోస్టింగ్ ఇవ్వడం వెనకాల ఏదో మత్తుల జరిగిందని ఆక్కడి ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తుంది.. అసలేం జరిగింది అందులో మర్మం ఏమిటి? ఎంక్వయిరీ చేసిన అధికారి ఎవరు? ఆ ఎంక్వయిరీ ద్వారా ఏం జరిగింది? ఆ ఎంక్వయిరీ ఆఫీసర్స్ తో పాటు మరికొంతమంది అధికారులకు ముడుపులు భారీ మొత్తంలో ముట్టినట్టుగా సమాచారం? గర్ల్స్ కాలేజీలో జెంట్స్ రాజకీయ నాయకుడి తో పాటు కొంతమంది మీడియా వ్యక్తులు టీచర్లుగా జాబ్ చేయడం ఏంటి? సస్పెండ్ అయిన ప్రిన్సిపాల్ వార్డెన్ లకు మరలా 20 రోజులు తిరగకుండానే సేమ్ ప్లేస్ లో పోస్టింగులు ఏ విధంగా సాధ్యమయ్యాయి ? త్వరలో పూర్తి ఆధారాలతో మి స్వతంత్ర న్యూస్ ఛానల్ పైనీరు పేపర్లలొ స్పెషల్ స్టోరీ...


## యథావిధిగా ప్రజావాణి కొనసాగింపు



**ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్11( సమయం న్యూస్):** 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 13వ తేదీ నుండి యధావిధిగా కొనసాగించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్ర మం యధాతథంగా నిర్వహిం చడం జరుగుతుందని, అర్జీదారులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ సమస్యల పరిష్కారం కొరకు దరఖాస్తు చేసు కోవాలని తెలిపారు.

# కష్టపడి.. మాటలు పడి..
# చివరకు కనుమరుగున పడి!


### ఎమ్మెల్యేకు దూరం చేయడమే పీఏ లక్ష్యం?
### పీఏ ఆగడాలతో ఒక్కొక్కరిగా బయటకు..
### కన్నీటి పర్యంతమవుతున్న క్యాడర్




**హైదరాబాద్ , అక్టోబర్ 11 (సమయం న్యూస్):** కాంగ్రెస్‌లో కార్యకర్తలు లేని రోజులవి.. పార్టీ కండువా వేసి ఎన్నికల్లో గెలిచిన వారంతా ఒక్కొక్కరిగా కండువాలు మార్చిన తరుణంలో ఉన్న కొద్దిమంది కార్యకర్తలు భుజాన జెండా మోస్తూ అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే తిట్టినా.. కేసులు పెట్టినా.. భయపడకుండా తమ అభ్యర్థిని ఎమ్మెల్యేగా చూడాలనే కాంక్షతో కసిగా పనిచేసిన సమయమది. అలాంటి కార్యకర్తలు నేడు క్యాంపు కార్యాలయంలో కనుమరుగైపో తున్నారు. పదేండ్ల పాటు ప్రతిపక్షంలో ఉంటూ ప్రజల పక్షాన పోరాడిన ఆ యో ధులంతా నేడు కన్నీటి పర్యంతమవుతున్నారు.

### పీఏ ఏది చెబితే.. అదే కరెక్ట్..

తన పీఏ ఏది చెబితే అదే కరెక్ట్‌గా భావించే ఎమ్మెల్యే.. తన కోసం కష్టపడి పని చేసిన క్యాడర్‌పై తీవ్ర కోపం పెంచుకున్నారు. ఇదే అదునుగా భావించిన సదురు పీఏ ముందుగా కాస్త పరిచయమున్న నేతలను ఏరి పారేశాడు. తదనంతరం కొంత వీఐపీ.. ఆ తర్వాత వీవీఐపీ నేతలను క్యాంపు కార్యాలయంలో లేకుండా చేశాడు. అక్కడి నుంచి పీఏకు అడ్డులేకుండా పోవడమేగాక ఆఫీసులో ఆయన ఆడిందే ఆటగా.. పాడిందే పాటగా సాగుతోంది. జేబులోంచి పైసలు పెట్టి, కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన నాయకత్వమంతా మరిన్ని కొత్త కష్టాలతో కాలం వెల్లదీస్తోంది.





### ఎన్ని'కళ' నెరవేరేనా?



రాత్రనకా.. పగలనకా.. కష్టపడ్డ నేతలంతా ఆయన ఎమ్మెల్యేగా గెలిచిన ఆరు నెలలకే ఒక్కొక్కరు తుడిచిపెట్టుకుపోయారు. ఇక మిగిలిన వారంతా 'ఎన్నికల్లో పోటీ చేసేది ఉందనీ, ఇప్పుడున్న పరిస్థితుల్లో మనకెందుకు లే..' అనుకుంటూ కాలం వెల్లదీస్తున్నారు. అయితే ఇక్కడే పెద్ద చిక్కొచ్చి పడింది. నిన్నా మొన్నటిదాకా రిజర్వేషన్లు తమకు అనుకూలంగా ఉంటాయనుకున్న తరుణంలో బీసీ రిజర్వేషన్ల పెంపు వారికి గుదిబండగా మారింది. దీంతో వారి వారి గ్రామాల్లో తమకు పోటీ చేసేందుకు అవకాశం లేకుండా పోయిందనీ, ఇన్నాళ్లు కన్న కలలన్నీ కల్లలైపోయాయంటూ వాపోతున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది.

### దూరం చేయడమే టార్గెట్..

ఆ దళిత ఎమ్మెల్యేకు పీఏగా ఉన్న ఓ వ్యక్తి డబ్బు సంపాదనే లక్ష్యంగా పెట్టుకోగా, దానికి ప్రధాన అడ్డంకింగా ఉన్న మేయిన్ క్యాడర్‌ను ఎమ్మెల్యే దగ్గర లేకుండా చేయడమే టార్గెట్‌గా పెట్టుకున్నాడు. ఇందుకోసం పక్కా ప్రణాళికలు రచిస్తూ ఒక్కొక్కరిని ఏరి పారేశాడు. పదేళ్లపాటు వ్యక్తిగత పనులు చేసిన వ్యక్తిని సైతం పక్కా ప్లానింగ్‌తో బయటకు గెంటేస్తే ఆ వ్యక్తి తీవ్రంగా కన్నీటి పర్యంతమవుతూ వెళ్లిపోయాడు. పార్టీ కష్టకాలంలో జెండా మోసి, ఒక్కొక్కరిని ఏకం చేసి స్టేజీలపై గళమెత్తిన మరో నాయకుడు ఆ ఎమ్మెల్యేకు ప్రధాన అనుచరుడిగా ఉండగా, తనను గెలిపించిన ఆ గళమే.. మరెక్కడా గళమెత్తకుండా చేసి పారేశాడు. సోషల్ మీడియా ఇన్‌చార్జిగా పని చేసిన కొందరిపై కేసులు పెడితే, కనీసం ఆ కేసుల పరిస్థితిపై అడిగే నాయకుడే లేకపోవడంతో 'కష్టపడి పనిచేస్తే.. మాకు ఇదేం కర్మ పట్టింది రా.. బాబు..' అంటూ సోషల్ మీడియా ఇన్‌చార్జిలతో పాటు కిందిస్థాయి నాయకులు తీవ్ర మనోవేదన చెందుతున్నారు.

# ప్రజలకు ఒకే చోట అన్నిరకాల న్యాయ సేవలు


### హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్




**మంచిర్యాల, అక్టోబర్11( సమయం న్యూస్):** జిల్లా ప్రజలకు ఒకే చోట అన్నిరకాల న్యాయ సేవలు అందించడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ అన్నారు. శనివారం నస్పూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న న్యాయస్థానం భవన సముదాయ నిర్మాణ కార్యక్రమాన్ని వర్చువల్ విధానం ద్వారా ప్రారం భించారు. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా ప్రజలకు అన్నిరకాల న్యాయస్థాన సేవలు ఒకే చోట అందించేందుకు భవన నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అనంతరం జిల్లాకు విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి, మంచిర్యాల జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి నగేష్ భీమపాక, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ వీరయ్య, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఎ భాస్కర్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సిం గ్, మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండవరం జగన్, న్యాయవాదులతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయ మూర్తి, మంచిర్యాల అడ్మినిస్ట్రేటివ్ జడ్జి మాట్లాడుతూ జి ల్లా ప్రజలకు ఒకేచోట జిల్లా స్థాయిలో అన్నిరకాల న్యా యస్థానాల సేవలు అందించేందుకు రూ.81 కోట్ల అం చనాతో భవన నిర్మాణం పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. కోర్టు భవనం శంకుస్థాపన పండగల జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. పోక్సో, ఫ్యామిలీ కోర్టులను కలుపుకొని 10o2 కోర్టులతో భవన సముదాయాన్ని నిర్మించడం జరుగుతుందని పేర్కొన్నారు. 2027 జూన్ మాసం నాటికి నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. భారత న్యాయ నిర్మాణ వ్యవస్థ ద్వారా 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్ర బడ్జెట్ నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు. గోదావరి నదీ తీరాన కేంద్రీకృతమైన మంచిర్యాల జిల్లాలో వరి, పత్తి పంటలు పండుతున్నాయని, ఆధ్యాత్మికతకు నెలవైన మంచిర్యాల జిల్లాలో గూడెంలో గల శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి, గాంధారి ఖిల్లా వంటి ఆధ్యాత్మిక కేంద్రాలు, శివ్వారం మొసళ్ళ అభయారణ్యం, సింగరేణి ఆధ్వర్యంలో బొగ్గు తవ్వకంతో పాటు విద్యుత్ ఉత్పాదకత కలిగి ఉందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కోర్టు, వినియోగదారుల ఫోరం ఏర్పాటుకు తగు ప్రతిపాదనలు పంపిస్తే త్వరితగతిన ఏర్పాటు చేసే విధంగా తమవంతు కృషి చేస్తానని అన్నారు. 20 నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేసేలా చూడాలని అధికారులకు సూచించారు. మితిమీరిన స్వార్థం, స్వార్థ మనస్తత్వ ధోరణి సమాజంలో అన్ని సమస్యలకు కారణమని, ప్రతిఒక్కరూ ధర్మ మార్గంలో పనిచేసుకుంటూ వెళ్తే ఎలాంటి సమస్యలకు అవకాశం ఉ ండదని పేర్కొన్నారు. శ్రమ ఆయుధమైతే విజయం బానిస అవుతుందని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భవన నిర్మాణంతో కోర్టు సేవలు ప్రజలకు మరింత అందుబాటులో ఉంటాయని, భవన నిర్మాణ పనులను సంబంధిత గుత్తేదారు నిర్ణీత వ్యవధిలో, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలన్నారు. తద్వారా ప్రజలకు మరిన్ని సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అనంతరం వివిధ న్యాయ సంఘాల ప్రతినిధులు, న్యాయవాదుల ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయమూర్తిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి



**తాండూర్, అక్టోబర్11( సమయం న్యూస్):** భారతీయ జనతా పార్టీ వేమనపల్లి మండల అధ్యక్షులు ఏట మధుకర్ ఆత్మహత్య కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని తాండూర్ మండల బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. వేమనపల్లి ఎస్సైను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం తాండూర్ కేంద్రంలోని ఐబీలో రాస్తారోకో నిర్వహించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆత్మహత్యకు కారకులైన ప్రతిఒక్కరిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. మధుకర్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ప్రజా సమస్యలపై ఉద్యమిస్తున్న బీజేపీ పార్టీపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా మండల అధ్యక్షుడిపై అక్రమంగా కేసు బణాయించి ఆత్మహత్యకు కారణమయ్యారని, బెల్లంపల్లి ఎమ్మెల్యే వెంటనే స్పందించి వారిని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసి మధుకర్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలం వద్దకు చేరుకొని బీజేపీ నాయకుల ధర్నాను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు దూడపాక భరత్ కుమార్, జిల్లా కార్యదర్శి రామగౌని మహీధర్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, బీజేపీ సీనియర్ నాయకులు చిలువేరు శేషగిరి, పులగం తిరుపతి, వై తుకారాం, జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్ధం మల్లేష్, శీతల్, ఎస్సీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి పాగిడి చిరంజీవి, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, మండల కార్యదర్శి గాదే రాజేశం, మండల ఉపాధ్యక్షులు కొండు రవి, మండల కోశాధికారి రాచర్ల సురేష్, సీనియర్ నాయకులు ఏముర్ల ప్రవీణ్, దుర్గ చరణ్, నాయకులు బీరేష్, ధర్మరాజుల రమేష్, కొమ్మ కొమురెల్లి, సంతోష్ సోషల్ మీడియా కన్వీనర్ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

12-10-25 Samayam_Layout 1 10/12/2025 3:36 AM Page 11



# టీమిండియా భారీ స్కోరు

### 578-5 వద్ద తొలి ఇన్నింగ్ డిక్లేర్

### సెంచరీలతో అదరగొట్టిన జైస్వాల్, గిల్!

### వెస్టిండీస్ నాలుగు వికెట్లకు 140 పరుగులు

### ఇంకా 378 పరుగుల వెనుకంజలో విండీస్





తొలి టెస్టును ఇన్నింగ్స్ 140 పరుగుల తేడాతో కైవసం చేసుకున్న టీమిండియా రెండో టెస్టులోనూ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. శనివారం రెండో రోజు ఆటముగిసే సరికి వెస్టిండీస్ 43 ఓవర్లలో నాలుగు వికెట్లకు 140 పరుగులు చేసింది. వన్ డౌన్ బ్యాటర్ ఆలిక్ అతనాజ్ (41) టాప్ స్కోరర్ గా నిలిచాడు. క్రీజులో షాయ్ హోప్ (31 బ్యాటింగ్), వికెట్ కీపర్ బ్యాటర్ టెవిన్ ఇమ్లాచ్ (14 బ్యాటింగ్) ఉన్నారు. ఇంకా 378 పరుగుల వెనుకంజలో విండీస్ నిలిచింది. భారత బౌలర్లలో రవీంద్ర జడేజాకు మూడు వికెట్లు దక్కాయి. కుల్దీప్ యాదవ్ కు ఒక వికెట్ దక్కింది. అంతకుముందు తొలి ఇన్నింగ్సు ను 578-5 వద్ద భారత్ డిక్లేర్ చేసింది. జోమెల్ వర్రీకాన్ కు మూడు వికెట్లు దక్కాయి. రవీంద్ర జడేజా(3/98) తీన్మార్ బౌలింగ్‌తో రెండో రోజు ఆట ముగిసే సమయానికి వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 43 ఓవర్లలో 4 వికెట్లకు 140 పరుగులు చేసింది. ఆ జట్టు ఇంకా 378 పరుగుల వెనుకంజలో ఉంది. ఓపెనర్లు త్యాగనరైన్ చంద్రపాల్(67 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 34), జాన్ కాంప్‌బెల్(25 బంతుల్లో 2 ఫోర్లతో 10) మరోసారి నిరాశపర్చగా.. అలిక్ అథనాజే(84 బంతుల్లో 5 ఫోర్లతో 41), షైహోప్(46 బంతుల్లో 5 ఫోర్లతో 31 బ్యాటింగ్) పర్వాలేదనిపించారు. రోస్టన్ ఛేజ్(0) డకౌటవ్వగా.. టెవిన్ ఇమ్లాచ్(14 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. భారత బౌలర్లలో జడేజా మూడు వికెట్లు తీయగా.. కుల్దీప్ యాదవ్ ఒక వికెట్ పడగొట్టాడు. అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 134.2 ఓవర్లలో 5 వికెట్లకు 518 పరుగుల భారీ స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్(258 బంతుల్లో 22 ఫోర్లతో 175), శుభ్‌మన్ గిల్(196 బంతుల్లో 2 సిక్స్‌లతో 16 ఫోర్లతో 129 నాటౌట్) శతకాలతో చెలరేగారు. నితీష్ కుమార్ రెడ్డి(54 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 43), ధ్రువ్ జురెల్(79 బంతుల్లో 5 ఫోర్లతో 44), కేఎల్ రాహుల్(54 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 38) హాఫ్ సెంచరీలు చేజార్చుకున్నారు. వెస్టిండీస్ బౌలర్లలో జొమెల్ వారికన్(3/98) మూడు వికెట్లు తీయగా.. రోస్టన్ ఛేజ్ ఓ వికెట్ పడగొట్టాడు. మూడో రోజు ఆట మ్యాచ్ గమనాన్ని నిర్దేశించనుంది. వెస్టిండీస్ బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకొని బ్యాటింగ్ చేస్తే.. మ్యాచ్ రసవత్తరంగా మారుతుంది. అలా కాకుండా పెవిలియన్ క్యూ కడితే భారత్ ఏకపక్ష విజయాన్నందుకోనుంది. రెండో రోజు ఆటలోనూ మూడు సెషన్లలో టీమిండియా ఆధిపత్యం చెలాయించింది. 318/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన టీమిండియాకు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. రెండో ఓవర్‌లోనే అనవసర పరుగుకు ప్రయత్నించి యశస్వి జైస్వాల్ రనౌట్‌గా వెనుదిరిగాడు. శుభ్‌మన్ గిల్‌తో సమన్వయ లోపం కారణంగా అతను డబుల్ సెంచరీ చేజార్చుకున్నాడు. దాంతో మూడో వికెట్‌కు నమోదైన 74 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి వచ్చిన నితీష్ కుమార్ రెడ్డితో కలిసి గిల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో గిల్ 95 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో నితీష్ కుమార్ రెడ్డి దూకుడుగా ఆడే ప్రయత్నంలో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగి హాఫ్ సెంచరీ చేజార్చుకున్నాడు. క్రీజులోకి ధ్రువ్ జురెల్ రాగా.. మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడిన గిల్ తొలి సెషన్‌ను ముగించాడు. దాంతో టీమిండియా 427/4 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది.రెండో సెషన్‌లోనూ సాధికారికంగా బ్యాటింగ్ చేసిన గిల్.. 177 బంతుల్లో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. ధ్రువ్ జురెల్ కూడా అతనికి అండగా నిలిచాడు. హాఫ్ సెంచరీ ముంగిట రోస్టన్ ఛేజ్ బౌలింగ్‌లో ధ్రువ్ జురెల్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. దాంతో ఐదో వికెట్‌కు నమోదైన 102 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ వెంటనే ఇండియా తమ తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్.. భారత పేసర్లను ఆచితూచి ఆడింది. దాంతో జడేజాను బరిలోకి దింపిన గిల్ ఆశించిన ఫలితాన్ని రాబట్టాడు. ఓపెనర్ కాంప్‌బెల్ కొట్టిన షాట్‌ను షార్ట్ లెగ్ ఫీల్డర్ సాయి సుదర్శన్ అద్భుతంగా అందుకున్నాడు. ఈ క్యాచ్ పట్టే క్రమంలో అతని చేతికి గాయమైంది. క్రీజులోకి వచ్చిన అథనజేతో కలిసి చంద్రపాల్ ఆచితూచి ఆడాడు. దాంతో 26/1 స్కోర్‌తో విండీస్ టీబ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లో విండీస్ ద్వయం సాధికారికంగా బ్యాటింగ్ చేసింది. ఓపికగా ఆడిన ఈ జోడీ వీలుచిక్కిన బంతిని బౌండరీకి తరలించింది. హాఫ్ సెంచరీ దిశగా సాగిన చంద్రపాల్‌ను జడేజా రాహుల్ సాయంతో క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో రెండో వికెట్‌కు నమోదైన 66 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. షైహోప్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించిన అలిక్ అథనజే(41)ను కుల్దీప్ యాదవ్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే రోస్టన్ ఛేజ్(0)ను జడేజా డకౌట్ చేశాడు. క్రీజులోకి వచ్చిన ఇమ్లాచ్‌తో కలిసి షైహోప్ మరో వికెట్ పడకుండా ఆచితూచి ఆడి రెండో రోజు ఆటను ముగించాడు.

# నఖ్వీ పై కఠిన చర్యలకు బీసీసీఐ రంగం సిద్ధం



ఆసియా కప్ 2025 ఫైనల్‌లో భారత్ విజయం సాధించిన తర్వాత, విజేతలకు ట్రోఫీ అందించే విషయంలో తలెత్తిన వివాదం మరింత ముదురుతోంది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మోసిన్ నఖ్వీ వ్యవహరించిన తీరుపై బీసీసీఐ తీవ్ర ఆగ్రహంతో ఉంది. ట్రోఫీని నఖ్వీ చేతుల మీదుగా తీసుకోడానికి భారత జట్టు నిరాకరించడంతో ఆయన ట్రోఫీని ఏసీసీ హెడ్‌క్వార్టర్స్‌లోనే ఉంచాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో నఖ్వీని ఐసీసీ బోర్డు ఆఫ్ డైరెక్టర్ పదవి నుంచి తొలగించేందుకు బీసీసీఐ బలమైన చర్యలు తీసుకోబోతోందని తెలుస్తోంది. ట్రోఫీని స్వయంగా తానే వచ్చి కెప్టెన్‌కు లేదా బీసీసీఐ ప్రతినిధులకు ఇస్తానని నఖ్వీ మొండిగా చెబుతున్నప్పటికీ, ఆసియా కప్‌కు పాకిస్థాన్ అధికారిక ఆతిథ్యం ఇచ్చింది కాబట్టి, విజేతగా నిలిచిన భారత్‌కు ట్రోఫీని తక్షణమే అప్పగించాల్సిందేనని బీసీసీఐ స్పష్టం చేస్తోంది. నఖ్వీ వివాదాస్పద వైఖరిపై బీసీసీఐ తీవ్రంగా స్పందించాలని నిర్ణయించుకున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. న్యూస్ ఏజెన్సీ పీటీఐ నివేదిక ప్రకారం.. బీసీసీఐ ఇప్పుడు నఖ్వీని మందలించాలని, ఐసీసీలోని బోర్డు ఆఫ్ డైరెక్టర్ పదవి నుంచి తొలగించాలని కూడా చూస్తోంది. ఈ టోర్నీకి పాకిస్థాన్ అధికారిక ఆతిథ్యం ఇచ్చింది కాబట్టి, నఖ్వీ స్వయంగా ట్రోఫీని ఇవ్వడానికి పట్టుబట్టడం లేదా బీసీసీఐకి పంపకుండా నిరాకరించడం సరైనది కాదని బీసీసీఐ భావిస్తోంది. బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా కూడా ఆసియా కప్ నఖ్వీ వ్యక్తిగత సొత్తు కాదని గట్టి కౌంటర్ ఇచ్చారు. నఖ్వీ ధోరణి ఇలాగే కొనసాగితే కఠిన చర్యలకు ఉపక్రమించే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ఈ ఆసియా కప్ టోర్నీలో భారత్, పాకిస్థాన్ మధ్య శత్రుత్వం మ్యాచ్‌ల కంటే ఎక్కువగా చర్చనీయాంశమైంది. టోర్నీ మొదటి మ్యాచ్‌లోనే పాక్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా, భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌తో షేక్ హ్యాండ్ ఇవ్వకుండా దూరం ఉండాలని ఐసీసీ మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ చెప్పారంటూ పీసీబీ ఆరోపించింది. గ్రూప్ %ూ% మ్యాచ్ సమయంలో తమ డిమాండ్స్ నెరవేర్చకపోతే యూఏఈతో జరగబోయే మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేయాలని కూడా పాకిస్థాన్ ఆలోచించినట్లు నివేదికలు వచ్చాయి. సూపర్ 4, ఫైనల్ మ్యాచ్‌లలో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య వాగ్వాదాలు జరిగాయి. బీసీసీఐ, పీసీబీ ఫిర్యాదుల మేరకు ఐసీసీ ఆటగాళ్లకు జరిమానాలు కూడా విధించింది.

# భారీ మార్పులకు సిద్ధమవుతోన్న రాజస్థాన్ రాయల్స్

### సంజు శాంసన్ ను వదులుకునే అవకాశం!!



ఐపీఎల్ 2026 సీజన్ కోసం ఫ్రాంచైజీలు ఇప్పటి నుంచే తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఈ క్రమంలో గత సీజన్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేని రాజస్థాన్ రాయల్స్ జట్టు భారీ మార్పులకు సిద్ధమవుతోంది. గత సీజన్‌లో తొమ్మిదో స్థానంలో నిలిచిన ఆర్ఆర్.. కొత్త కెప్టెన్, కొత్త ఆటగాళ్లతో బరిలోకి దిగాలని చూస్తోంది. ఈ మెగా ఆక్షన్ ముందు జట్టులో కీలకమైన ముగ్గురు ఆటగాళ్లను, ముఖ్యంగా ప్రస్తుత కెప్టెన్ సంజు శాంసన్‌ను కూడా విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. రాజస్థాన్ రాయల్స్‌లో జరగబోయే అతి పెద్ద మార్పులలో ఒకటి, జట్టు కెప్టెన్ సంజు శాంసన్‌ను విడుదల చేయడం. గత సీజన్‌లో జట్టు వైఫల్యం, శాంసన్ వ్యక్తిగత ప్రదర్శనపై ప్రభావం చూపింది. గత సీజన్‌లో గాయాలతో బాధపడిన సంజు కేవలం 9 మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. అంతేకాకుండా కెప్టెన్సీ ఒత్తిడి అతని బ్యాటింగ్‌పై ప్రభావం చూపింది. సంజు శాంసన్ తన ఐపీఎల్ కెరీర్‌ను 2013 లో రాజస్థాన్ రాయల్స్‌తోనే ప్రారంభించాడు. అతను ఐపీఎల్‌లో ఇప్పటివరకు చేసిన 4,704 పరుగులు రాజస్థాన్ తరఫున చేసినవే. అయినప్పటికీ, నిరంతర గాయాలు, కమాండింగ్ కెప్టెన్సీ చేయలేకపోవడం వంటి కారణాల వల్ల ఫ్రాంచైజీ అతనిని మెగా ఆక్షన్ ముందు విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. రాజస్థాన్ రాయల్స్ విడుదల చేయాలని యోచిస్తున్న మరో కీలక ఆటగాడు శ్రీలంక స్పిన్నర్ మహీష్ తీక్షణ. గత సీజన్‌లో తీక్షణను ఆర్ఆర్ జట్టు రూ. 4.40 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే, అతని ప్రదర్శన అంచనాలను అందుకోలేకపోయింది. అతను ఆడిన సీజన్ మొత్తంలో కేవలం 11 వికెట్లు మాత్రమే తీయగలిగాడు. అంతేకాకుండా, అతని ఎకానమీ రేటు 9.26 గా, బౌలింగ్ సగటు 37 కంటే ఎక్కువగా ఉండటం తీవ్ర నిరాశ కలిగించింది. జట్టు మేనేజ్‌మెంట్ ఇప్పుడు పవర్ ప్లే, డెత్ ఓవర్లలో ప్రభావం చూపగల మంచి స్పెషలిస్ట్ స్పిన్నర్ కోసం చూస్తోంది. ఈ నేపథ్యంలో తీక్షణను విడుదల చేసి మెరుగైన స్పిన్ ఆప్షన్లను పరిశీలించే అవకాశం ఉంది. వెస్టిండీస్‌కు చెందిన విధ్వంసకర బ్యాట్స్‌మెన్ షిమ్రాన్ హెట్‌మయర్‌ను కూడా విడుదల చేసే అవకాశం ఉంది. హెట్‌మయర్ గత కొన్ని సీజన్లుగా తన స్థాయికి తగ్గట్టుగా రాణించలేకపోతున్నాడు. అతన్ని రూ. 11 కోట్లకు రిటైన్ చేసుకున్నారు. అయితే, 2025 సీజన్‌లో అతను 14 మ్యాచ్‌లలో కేవలం 239 పరుగులు మాత్రమే చేశాడు. జట్టుకు ముఖ్యమైన ఫినిషర్ పాత్రలో అతను పూర్తిగా విఫలమయ్యాడు. 2022 సీజన్ తర్వాత హెట్‌మయెర్ ఏ సీజన్‌లోనూ 300 పరుగుల మార్కును చేరుకోలేకపోయాడు. అందుకే, రాజస్థాన్ రాయల్స్ ఇప్పుడు అతన్ని విడుదల చేసి, ఆక్షన్ ద్వారా కొత్త ఫినిషర్ లేదా విదేశీ పవర్ హిట్టర్‌ను తీసుకోవాలని ప్రణాళిక వేస్తోంది. రాజస్థాన్ రాయల్స్ 2026 సీజన్‌కు పూర్తిగా కొత్త వ్యూహం, కొత్త ముఖాలతో ముందుకు రావాలని నిర్ణయించుకుంది. జట్టును బలోపేతం చేయడానికి అనుభవజ్ఞులైన ఆల్‌రౌండర్‌లు, స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్‌లపై దృష్టి సారించనుంది. ఈ మెగా ఆక్షన్ ముందు ఈ ముగ్గురు కీలక ఆటగాళ్లను విడుదల చేయడం ద్వారా, ఆర్ఆర్ వచ్చే సీజన్‌ను కొత్త కెప్టెన్, కొత్త ఆలోచనలతో ప్రారంభించడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.

# టెస్ట్ క్రికెట్‌లో టీమిండియా చరిత్ర

### వరుసగా ఐదు వికెట్లకు 50 ప్లస్ భాగస్వామ్యాలు

### 65 ఏళ్లలో ఇదే తొలిసారి!

టెస్ట్ క్రికెట్‌లో టీమిండియా చరిత్ర సృష్టించింది. 65 ఏళ్ల తర్వాత వెస్టిండీస్‌పై వరుసగా ఐదు వికెట్లకు 50 ప్లస్ భాగస్వామ్యాలను నమోదు చేసిన జట్టుగా భారత్ అరుదైన రికార్డ్ నమోదు చేసింది. వెస్టిండీస్‌తో న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న రెండో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా ఈ ఫీట్ సాధించింది. ఈ ఇన్నింగ్స్‌లో టీమిండియా టాప్-5 బ్యాటర్లు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్, నితీష్ కుమార్ రెడ్డి, ధృవ్ జురెల్ వరుసగా ఐదు వికెట్లకు 50o రన్స్ పార్ట్‌నర్‌షిప్స్ అందించారు. తొలి వికెట్‌కు రాహుల్-జైస్వాల్ 58, రెండో వికెట్‌కు జైస్వాల్-సాయి సుదర్శన్ 193, మూడో వికెట్‌కు జైస్వాల్-శుభ్‌మన్ గిల్ 69, నాలుగో వికెట్‌కు శుభ్‌మన్ గిల్-నితీష్ కుమార్ రెడ్డి 91, ఐదో వికెట్‌కు శుభ్‌మన్ గిల్-ధ్రువ్ జురెల్ 102 పరుగుల భాగస్వామ్యాలను నమోదు చేశారు. 1960 తర్వాత వెస్టిండీస్ జట్టుపై ఒక టీమ్ వరుసగా ఐదు వికెట్లకు 50 ప్లస్ రన్స్ పార్ట్‌నర్‌షిప్స్ నమోదవ్వడం ఇదే తొలిసారి. గతంలో ఈ రికార్డ్‌ను వెస్టిండీస్‌పై ఆస్ట్రేలియా నమోదు చేసింది. 1960లో బ్రిస్బేన్ వేదికగా జరిగిన గబ్బా టెస్ట్‌లో ఆసీస్ ఈ ఫీట్ సాధించింది.93 ఏళ్ల భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో టీమిండియా ఈ ఫీట్ సాధించడం మూడో సారి. 1993లో తొలిసారి, 2023లో ఆస్ట్రేలియాపై రెండో సారి టీమిండియా వరుసగా 5 వికెట్లకు 50 ప్లస్ రన్స్ భాగస్వామ్యాలను నమోదు చేసింది. తాజాగా మరోసారి ఈ ఫీట్ అందుకుంది.

# కోచ్‌గా న్యూజిలాండ్ చేతిలో పరాజయాన్ని మరిచిపోలేను

### టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్




టీమిండియా హెడ్ కోచ్‌గా సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో ఎదురైన సిరీస్ పరాజయాన్ని తాను మరిచిపోలేనని గౌతమ్ గంభీర్ తెలిపాడు. జీవితాంతం ఈ ఓటమి తనను వెంటాడుతుందని చెప్పాడు. ఈ పరాజయాన్ని మరిచిపోయే ప్రయత్నం కూడా చేయనని, తమ ఆటగాళ్లకు పదే పదే గుర్తు చేస్తానని కూడా చెప్పాడు. రాహుల్ ద్రవిడ్ అనంతరం టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన గౌతమ్ గంభీర్.. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీతో పాటు ఆసియా కప్ 2025 టోర్నీల్లో టీమిండియాను విజేతగా నిలిపాడు. కానీ సుదీర్ఘ ఫార్మాట్‌లో మాత్రం గంభీర్ హెడ్ కోచ్‌గా ఘోర పరాజయాలను చవిచూసాడు.అతని పర్యవేక్షణలో టీమిండియా సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో మూడు టెస్ట్‌ల సిరీస్‌లో క్లీన్ స్వీప్ అయ్యింది. 93 ఏళ్ల భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే సొంతగడ్డపై క్లీన్ స్వీప్ కావడం ఇదే తొలిసారి. ఈ పరాజయంతో టీమిండియా డబ్ల్యూటీసీ 2025 ఫైనల్‌కు కూడా అర్హత సాధించలేకపోయింది. తాజాగా ఈ పరాజయంపై స్పందించిన గంభీర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వెస్టిండీస్‌తో రెండో టెస్ట్ సందర్భంగా రెండో రోజు ఆట లంచ్ బ్రేక్‌లో అధికారిక బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడిన గంభీర్.. డబ్ల్యూటీసీ ఛాంపియన్‌గా నిలవాలంటే విదేశాల్లో కూడా రాణించాలని చెప్పాడు. 'వరల్డ్ బెస్ట్ టెస్ట్ టీమ్‌గా ఎదగాలంటే సొంతగడ్డపైనే కాకుండా విదేశాల్లోనూ ఆధిపత్యం కనబర్చాలనేది నా ఆలోచన. ఈ యువ జట్టు ఆ ఆలోచనను అమలు చేసింది. అత్యంత కఠినమైన ఇంగ్లండ్ పర్యటనలో పెద్దగా అనుభవం లేని మా యువ జట్టు అద్భుత ప్రదర్శన కనబర్చింది. ఫలితం ఎలా ఉన్నా.. ప్రతీ రోజు మా ఆటగాళ్లు పోరాడిన తీరు అద్భుతం. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించాలంటే సొంతగడ్డపై ఆధిపత్యం చెలాయిస్తే సరిపోతుందనే సిద్దాంతాన్ని నేను నమ్మను. ఎందుకంటే సొంతగడ్డపై మాత్రమే రాణిస్తే.. వరల్ట్ టెస్ట్ ఛాంపియన్‌గా నిలిచేందుకు ఏ మాత్రం అర్హులు కారు.కోచ్‌గా న్యూజిలాండ్ చేతిలో ఎదురైన పరాజయాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. ఆ ఓటమిని మర్చిపోకూడదు కూడా. ఈ ఓటమిని మా ఆటగాళ్లకు పదే పదే గుర్తు చేయాలి. ఓటమిని మరిచి ముందుకు వెళ్లడం ముఖ్యమే. కానీ కొన్నిసార్లు గతాన్ని కూడా గుర్తుంచుకోవాలి. ఎందుకంటే గతాన్ని మర్చిపోతే తేలికగా తీసుకోవడం మొదలుపెడుతారు. దేనిని కూడా తేలికాగా తీసుకోకూడదు. ఎందుకంటే న్యూజిలాండ్‌ను మేం సునాయసంగా ఓడిస్తామని అంతా అనుకున్నారు. కానీ ఫలితం మరోలా వచ్చింది. ఇదే వాస్తవం. ఆట అంటేనే ఇలా ఉంటుంది.నన్ను అడిగితే న్యూజిలాండ్ చేతిలో ఎదురైన పరాజయాన్ని డ్రెస్సింగ్ రూమ్‌లో పదే పదే మా ఆటగాళ్లకు గుర్తు చేస్తూ ఉండాలని చెబుతాను. అందేకే మేం ప్రత్యర్థిని ఇంచ్ కూడా తేలికగా తీసుకోం. ప్రతికూల పరిస్థితుల్లో శుభ్‌మన్ గిల్ ఎలా రియాక్ట్ అవుతాడో అని నాకు చూడాలని ఉంది. అతనికి నేను ఎప్పుడూ అండగా ఉంటాను. అతనిపై ఈగ కూడా వాలనివ్వను. విమర్శలను స్వీకరించేందుకు నేను సిద్దంగా ఉన్నాను. అతను సరైన డైరెక్షన్‌లో నడిచే వరకు అండగా ఉంటాను.'అని గౌతమ్ గంభీర్ చెప్పుకొచ్చాడు.

12-10-25 Samayam_Layout 1 10/12/2025 3:36 AM Page 12



# C.I.N.E.M.A.



# లక్‌కోసం ఎదురు చూస్తున్న కృతిశెట్టి

తొలి సినిమాతోనే తెలుగులో గ్రాండ్ సక్సెస్ అందుకున్న భామల్లో ఒకరు కృతిశెట్టి. ఉప్పెన సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. అద్భుతమైన నటనతో కుర్రకారు మనసు దోచేసిన కృతిశెట్టి ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంది. కానీ ఆ తర్వాత చేసిన సినిమాలు మాత్రం కృతిశెట్టికి నిరాశనే మిగిల్చాయని చెప్పాలి. కృతిశెట్టి హీరోయిన్‌గా నటించిన కస్టడీ, మనమే, ది వారియర్, మాచెర్ల నియోజకవర్గం సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఈ వరుస ఫెయిల్యూర్స్ టాలీవుడ్‌లో కృతిశెట్టి ప్రయాణంపై ప్రభావం చూపించాయి. అయితే ఇక చేసేదేమి లేక తమిళంలో తన లక్‌ను పరీక్షించుకోవాలనుకున్నకృతిశెట్టి అక్కడ మూడు సినిమాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పాపులర్ యాక్టర్లతో సినిమాలు చేసి.. షూటింగ్స్ పూర్తి చేసినా పలు కారణాల వల్ల ఆలస్యమవుతూ వచ్చాయి. తీవ్ర నిరాశలో ఉ ండిపోయిన కృతిశెట్టి అభిమానుల కోసం వరుసగా ఆ సినిమాలు విడుదలకు రెడీ అయ్యాయి. పై మూడు సినిమాలు ఒకేసారి ఒకే నెలలో విడుదలకు ముస్తాబవుతున్నాయి. ఈ మూడు ప్రాజెక్టులు కూడా డిసెంబర్ నెలలోనే రిలీజ్ కాబోతుండటం విశేషం. కృతిశెట్టి కార్తీతో కలిసి నటిస్తున్న వా వాథియార్, ప్రదీప్ రంగనాథన్ లవ్ ఇన్సూరెన్స్, రవిమోహన్ సినిమాలు డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. చాలా కాలంగా సరైన బ్రేక్ ఎదురుచూస్తున్న కృతిశెట్టికి ఈ డిసెంబర్ అయినా కలిసి రావాలని కోరుకుంటున్నారు అభిమానులు, ఫాలోవర్లు.

# రౌడీ జనార్ధన్‌గా వస్తున్న విజయ్ దేవరకొండ



వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు విజయ్ దేవరకొండ.. ఈ హీరో మరో చిత్రం 'రౌడీ జనార్దన్' ప్రారంభమైంది. రవి కిరణ్ కోలా దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో విజయ్ సరసన కీర్తి సురేశ్ నటిస్తున్నారు. శనివారం పూజా కార్యక్రమాలతో ఈ సినిమా ప్రారంభమైంది. నిర్మాత అల్లు అరవింద్ కల్‌ఆప్ కొట్టారు. దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట షేర్ అవుతున్నాయి. ఈ కార్యక్రమానికి నిర్మాతలు దిల్ రాజు, అల్లు అరవింద్ హాజరయ్యారు. 'రాజావారు రాణిగారు' సినిమాతో తెలుగు ప్రేక్షకులను మెప్పించిన దర్శకుడే రవికిరణ్ కోలా. తొలి మూవీకి భిన్నంగా ఈసారి విజయ్‌తో యాక్షన్‌కు ప్రాధాన్యం ఉన్న కథను తెరకెక్కించనున్నారు. ఈనెల 16 నుంచి ముంబయిలో ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. మొదటిసారి విజయ్ సరసన కీర్తి సురేశ్ కనిపించనుండడంతో దీనిపై ఆసక్తి ఏర్పడింది.

# సిద్ధూ సినిమా.. ఓ రొమాంటిక్ డ్రామా

## హీరోయిన్ శ్రీనిధిశెట్టి



కేజీఎఫ్ సినిమాతో హీరోయిన్‌గా బ్లాక్ బస్టర్ హిట్టందుకుంది శ్రీనిధి శెట్టి. తెలుగులో నానితో హిట్ 3లో కలిసి నటించింది. ఈ భామ ప్రస్తుతం సిద్దుజొన్నలగడ్డతో రొమాంటిక్ ఎంటర్‌టైనర్ తెలుసు కదా సినిమాలో నటిస్తుంది. ఈ మూవీ అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా గురించి ఆసక్తికర విషయాలు షేర్ చేసుకుంది శ్రీనిధిశెట్టి. చిట్ చాట్ సెషన్‌లో శ్రీనిధి శెట్టి మాట్లాడుతూ.. కేజీఎఫ్, హిట్ 3 లాంటి వయొలెన్స్, రక్తపాతం చుట్టూ తిరిగే సినిమాల తర్వాత సున్నిత భావోద్వేగాలతో సాగే సినిమా ఇది. ఈ మూవీ నాకు ఉత్తేజాన్ని కలిగించే మార్పులాంటిది. ఈ చిత్రాన్ని ప్రతీ ఒక్కరూ ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నానంది. తెలుసు కదా ప్రేమ, ఎమోషన్, నవ్వులు, అందమైన పాటలతో సాగే కమర్షియల్ సినిమా. ఈ సినిమా చూసిన తర్వాత మూవీ లవర్స్ ఒక అందమైన రొమాంటిక్ డ్రామాను చూసినట్టు ఫీల్ అవుతారంది శ్రీనిధి శెట్టి . సినిమాకు పనిచేయడం గురించి మాట్లాడుతూ.. నాకు డైరెక్టర్ నీరజ కోన, సిద్ధు, రాశీ ఖన్నాతో కలిసి నటించే అద్భుతమైన సమయం దొరికింది. నీరజ కోన చాలా సపోర్ట్‌గా నిలిచే వ్యక్తి. ప్రేక్షకులు ఖచ్చితంగా సిద్ధు పాత్రతో ప్రేమలో పడిపోతారు. అతడికి ప్రతీ విభాగంలో అద్భుతమైన ప్రావీణ్యం ఉంది. రాశీఖన్నా చాలా క్రమశిక్షణతో ఉండే వ్యక్తి అని చెప్పుకొచ్చింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి పనిచేయడం గొప్పగా భావిస్తున్నానంది. సినిమాల పట్ల ఎంతో ప్యాషన్ ఉన్న నిర్మాతలతో కలిసి పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానంది శ్రీనిధిశెట్టి.

## మళ్లీ అదే తప్పు చేస్తున్న శ్రీ లీల.. టెన్షన్ లో ఫ్యాన్స్!

శ్రీ లీల.. టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో యంగ్ హీరోయిన్ గా పేరు సొంతం చేసుకున్న ఈమె.. ఇప్పుడు భాషతో సంబంధం లేకుండా వరుస అవకాశాలు అందుకుంటూ బిజీగా మారిపోయింది. వరుస అవకాశాలు అయితే వస్తున్నాయి కానీ సక్సెస్ రేట్ మాత్రం నిల్ అని చెప్పడంలో సందేహం లేదు. సాధారణంగా ఒకసారి దెబ్బతిన్న తర్వాత మరోసారి కచ్చితంగా ఎవరైనా సరే కళ్ళు తెరుచుకుంటారు. కానీ శ్రీ లీలా మాత్రం మళ్లీ అదే తప్పు చేస్తూ అభిమానులను టెన్షన్లో పెట్టేసింది. మరి అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం.. కే రాఘవేంద్రరావు దర్శకత్వ పర్యవేక్షణలో పెళ్లి సంద%ఊ% అనే సినిమాతో హీరోయిన్గా తెలుగు తెరకు పరిచయమైంది శ్రీ లీల.. ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలోనే ధమాకా సినిమాతో బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకొని.. స్టార్ హీరోయిన్గా పేరు సొంతం చేసుకుంది. ఎంత వేగంగా అయితే స్టార్ స్టేటస్ లభించిందో.. అంతే స్పీడుగా బ్యాక్ టు బ్యాక్ డిజాస్టర్ సినిమాలు ఆమె ఖాతాలో పడ్డాయి. దీంతో శ్రీ లీల స్టోరీ సెలక్షన్ మీద, ఆమె యాక్టింగ్ మీద , క్యారెక్టర్ మీద పలు రకాల సెటైర్లు కూడా వినిపించాయి. ధమాకా సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న ఈమెకు వరుసగా అవకాశాలు తలుపుతట్టాయి. అలా రామ్ పోతినేని తో స్కంద, బాలకృష్ణ హీరోగా నటించిన భగవంత్ కేసరి సినిమాలో బాలయ్యకు కూతురుగా, మెగా మేనల్లుడు వైష్ణవ్ తేజ్ తో ఆదికేశవ, నితిన్ తో ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్, రాబిన్ హుడ్, మహేష్ బాబుతో గుంటూరు కారం, గాలి కిరీటి రెడ్డితో జూనియర్ ఇలా దాదాపు బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఇందులో భగవంత్ కేసరి, గుంటూరు కారం సినిమాలు మంచి విజయాన్ని అందుకున్నా.. ఈమె కెరియర్ కి పెద్దగా ఇంపాక్ట్ చూపించలేదు. చివరిగా వచ్చిన జూనియర్ సినిమాతో నైనా సక్సెస్ అందుకుంటుంది అని అభిమానులు ఎంతగానో ఎదురు చూశారు. ఇందులో 'వైరల్ వయ్యారి' పాట ఈమె నటనను ఊహించని రేంజ్ కు తీసుకెళ్లింది. కానీ ఈ సినిమా కూడా పెద్దగా ఈమెకు వర్కౌట్ కాలేదు. పైగా పుష్ప 2 లో స్పెషల్ సాంగ్ చేసింది. ఇప్పుడేమో రవితేజ తో మాస్ జాతర అంటూ ప్రేక్షకుల ముందుకు వస్తోంది. కానీ ఈ సినిమా హడావిడి కూడా పెద్దగా కనిపించడం లేదు.

# మీతో స్క్రీన్ షేర్ చేసుకోవడం అదృష్టం

## బిగ్‌బి అమితాబ్‌కు బర్త్‌డే విషెస్ చెప్పిన ప్రభాస్





బాలీవుడ్ సూపర్ స్టార్ హీరో అమితాబ్ బచ్చన్ అక్టోబర్ 11న అంటే..శనివారం 83వ ఏడాదిలోకి అడుగు పెట్టారు. ఈ సందర్భంగా అతడికి సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తుఉన్నాయి. టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా బిగ్ బీకి బర్త్ డే విషెస్ తెలిపారు. ఈ పోస్టులో 'మీకు దగ్గర ఉండి మీ వర్క్‌ను చూడడం, మీతో కలిసి స్క్రీన్ పంచుకోవడం నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాను.. మీరు ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలి అంటూ రెబల్ స్టార్ ప్రభాస్ విషెస్ చేశారు. ఇక, వీరిద్దరి కాంబినేషన్‌లో గతేడాది విడుదలైన 'కల్కి 2898 ఏడీ' థియేటర్లలో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. భారీ బ్జడెట్‌తో తెరకెక్కిన ఈ మూవీ రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఈ సైన్స్ ఫిక్షన్ చిత్రంలో అమితాబ్ బచ్చన్.. అశ్వత్థామగా, ప్రభాస్ భైరవగా నటించారు. ప్రస్తుతం దీని సీక్వెల్ పనులు కొనసాగుతున్నాయి. అయితే, ప్రస్తుతం 'కల్కి2'కు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారింది. ఈ భారీ ప్రాజెక్ట్ నుంచి ఇప్పటికే దీపిక పదుకొణెను వైజంతి మూవీస్ తొలగించిన విషయం తెలిసిందే. దీంతో కల్కి2 సీక్వెల్‌లో ఆమె పాత్రను ఎవరు పోషిస్తారా అనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. ఈ పాత్రలో బాలీవుడ్ క్వీన్ అలియా భట్ నటించనున్నట్లు న్యూస్ వస్తుంది. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన కోసం అభిమానులు వేచి చూస్తున్నారు.

# ఓ భారీ సినిమా కోసం కష్టపడుతున్నా

## అల్లుతో సినిమాపై అట్లీ కామెంట్స్



అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా గురించి అట్లీ ఓ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రేక్షకులు ఆశ్చర్యపోయే ప్రపంచాన్ని సృష్టించనున్నట్లు తెలిపారు. తాజాగా బెంగళూరులో జరిగిన పికిల్‌బాల్ టోర్నమెంట్‌కు అట్లీ అతిథిగా హాజరయ్యారు. ఇందులో ఈ మూవీ గురించి మాట్లాడారు. 'ఏదైనా ఒక్క ఆలోచనతోనే ప్రారంభమవుతుంది. ఈ సినిమాతో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇవ్వడానికి మేం ప్రయత్నిస్తున్నాం. ఆడియన్స్ ఆశ్చర్యపోయేలా కొత్త ప్రపంచాన్ని సృష్టించనున్నాం. దేవుడు మా ప్రయాణంలో ప్రతి అడుగులోనూ తోడున్నాడు. ఆయన దయ వల్ల అంతా మేం అనుకున్నట్లే జరుగుతుందని ఆశిస్తున్నా. ఇంత భారీ ప్రాజెక్టును రూపొందించడం రిస్క్‌గా అనుకోవడం లేదు. నేను దీన్ని ఎంజాయ్ చేస్తున్నా. మరి కొన్ని నెలల్లో మీరు దీన్ని ఆస్వాదిస్తారని అట్లీ తెలిపారు. ఇక తాజాగా వచ్చిన 'కాంతార చాప్టర్ 1'పై అట్లీ ప్రశంసలు కురిపించారు. అదో అద్భుతమన్నారు. 'కాంతార 1'ను నేను మొదటి రోజే చూశాను. విదేశాల్లో ఉండడంతో థియేటర్‌కు వెళ్లడం కోసం దాదాపు రెండున్నర గంటలు డ్రైవ్ చేసుకుంటూ వెళ్లాను. సినిమా చూడగానే రిషబ్‌కు ఫోన్ చేసి అభినందించా. నేను చాలా గౌరవించే వ్యక్తుల్లో రిషబ్ ఒకరు. నాకు మంచి స్నేహితుడు. ఇలాంటి సినిమాను రూపొందించడం ఎంత కష్టమో ఒక దర్శకుడిగా నాకు తెలుసు. రిషబ్ ఎంతోమందికి స్ఫూర్తి. ఆయన ఈ సినిమాతో మరో జాతీయ అవార్డు గెలుచుకోవాలని ఆశిస్తున్నానని అట్లీ తెలిపారు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNIVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**